VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

70359

6 పేజీలు, 7 నయాపైసలు రిజిష్టర్డు నెం. 203 A

# విశాలాంధ్ర

సంపుటి 12 | విజయవాడ • 8 మార్చి 1963 • శుక్రవారం | సంచిక 328

## మెట్రిక్యులేషన్ ప్యాసైన వారికి వృత్తి విద్యా కోర్సులు

ప్రారంభించడానికి ప్రభుత్వ యోచన.

న్యూఢిల్లీ, మార్చి 7

యూనివర్సిటీలలో ఒత్తిడిని తగ్గించేందుకు మెట్రిక్యులేషన్ ప్యాసైనవారికి వృత్తి విద్యలలో శిక్షణ నివ్వడానికి కోర్సులను ప్రవేశపెట్టే విషయమై విద్యామంత్రిత్వశాఖ ఆలోచిస్తున్నదని రాజ్యసభలో విద్యామంత్రి డాక్టర్ శ్రీమాలి తెలిపారు.



# గుల్హాతీ నివేదికను త్వరలో ప్రకటించాలని శాసనసభ్యుల డిమాండ్

## నివేదికాంశాలను మైసూరు ముఖ్యమంత్రి వెల్లడించగా రహస్యమెక్కడ అని ప్రశ్నల పరంపర

### గుల్హాతీ కమిషన్ నివేదిక

### ఇప్పుడు బయటపెట్టేదిలేదని లోక్‌సభలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 7

కృష్ణా-గోదావరి నదీజలాల వినియోగంపై గుల్హాతీ కమిషన్ నివేదికపై అందుకు సంబంధించిన వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను బయటపెట్టడానికి నేడు లోక్‌సభలో ఇరిగేషన్, విద్యుత్ శాఖా మంత్రి శ్రీ హాఫిజ్ మహమ్మద్ ఇబ్రహీం నిరాకరించారు.

ఈ సమస్యపై సభ్యులు అనేకసార్లు అడిగిన ప్రశ్నలకు నేడు మంత్రి సమాధానం చెప్పారు.

తాను ఒక నిర్ణయానికి వచ్చేంతవరకూ ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను రహస్యంగా కేంద్ర ప్రభుత్వం వుంచదలచిందని ఆయన చెప్పారు. కమిషన్ నివేదికను బయటపెట్టడం ప్రజాశ్రేయస్సుదృష్ట్యా మంచిది కాదన్నారు.

అంతకుముందు ఒక ప్రశ్నకు ఇరిగేషన్, విద్యుత్ శాఖా సహాయ మంత్రి శ్రీ ఓ. వి. అలగేశన్ సమాధానమిస్తూ గుల్హాతీ కమిషన్ నివేదిక యింకా ప్రభుత్వ పరిశీలనలో గలదని చెప్పారు. రాష్ట్రాలతో సంప్రతింపులు జరుగుతున్నాయనీ, త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోబడుతుందని తెలిపారు.

ప్రొఫెసర్ రంగా: గుల్హాతీ కమిషన్ కేవలం వున్న వాస్తవిక విషయాలను తెలుసుకొని నివేదించడానికి ఉద్దేశించబడిన కమిషన్ గాని, 1951 లో అందుకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకొన్న ఒడంబడికపై సిఫార్సులు చేసే హక్కును కలిగివున్న విషయం నిజం కాదా?

మంత్రి: కమిషన్‌ను తీర్పు చెప్పమని అడుగలేదు. కాని రెండు నదుల్లో ఎంతనీరు వుందో తెలుసుకోవలసిందిగా కమిషన్ కోరబడింది.

డాక్టర్ పి. ఆర్. దేశ్‌ముఖ్ అడిగిన ప్రశ్నకు మంత్రి హాఫిజ్ ఇబ్రహీం జవాబిస్తూ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకొన్న తరువాతనే గుల్హాతీ కమిషన్ నివేదిక బహిరంగంగా ప్రకటించబడుతుందన్నారు.

మరో సభ్యుని ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ కొంతమంది సభ్యులు గుల్హాతీ కమిషన్ నివేదిక విషయమై తనను కలుసుకొని విజ్ఞాపన పత్రాన్ని సమర్పించినమాట నిజమే నన్నారు.

మీకు అత్యవసరమైన
వాటినే కొనండి
న్యాయమైన ధరలనే
చెల్లించండి
ధరలను అదుపులో
వుంచండి

## నిర్ణయం తీసుకోనేముందే, నివేదికను ప్రచురించవలసిందిగా కేంద్రాన్ని కోరినట్లు మంత్రి సుబ్బారెడ్డి ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి) హైదరాబాద్, మార్చి 7

గుల్హాతీ కమిషన్ నివేదికపై కేంద్రం ఒక నిర్ణయాన్ని తీసుకునేముందే ఆ నివేదికను ప్రచురించవలసిందిగా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని విద్యుచ్ఛక్తిశాఖా మంత్రి శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి నేడు ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు.

మైసూరు ముఖ్యమంత్రి ఆ నివేదికాంశాలను బైట పెడుతుండగా ప్రభుత్వం ఇంకా ఆ నివేదికను రహస్యంగా ఉంచడం సరికాదని, వెంటనే నివేదికను ప్రచురించవలెనని పెక్కుమంది సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీ స్వర్ణ వేమయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, ఇంకా మరియుగ్గురు కలసి గుల్హాతీ కమిషన్ నివేదికను శాసనసభ ముందు ఉంచవలసిందిగా కోరగా, గుల్హాతీ నివేదిక సురహస్యంగా ఉంచమని కేంద్రం సూచించినందున తాను ఆ నివేదికను శాసనసభముందు ఉంచలేనన్నారు.

మైసూరు ముఖ్యమంత్రి శ్రీ నిజలింగప్ప మైసూరు శాసనసభ్యులకు గుల్హాతీ నివేదికలోని కొన్ని సిఫారసులను తెలియచేయగా మీరు ఎందుకు మాకు తెలియచేయరని శ్రీ వావిలాల ప్రశ్నించగా అలా గనుక జరిగివున్నట్లయితే మైసూరు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సూచనలను ధిక్కరించినట్లవుతుందని అన్నారు.

తెన్నేటి: గుల్హాతీ రిపోర్టు రహస్యమే కావచ్చు. అందులోని విషయం రహస్యం కాదుగదా అందువల్ల అదయినా చెప్పండి.

మంత్రి: ఈ అభిప్రాయాన్ని న్యాయశాఖ పరిశీలనకు పంపుతాను (నవ్వు)

వి. శ్రీకృష్ణ: పత్రికలవారికి కొన్ని వివరాలను కొంతమంది మంత్రులు చెబుతున్నారు. అటువంటప్పుడు మీరు మాకెందుకు చెప్పకూడదు?

మంత్రి: రిపోర్టును మీకు తెలియకుండా దాయాలని కాదు మా ఉద్దేశ్యం. కేంద్రంతో సంప్రదించి సాధ్యమయినంత త్వరలో నివేదికను సభముందు ఉంచుతాం.

పిల్లలమర్రి: ఎంతకాలం మీరు దీనిని రహస్యంగా ఉంచదలచుకున్నారు?

మంత్రి: అంతిమ నిర్ణయం జరిగేవరకు.

విశ్వేశ్వరరావు! గుల్హాతీనివేదికకు సంబంధించిన కొన్ని విషయాలను మేము పత్రికలలోచూస్తున్నాం. తద్వారా మాకు అనేక అనుమానాలు వస్తున్నాయి. అందువల్ల అటువంటి అనుమానాలు లేకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిది కాదా?

మంత్రి! అది చాలా క్లిష్టమైనపని.

జి. సి. కొండయ్య: కేంద్రంతో మీరు సంప్రతింపులు జరిపి; నదీజలాల విషయంలో మరొక నిర్ణయానికి వచ్చేముందు శాసనసభను సంప్రతించటం న్యాయంగా ఉంటుంది?

మంత్రి: నివేదిక శాసనసభ ముందు లేకుండా శాసనసభ ఈ విషయాన్ని చర్చించటం అసాధ్యం.

ప్రశ్న: ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకోబోతున్నదని కేంద్ర మంత్రి అన్నారు. అటువంటి నిర్ణయాలు తీసుకునేముందు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా చేయరాదని కేంద్రానికి తెలియజేస్తారా?

మంత్రి: అవును అలాగే చెప్పాను.

భాట్టం శ్రీరామమూర్తి: అత్యవసర పరిస్థితి ఉన్నప్పటికీ గుల్హాతీ నివేదికను ఒక ప్రక్కన పెడతామన్నారు గదా మళ్లీ తిరిగి ఈ సంప్రదింపులు ఎందుకు?

మంత్రి: కేంద్రం అలా చెప్పలేదు.

అప్పుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య లేచి నిజలింగప్ప గుల్హాతీ నివేదికలోని కొన్ని భాగాలను గురించి చెప్పినవార్తను చదివివినిపించి మరి యిటువంటప్పుడు శాసనసభకు తెలియచేయకుండా ఉండటంలో ప్రభుత్వ ఉద్దేశ్యమేమిటి అని ప్రశ్నించారు.

మంత్రి: మైసూరు ముఖ్యమంత్రి ఒక తప్పుచేస్తే మేముకూడా అదే చేయాలని లేదు.

ముఖ్యమంత్రి సభలో జోక్యంకల్పించుకొని నిజలింగప్పను గురించి ఇక్కడ చర్చించటం భావ్యం కాదన్నారు.

తిరిగి శ్రీ వావిలాల పత్రికలోని వార్తా భాగాలను చదివారు.

శ్రీ తెన్నేటి విశ్వనాథం అడిగిన మరొక ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ, గుల్హాతీ నివేదిక సిఫారసులను అమలు జరపడానికి శ్రీ హండా ఒక అధికారిగా నియమించబడ్డారని ఆయన ప్రత్యేక అధికారిగా నియమించబడిందీ లేనిదీ తనకు తెలియదన్నారు.

శ్రీ విశ్వనాథం: ఆయన ఏ హోదాలో ఇక్కడకువచ్చారో తెలియనప్పుడు మన కాగితాలను ఆయనకు ఎందుకు చూపనిచ్చారు?

మంత్రి: ఆయన కేంద్ర జలవిద్యుత్ కమిషన్ సభ్యునిహోదాలో వచ్చారు. ఈ విషయంపై సంప్రదించడానికి ఆయనకు

(మిగతా 2 వ పేజీలో)

## కృష్ణా, గోదావరి నదీజలాల బోర్డు

### తమకు సభ్యత్వం ఉండాలని మద్రాసు ప్రభుత్వం సూచన

మద్రాసు, మార్చి 6

కృష్ణా, గోదావరి నదీజలాల బోర్డులు ఏర్పాటు చేయాలని వాటిలో తమకు సభ్యత్వం ఉండాలని మద్రాసు ప్రభుత్వం శ్రీ ఎన్. డి. గుల్హాతీకి సూచించినట్లు నేడిక్కడ తెలియవచ్చింది.

నదీజలాల బోర్డులు ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా నియమించబడిన శ్రీ యన్. డి. గుల్హాతీ నేడిక్కడ మద్రాసు ప్రభుత్వంతో సంప్రతింపులు జరిపారు. ఆయన ఈ సందర్భంగా మద్రాసు ప్రభుత్వ ఇంజనీర్లు, ఇతర ఉన్నతాధికారులతో సంప్రదించారు.

కావేరీనదీ జలాలు పూర్తిగా వినియోగించబడినందువల్ల, ఆ నది ప్రత్యేకంగా నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయనవసరం లేదని మద్రాసు ప్రభుత్వం శ్రీ గుల్హాతీకి తెలియజేసిందని తెలుస్తున్నది.

## డిటెన్యూలకు సౌకర్యాలు

### రాజ్యసభలో ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 7

భారత రక్షణశాసనం క్రింద డిటెయిన్ చేయబడినవారికి కల్గచేయవలసిన సౌకర్యాలను గురించి రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్ని సూచనలను కేంద్ర ప్రభుత్వం పంపించినదని నేడు రాజ్యసభలో శ్రీ భూపేష్ గుప్త ప్రశ్నకు సమాధానంగా హోంవ్యవహారాలమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి తెలియజేశారు.

డిటెన్యూలకు కల్పించవలసిన సౌకర్యాలను గురించి నిబంధనలను రూపొందించుకొనే అధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలకు గలవనీ, ఆయన తెలిపారు.


నా వ్రేలు నీ కంట్లో....
నీ వ్రేలు నా నోట్లో....
ఆంధ్ర
మద్రాసు

'కృష్ణా, గోదావరి నదీజలాల బోర్డులలో మద్రాసుకు సభ్యత్వం కావాలి. కాని కావేరి నదికి బోర్డే అక్కరలేదు' — మద్రాసు ప్రభుత్వ వైఖరి.

## మరొక కొలంబో సమావేశం

### జరగదని ఐక్యఅరబ్బు రిపబ్లిక్ అధికారి వివరణ

కైరో, మార్చి 7

భారత-చైనా సరిహద్దు తగాదాను గురించి చర్చించేందుకు కొలంబో రాజ్యాల సమావేశం మరొకటి జరుగుతుందనే వార్తలు నిజం కావని ఐక్యఅరబ్బు రిపబ్లిక్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. కొలంబో రాజ్యాల సమావేశం మరొకటి కైరోలో జరుగుతుందనీ, మొదటి సమావేశంలో పాల్గొన్న సింహళ, ఐక్య అరబ్బు రిపబ్లిక్, ఘనా, బర్మా, కాంబోడియా, ఇండొనీషియా దేశాలు అలాగేకాకుండా, మరికొన్ని దేశాలు కూడా ఈ సమావేశంలో పాల్గొంటాయనీ వెలువడిన వార్తలను గురించి విలేకరులు ప్రశ్నించగా ఆ వార్తలు నిజం కావని, ఆ అధికారి అన్నారు.

ఐక్య అరబ్బు రిపబ్లిక్ ప్రధాని అలిసాబ్రీ ఏప్రిల్ నెలారంభంలో పెకింగ్ వెళ్తున్నారనికూడా ఈయన తెలిపారు. చైనా ప్రధాని చౌ ఎన్-లై ఆహ్వానంపైని ఆయన వెళ్తున్నారన్నారు. భారత-చైనా సరిహద్దు తగాదాపై కొలంబో సమావేశం చేసిన ప్రతిపాదనలనుగురించి చర్చించేందుకు ఆయన వెళ్తున్నారన్నారు.

# నాగార్జునసాగర్ కు అదనపు రుణం ఇవ్వడానికి కేంద్రం నిరాకరణ

## ఆంధ్ర శాసనసభలో ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి మంత్రి శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి వెల్లడి

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్ మార్చి 7

తృతీయ ప్రణాళికకాలంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు అదనపు ఋణం యివ్వడానికి జాతీయ అత్యవసర పరిస్థితి పేరుతో కేంద్ర ప్రభుత్వం నిక్కచ్చిగా తిరస్కరించిందని నీటి పారుదల, విద్యుచ్ఛక్తిశాఖ మంత్రి శ్రీ ఎ సి. సుబ్బారెడ్డి నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు.

1962 సెప్టెంబరు 7వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి ప్రణాళికా సంఘానికి వ్రాసిన లేఖలోని వివరాలను తెలియజేస్తూ శ్రీ సుబ్బారెడ్డి ఇలా అన్నారు:

"ముఖ్యమంత్రి తనలేఖలో నాగార్జున సాగర్ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా తీసుకొని కేంద్రమే ఈ వ్యయాన్ని భరించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత మరమ్మతుల బాధ్యత యథాతథంగా వహించుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం యిచ్చిన ఋణాన్ని తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన అక్కరలేకుండా చేయాలి. ఆ విధంగా చేస్తే ఈ ప్రాజెక్టుమీదవచ్చే ఆదాయాన్ని మాత్రమే తీసుకోవచ్చు. ఖర్చులు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం మినహాయించుకుంటుంది.

రాష్ట్ర ప్రభుత్వం సూచించిన రెండవ ప్రత్యామ్నాయం:

నాగార్జునసాగర్ ప్రాజెక్టు జాతీయ ప్రాముఖ్యంగల రాష్ట్ర ప్రాజెక్టుగా పరిగణించి మూడవ, నాల్గవ ప్రణాళిక వెలుపలనే ఉంచి కేంద్ర ప్రభుత్వమే మొత్తం ఖర్చులంతా భరించాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికయ్యే ఖర్చును కేంద్రం అదనంగా రాష్ట్రప్రభుత్వానికి యివ్వాలి.

3. నాగార్జున సాగర్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రణాళికకు నిమిత్తంలేకుండా కేటాయింపుగా ఉంచినట్లయితే తానే తృతీయ ప్రణాళికా కాలంలో యిచ్చిన రు. 45 కోట్లను రాష్ట్రంలోని మన్యరకం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు విద్యుచ్ఛక్తి, వైద్యం, రవాణా శాఖల అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసుకోడానికి వీలవుతుంది.

శ్రీ తెన్నేటి విశ్వనాథం: ఈ ప్రాజెక్టు విషయమై రాష్ట్ర ప్రభుత్వం వ్రాసిన లేఖ ఇదే మొదటిదా? ఇంతకుముందు ఏమైనా వ్రాశారా? వాటికి కూడా ఏమైనా సమాధానం వచ్చిందా?

మంత్రి: దీనికి సమాధానంగా మంత్రి కేంద్ర ప్రభుత్వం పంపిన ఒక జవాబును యిలా చదివారు: నాగార్జున సాగర్ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పరిగణించ డానికి వీలుపడదు. ఎందుకంటే భాక్రానంగల్, కోసీ,హిరాకుడ్ మొదలైన చాలా ప్రాజెక్టు లున్నాయి. అందుచేత ఈ ప్రాజెక్టు లన్నింటిని జాతీయ ప్రాజెక్టులుగా తీసుకోవలసివుంటుంది అందుచేత అదివీలు పడదు."

శ్రీ వల్లంకి విశ్వేశ్వరరావు: భాక్రానంగల్ ప్రాజెక్టును కేంద్రప్రభుత్వ ప్రాజెక్టుగా నిర్మించారు. దానిపై వెచ్చించిన డబ్బుకు వడ్డీ కూడా తీసుకోబోమని చెప్పారు. అందుచేత కనీసం తామిచ్చిన డబ్బుకు వడ్డీ అయినా మినహాయించాలని అడగరాదా?

మంత్రి: ఇంకా అనేక ప్రత్యామ్నాయ మార్గాలను దఫదఫాలుగా సూచించడం జరిగింది. యిచ్చిన ఋణం మీద వడ్డీని తిరిగి ఋణంగా యివ్వవలసిందని కూడా కోరాం.

శ్రీ వల్లంకి విశ్వేశ్వరరావు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సమాధానం యిస్తూ తృతీయ ప్రణాళికలో యింతవరకు కేంద్రం నుండి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఏమీ సహాయం పొందలేదని అన్నారు.

అంతకుముందు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న ప్రమాదాల గురించి శ్రీ ధర్మభిక్షం ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ ప్రమాదాలకు గురైనవారు ప్రభుత్వ శాఖలక్రింద పని చేస్తున్నవారు అయితే కార్మిక శాఖ నష్టపరిహారం యిస్తుందని అన్నారు.

నాగార్జునసాగర్‌లో ప్రమాదాలవల్ల 77 మంది మరణించారని అన్నారు. 3945 మందికి తీవ్రగాయాలు తగిలాయనీ, అందులో 3161 మందికి తగు పరిహారం యిచ్చి పరిష్కారం చేశారని అన్నారు.

# వెనుకబడిన ప్రాంతంలో మంచినీటి సరఫరా పథకాలకు సౌకర్యాలు

## పంచాయతీ రాజ్యం. ప్రణాళికాశాఖ పద్దును శాసనసభలో ప్రవేశపెడుతూ డాక్టర్ చెన్నారెడ్డి వివరణ

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, మార్చి 7

ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని గ్రామాలకు త్రాగేడి మంచినీరు లభింపజేయాలంటే తృతీయ ప్రణాళికలో మిగిలిన సంవత్సరాలలో (1962-66) 6 కోట్ల రూపాయలు వెచ్చించాలని, ఈ నిధిని సమకూర్చడానికి ప్రభుత్వం నిర్ణయించినదని పంచాయతీ రాజ్య, ప్రణాళికల శాఖామంత్రి డాక్టరు యం. చెన్నారెడ్డి నేడు శాసనసభలో 5 కోట్ల 96 లక్ష మేరకు ఈ శాఖ పద్దును ప్రవేశపెడుతూ అన్నారు. వెనుకబడిన ప్రాంతాలలో మంచినీటి సరఫరా పథకాలకు అదనపు సౌకర్యాలు కల్గించుతున్నామని అన్నారు.

మంచినీటి సౌకర్యం గురించి రాష్ట్రంలో పరిస్థితులను తెలుసుకోడానికి ఒక విధమైన పరిశీలన జరిపించామనీ, ఈ పరిశీలన ఫలితంగా రాష్ట్రంలో అన్ని గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్గించడానికై మొత్తం అవసరమవుతుందని నిర్ధారణ అయిందన్నారు.

పరిశీలనవివరాలను తెలియజేస్తూ శ్రీ చెన్నారెడ్డి రాష్ట్రంలోని గ్రామాలను నాల్గురకాలుగా విభజించవచ్చునని అన్నారు:

(1) అసలు ఏమీ మంచినీరు లేని గ్రామాలు (2) కొంత మంచినీటి సౌకర్యం కల్గి మరి కొంత సౌకర్యం కల్గించవలసినవి (3) గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్గి ఉండి ప్రత్యేక ప్రాంతాలలో అంటే, హరిజనవాడలు మొదలైన చోట్ల నీటి సౌకర్యం కల్గించవలసిన గ్రామాలు (4) పుష్కలంగా మంచినీటి సౌకర్యంకల్గి పరిశుభ్రపరచవలసిన మంచినీటి సరఫరా కావలసిన గ్రామాలు.

1962-66 సంవత్సరాలలో కావలసిన రు 6 కోట్లను సమవాటా గ్రాంట్ల ద్వారాను, సాంఘిక సంక్షేమ నిధుల ద్వారాను సమాజ వికాస కేంద్రాల నిధుల ద్వారాను సమకూర్చదలిచాము 1952-63లో ఇంతవరకు 1 కోటి 80లక్షలు ఇచ్చారు కుళాయిలద్వారాపరిశుభ్రపరచినటినీ సరఫరాపథకాలకోసం 8 కోట్లు మంజూరు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ విషయాన్ని ఇంకా పరిశీలిస్తున్నామని కేంద్రం సమాధానం చెప్పింది. 1963-64 లో పెద్ద పంచాయతీలలో కుళాయిల ద్వారా పరిశుభ్రపరచిన నీటి సరఫరా నిమిత్తం రు 10 లక్షలు గ్రాంటుగాను, రు 10 లక్షలు అప్పుగాను

(మిగతా 6 వ పేజీలో)

# రాజమండ్రిలోని డిటెన్యూలు హైద్రాబాద్ జైలుకు తరలింపు

హైదరాబాద్, మార్చి 7

రాజమండ్రి సెంట్రల్ జైలులోవున్న కమ్యూనిస్టు డిటెన్యూలందరినీ హైదరాబాద్ సెంట్రల్ జైలుకు మార్చి ఇక్కడున్న ఇతర కమ్యూనిస్టు డిటెన్యూలతో వుంచినట్లు ఇక్కడ తెలియవచ్చింది.

అలా రాజమండ్రినుండి హైదరాబాద్ సెంట్రల్ జైలుకు మార్చబడినవారిలో కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, పార్లమెంటు సభ్యుడూ అయిన శ్రీ మాకినేని బసవపున్నయ్య, పార్లమెంటు సభ్యుడు శ్రీ కొల్లా వెంకయ్య, పార్లమెంటుసభ్యుడు శ్రీ జి. యల్లమందారెడ్డి, నల్గొండజిల్లా కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ద్వానా నరసయ్య, కర్నూలుజిల్లానాయకుడు శ్రీ చండ్ర పుల్లారెడ్డి, వరంగల్ జిల్లా నాయకుడు శ్రీ యస్. వి. కె. ప్రసాద్, నెల్లూరు జిల్లా నాయకుడు శ్రీ పరుచూరి రామకోటయ్య వున్నారు. (వి. వి.)

# విజయనగరంలో వేయిమంది రిక్షా కార్మికుల సమ్మె

## అద్దె తగ్గించాలని డిమాండ్

విజయనగరం, మార్చి 6

విజయనగరంలో వేయిమంది రిక్షా కార్మికులు నేటికి మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. తాము, తమ రిక్షా యజమానుల కిచ్చే అద్దె తగ్గించబడాలనేది వారికోర్కె. ప్రస్తుతం రాత్రి పగలుకు కలిపి కొత్తబండికి రోజుకు రు. 2-50 లు, పాతబండికి రు. 2 లు యిస్తున్నారు దీనిని వరుసగా రు. 2లు, రు. 1-50 లుగా తగ్గించాలని వారు కోరుతున్నారు,

విజయనగరంలో ఈ మధ్య సిటీ బస్సులు (ప్రస్తుతం 2) నడుపుతున్నందువలన రిక్షా కార్మికులకు ఆదాయంతగ్గింది. కాని యజమానుల కిచ్చే అద్దెమాత్రం తగ్గలేదు.

రిక్షావారు కోరినదానిని కొందరు యజమానులు అంగీకరించారు. మరి కొందరు అంగీకరించలేదు. అందువల్ల అద్దెరేట్లు తగ్గించేవరకు సమ్మె జయప్రదంగా కొనసాగించుటకు కార్మికులు పట్టుదలతో వున్నారు. (వి. వి.)

# ప్రాణాలర్పిస్తామనే వ్యర్థ ప్రలాపాలకు నెహ్రూ నిరసన

పాట్నా, మార్చి 6

"చిట్టచివరి రక్తంబొట్టు వున్నంతవరకూ పోరాడుతాం; మా ప్రాణాలను అర్పిస్తాం" అంటూ వ్యర్థ ప్రలాపాలను చేసేవారిని ప్రధాని నెహ్రూ నేడిక్కడ సున్నితంగా విమర్శించారు.

చైనా మనపై దాడి చేసినప్పుడు దేశభక్తితో జాతి అంతా నిలబడటాన్ని ఆయన మెచ్చుకొన్నారు. అయితే "రక్తం చిందిస్తామనటంకంటే, తదేక దీక్షతో కష్టపడి పని చేయడమే ఒక్కొక్కసారి కష్టమైన విషయమని" శ్రీ నెహ్రూ స్పష్టపరచారు.

# రక్షణ సన్నాహాలకు సోవియట్ సాయం

## కేంద్రమంత్రి శ్రీ చావన్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 6

మిగ్ విమానాలను పంపడమేగాక, భారతదేశ రక్షణ అవసరాలకుగాను అదనంగా సోవియట్ యూనియన్ సహాయపడవచ్చునని రక్షణమంత్రి శ్రీ చావన్ తెలియజేశారు.

ఈ విషయాన్ని కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ రక్షణ వ్యవహారాల సలహాసంఘ సమావేశంలో ఆయన సూచనప్రాయంగా తెలియజేశారు.

రష్యా ఇస్తానన్న మిగ్ విమానాల్లో ఇప్పటికే సగం వచ్చాయి. తతిమ్మాయి త్వరలో వస్తాయి. ఇదిగాక మిగ్ విమానాలు తయారు చేసేందుకు భారతదేశంలో రెండు ఫ్యాక్టరీలను నిర్మించడంలో సహాయపడటానికి సోవియట్ యూనియన్ అంగీకరించింది. ఈ ఫ్యాక్టరీలు రెండు సంవత్సరాల తరువాత మిగ్ విమానాలు నిర్మించగలవు.

విశాలాంధ్ర

# అప్రమత్తత అవసరం

గుల్హాతీ కమిషన్ నివేదిక అధికారపూర్వకంగా విడుదల కాకపోయినా, అందులోని సమాచారం బైటకు పొక్కుతూనే ఉన్నది.

మైసూరు ముఖ్యమంత్రి శ్రీ నిజలింగప్ప ఆ నివేదికలోని సమాచారమంటూ కొన్ని విషయాలను మైసూరు శాసనసభ్యులకు నివేదించారు. ఆంధ్ర ప్రభుత్వం మాత్రం ఆ నివేదిక నింకా రహస్యంగానే ఉంచుతున్నది.

మద్రాసులో పత్రికల వారితో మాట్లాడుతూ ఆ కమిషన్ అధ్యక్షుడైన గుల్హాతీయే నివేదిక త్వరలో ప్రచురించబడు తుందన్నారు.

కేంద్ర ఇరిగేషన్ మంత్రి హఫీజ్ మహమ్మద్ మాత్రం కేంద్రం ఈ విషయమై ఒక నిర్ణయం తీసుకున్న మీదటనే నివేదికను ప్రచురిస్తామంటున్నారు.

ప్రభుత్వ వర్గాలే పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయటం వివాదాస్పదమైన ఈ వ్యవహారంలో శోచనీయం.

కనుక ఇక ఎట్టిజాగూ కాకుండా నివేదికను ప్రచురించటం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం.

ఇది ఇలాఉండగా నదీ జలాల వివాదంపై తిరిగి తమ తమ వాదనలను పొరుగు రాష్ట్రాలవారు పునరుద్ఘాటిస్తున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఏపరిస్థితిలోనూ అనుమతించరాదనికోరుతూ మహారాష్ట్రకు చెందిన కొందరు పార్లమెంటు సభ్యులు ప్రధానినెహ్రూను కలుసుకొనున్నారని తెలుస్తున్నది.

మైసూరు ముఖ్యమంత్రి నిజలింగప్ప, కృష్ణా నదీజలాల్లో తమకు 1200 శతకోటి ఘనపుటడుగుల నీరు వచ్చితీరాలిసిందేనని ప్రకటించారు.

వీటన్నిటికంటే మద్రాసు ప్రభుత్వ వైఖరి విచిత్రంగా ఉంది

కృష్ణా గోదావరి జలాల పంపకంపై ఏర్పడే బోర్డులలో తమకు సభ్యత్వముండాలని అయితే కావేరి నదిపై అసలు బోర్డే అక్కరలేదని ప్రస్తుతం మద్రాసులో ఉన్న గుల్హాతీకి మద్రాసు ప్రభుత్వం ఒక నివేదిక సమర్పించింది.

కావేరినదీజలాల వ్యవహారం మద్రాసు మైసూరుల స్వంత వ్యవహారమట. ఆ విషయంలో ఇతరుల జోక్యమే కూడదట. కృష్ణా, గోదావరి నదీజలాలబోర్డులలో మాత్రం మద్రాసుకుసభ్యత్వం ముండాలట.

అసలు రివర్ బోర్డుల పథకమే అనవసరంకాగా, అందులోనూ తిరిగి మినహాయింపులను కోరే మద్రాసు ప్రభుత్వవైఖరి గర్హనీయం.

మద్రాసునగరానికి 5 శతకోటి ఘనపుటడుగుల నీరు ఇవ్వటానికి అంగీకరిస్తూ ఆంధ్ర ముఖ్యమంత్రి ప్రకటించిన వెన్వెంటనే మద్రాసు ప్రభుత్వం ఇలాంటి పేచీకోరు వైఖరిని ప్రదర్శించటం శోచనీయం.

ఆంధ్రప్రభుత్వం ప్రదర్శిస్తున్న సామరస్యధోరణి కిది ప్రతిఫలమా?

1951 ఒప్పందం ప్రాతిపదిక పైన తప్ప మరోవిధంగా నదీజలాల వివాద పరిష్కారానికి తామంగీకరించేదిలేదని శ్రీ సంజీవరెడ్డి ప్రకటించారు. శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతించకపోతే, అసలు ఏ చర్చలలోనూ పాల్గొనబోమని కూడా ఆయన అన్నారు.

ఆదృఢ వైఖరినే ఆంధ్ర ప్రభుత్వం పట్టుదలగా ఇక ముందు కూడా అనుసరించాలని కోరుతున్నాము.

అంతర్రాష్ట్రీయ వివాదాల పరిష్కారానికి నిర్దిష్టమైన కొన్ని సూత్రాలు అవలంబించాలి.

అన్ని రాష్ట్రాలు అంగీకరించి, భాగస్వాములైన ఒప్పందాలను పాటించటం, ఏదైనాకొత్తసూత్రాన్ని వర్తింపజేస్తే, దానిని అన్ని రాష్ట్రాలకు సమానంగా వర్తింపచేయటం అనేవే ఆ సూత్రాలు.

ప్రస్తుత నదీజలాల వివాదంలో పొరుగు రాష్ట్రాలూ మద్రాసూ, అవలంబిస్తున్న వైఖరి ఇందుకు భిన్నంగా ఉన్నది.

పొరుగు రాష్ట్రాలు ఇలాంటిపేచీకోరు వైఖరినే పదే పదే ప్రదర్శిస్తున్నందున, ఆంధ్ర ప్రభుత్వం, ప్రజలు, ఈ వ్యవహారంలో ఎంతో అప్రమత్తత ప్రదర్శించ వలసిన అవసరం ఉంది.

శ్రీశైలం, పోచంపాడు, నాగార్జునసాగర్ పూర్తిస్వరూపం — ఈ ప్రాజెక్టులన్నీ 1951 ఒప్పందానికి అనుగుణంగానే మనం నిర్మించుకుంటున్నాము. వీటివలన ఆంధ్రకేగాక యావద్భారత దేశానికే లాభకరం.

ఈ ప్రాజెక్టులకు ఎట్టిహాని కలగకుండా రక్షించుకోవటం మన విద్యుక్తధర్మం. ఏ పరిష్కారానికైనా అదే ప్రాతిపదిక కావాలి.

# సుప్రీం సోవియట్‌కి 85 శాతం కొత్తఅభ్యర్థుల ఎన్నిక

## మూడోవంతు మహిళలు; కృశ్చేవ్ మొదలయిన అగ్రనాయకులు తిరిగి ఎన్నిక

మాస్కో, మార్చి 8

సుప్రీమ్ సోవియట్ ఎన్నికల్లో ప్రధాని క్రుశ్చేవ్, అధ్యక్షుడు లియోనిడ్ బ్రెజ్నేవ్, ప్రథమ ఉపప్రధానులు మికోయాన్, ఫ్రోల్ కోజ్లోవ్, ప్రథమ ఉపప్రధాని అలెక్సి కోసిగిన్ మొదలైన ప్రముఖ నాయకులందరూ తమ తమ నియోజకవర్గాల్లో తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని మాస్కో రేడియో నేడు ప్రకటించింది. ఎన్నికయినవారిలో 85 శాతం అభ్యర్థులు క్రొత్తవారని, మూడవవంతు మహిళలనీ మాస్కో రేడియో తెలిపింది.

ఎన్నికలకు అభ్యర్థులుగా నిర్ణయించిన కమ్యూనిస్టు పార్టీ సభ్యులూ, సభ్యులు కాని వారి పేర్లతో ఒకే ఒక జాబితాపై సోవియట్ ఓటర్లు ఓటు చేస్తారు. ఇష్టం లేనివారికి వ్యతిరేకంగా ఓటుచేసే హక్కు ఉంది.

సోవియట్ రిపబ్లిక్ లన్నిటిలో, పెద్దదయిన రష్యన్ ఫెడరేషన్‌లో ఏడు కోట్ల 80 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు చేశారు. 8,31,000 మంది వ్యతిరేకంగా ఓటు చేశారు. 881 బ్యాలట్ కాగితాలు చెడిపోయాయి.

అత్యధిక ఓటింగు జరిగినది టర్క్‌మెనియా, ఉజ్బెకిస్తాన్ రిపబ్లిక్ లలో. అక్కడి సుప్రీమ్ సోవియట్ ఎన్నికల్లో 99 పాయింట్ 99 శాతం ఓటర్లు ఓటు చేశారని మాస్కో రేడియో తెలిపింది.

# తిరుపతిలో స్వర్ణకారుల వూరేగింపు

తిరుపతి, మార్చి 8

తిరుపతి విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘీయులు సుమారు నూరుమంది ఫిబ్రవరి 28 న పట్టణ వీధులలో వూరేగింపు జరిపారు. బంగారు కంట్రోలు నిబంధనలవల్ల జీవనాధారాలు పోయిన స్వర్ణకారులకు వుద్యోగవసతి కల్పించాలనీ, వారి పిల్లలకు వుచిత విద్యా సౌకర్యం కలిగించాలనీ, చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోదలచిన వారికి అప్పులరూపంలో సహాయించాలనీ, తమ కుటుంబాలకు జీవన భృతి కల్పించమనీ వారు నినాదాలు చేశారు.

పాతమంత్రం గాలి వీధిలో జరిగిన సభకు తిరుపతి స్వర్ణకారుల సంఘ అధ్యక్షులు శ్రీ నటేశ ఆచారి అధ్యక్షత వహించారు. బంగారు వ్యాపారి శ్రీ శంకరలాల్, సంఘ కార్యదర్శి నగిరాలు కూడా వుపన్యసించారు. జిల్లాకలెక్టర్ కు, ఆంధ్రప్రభుత్వమువారికి మెమోరాండం పంపుటకు తీర్మానించారు. (వి.వి)

# కొత్త రైల్వేమండల స్థాపన సమస్య

## పరిశీలనకు రైల్వేమంత్రి సుముఖత

న్యూఢిల్లీ, మార్చి 8

రైల్వే మండలాల పునర్వ్యవస్థీకరణ విషయంలో తాను ఎలాంటి ఖచ్చితమైన అభిప్రాయాన్ని ఇప్పటివరకూ ఏర్పరచుకొనివుండలేదనీ, అవసరమైతే కొత్తరైల్వే మండలాన్ని ఏర్పరచే విషయాన్ని పరిశీలించడానికి తాను వెనుకాడననీ రైల్వే మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ నేడు లోక్ సభలో అన్నారు.

రైల్వే బడ్జెట్‌పై లోక్ సభలో మూడు రోజులపాటు జరిగిన చర్చకు శ్రీ స్వరణ్ సింగ్ జవాబిస్తూ సమర్థవంతంగా పనిజరగడం, ప్రయోజనకారిగా వుండటం – ఈ రెండే కొత్త రైల్వే మండలాన్ని నెలకొల్పేటప్పుడు ఆలోచించవలసిన విషయాలన్నారు.

అయితే ప్రస్తుత అత్యవసర పరిస్థితులలో కొత్తమండలాన్ని ఏర్పరచడంవలన కలిగే మార్పులను గురించికూడా ఆలోచించవలసి వుంటుందన్నారు.

రైల్వేలను ప్రజోపయోగకరమైన సంస్థగా చూడకుండా ఒక వాణిజ్య సంస్థగానే పరిగణించాలన్న ఒక కాంగ్రెసుసభ్యుని సూచనను మంత్రి త్రోసిపుచ్చారు. రైల్వేలు ప్రజోపయోగకరమైన సంస్థలన్న విషయాన్ని మరచిపోరాదని, అదేసమయంలో ఆర్థిక స్థిరత్వం, క్రమశిక్షణ మొదలుగాగల విషయాల్లో వాణిజ్యసంస్థగా పరిగణించవలసి వుంటుందని ఆయనన్నారు.

# లుముంబా హత్య గురించి యధార్థం

## తెలుసుకోడానికి చర్యలు తీసుకోవాలని ఘనా డిమాండు

విరాప, మార్చి 8

కాంగో అమరవీరుడు లుముంబా హత్యను గురించి యధార్థాన్ని తెలుసుకోడానికి భద్రతాసంఘం తగు చర్యలు తీసుకోవాలని ఘనా ప్రభుత్వం నేడు కోరింది.

## కత్తిరింపులు

# పన్నుల పరమావధి

భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీ దేశాయిగారు 28 వ తేదీ సాయంత్రం లోక్‌సభలో బడ్జెట్టును ప్రవేశపెట్టిరి. బహుశా ఇది విని గుండె పగిలినది కాబోలు మనమాజీ ప్రధానాధ్యక్షుడు రాజేంద్రప్రసాద బాబుగారు ఉన్నట్టుండి ఆ రాత్రియే దివంగతులైరి.

కారేగాదు. ఈ బడ్జెట్టు ప్రతిపాదనలను క్రొత్త టాక్సులను చూచినయెడల ఎవ్వరి గుండెలైన ఆగిపోవలసినదే. రాబోవు సంవత్సరం కేంద్ర ప్రభుత్వ వ్యయం 1852 కోట్లు 40 లక్షలని అంచనా వేయబడినది. రాబడి 1585 కోట్ల రూపాయల 73 లక్షలగునట. అనగా ఈ సంవత్సరమునకే లోటు రూ. 266 కోట్ల 67 లక్షల రూపాయలు. ఇది భర్తీ చేసుకొనుటకు విధించిన క్రొత్త పన్నులవలన 275 కోట్లు నిరు లక్షల రూపాయలు రాబడి ఏర్పడునట...

* * *

ఇంతటి హెచ్చు పన్ను లీసంవత్సరము విధింపబడుటకు కారణము చీనాతో సంభవించిన యుద్ధమనియందురు. నిజమే యుద్ధము జరుగకపోయిన ఇది తగ్గింపబడునా? చెల్లించిన వారికి వాపసు ఇచ్చెదరా?

అట్లుకాదు. యుద్ధము జరిగినను, జరుగక పోయినను మనము ఆయుధములను సేనలను సమకూర్చుకోవలెను. కావున ఈ పన్నుల మొత్తము అందుకై వినియోగమై పోవును. కాబట్టి వాపసు ఇచ్చుట సాధ్యము కాదందురు. వాస్తవమే కాని ఈ విధముగు పన్నులు ఎన్నేండ్ల తర్వాత నిలిపివేయబడును? దానికి వ్యవధిలేదు. చీనావలన మనకు సంభవించు భయమునకు ఎట్లు పారము లేదో అట్లే ఈ పన్నులకును ఒక వ్యవధి, పారము ఉండదు. చీనా వలన భీతి తప్పిన పాకిస్తానము తోడి భయము! ఏదో భయకారణ ముండక తప్పదు. కావున ఈ పన్నులు ఇంకను హెచ్చుటే గాని తగ్గుట ఎన్నడును సంభవించదని ఊహించి చెప్పవచ్చును. మరి ఎన్నడైన ఎప్పుడైన వేసిన పన్నులు తగ్గించుట జరిగినదా! 120 కోట్ల భారత బడ్జెట్ 8400 కోట్లకు పెరిగినది. ఈ పెరుగుదలను ఆపివేయగల మహానుభావుడు పుట్టునా? పుట్టినను అతనికి అధికారము దక్కునా?

ఈ బడ్జెట్టులో సాధ్యమైనన్ని వస్తువుల మీద పన్ను హెచ్చించుట జరిగినది. అంతేకాక వేసిన పన్నులు కూడ అధికముచేయుట జరిగినది. దక్కార మూలు వస్త్రములు, పాద రక్షలు, అగ్గిపెట్టెలుమీదమాత్రమే పన్ను హెచ్చింపలేదు. వెజిటబిల్ ఆయిల్ అనగా పంట విత్తులలో తయారగు నూనెమీద పన్ను తగ్గించబడినది. కారణము స్పష్టమే. ఏమన ఆ వస్తువులు విదేశములకు ఎగుమతి కావలసినవి. వానికి పైదేశములలో పోటీ వున్నది. కావున మన సరకు వికువలగుట లేదు. విదేశీమారకపు ద్రవ్యము మనకు కావలెను. వానిమీద ఎక్సైజ్ పన్నును ఇంకను హెచ్చించినయెడల అవి ఇతర దేశములలో అమ్ముడు పోకాలవు. కావున వానిమీద పన్ను హెచ్చించుట జరుగలేదు. అంతేగాని బీదలమీద దయతో చేసిన పని గాదది.

అట్లు బీదలపైన దయకలిగిన ప్రభుత్వమైనచో కరసనాయుల్ మీద సీసా ఒక్కింటికి పది నయాపైసలు వంతున పన్ను హెచ్చించెడిది కాదు. ఇప్పటికే దాని ఖరీదు సీసా ఒక్కింటికి నాలుగణా లున్నది. ఇంకమీదట ఆరు అణాలు అమ్మగలరు. ఎలెక్ట్రిసిటీ పల్లె పల్లెలకును ఇంకను ప్రాకలేదు. ప్రాకినను బీదలు గుడిసెలో ఉంచు దీపమునకు కిరసనాయిలే గతి. ఇప్పటికే కొనలేని ధర దానికి ఉన్నది, ఇంక ఒకటికి ఒకటిన్నర మైనచో గతియేమి?

పల్లెలలోని బీదలకేగాదు. పట్టణవాసులైన మధ్యతరగతివారికికూడ నీరు వంట చెరకులులేక కిరసనాయిల్ స్టవులమీద వండుకొనుచున్నారు. ప్రజలు నీరు కాచుకొనుట, వండుకొనుట ఎట్లని ప్రభుత్వం పాటించుటయేలేదు. స్వంత పొలములలో కొట్టి తెచ్చుకొన్న కట్టెలనుగూడ నిరోధించుటకు పట్టణద్వారములలో ఫారెస్టు నాకాలు నిర్మింపబడినవితప్ప ఇంధనము లేనిదే పొయ్యి రాజదను భావమే ప్రభుత్వమునకులేదు. కావుననే ఇంటింటను కిరసనాయిల్‌తో వంటవ్యవహారము జరుగుచున్నది. ఇంక దాని ధరగూడ నూటికి ఏబది వంతులు పెరిగినప్పుడు ప్రజలు అపక్వాహారము కలవాటు చేసుకోవలెను. మూడు పైస లున్న తపాలా కార్డు ఆరుపైసలై స్వరాజ్యమువచ్చినతర్వాత పదిపైసలై ఇప్పుడు 12 పైసలు (ఆరు నయాపైసలుగా) చేయబడినది. అదిగాక తంతివార్తలు రిజిస్ట్రీలు, తిరుగు రశీదుల రేటు హెచ్చు చేయబడినది. పల్లెగాముల ధరలసంగతి అట్లుండనిండు. పేదల కుపయోగకరమైన కార్డుల ఖరీదునైన పెంచకుండ వలసినది.

ఇంక ఇతర విషయములను తడవు కొన్నచో ఈ పత్రికలో ప్రచురణ కవకాశముండదు. ఇది చీనా యుద్ధమువలన కలిగిన అవసరపుబడ్జెట్టనుకుంటే ప్రజలు లూటీ బడ్జెట్టు అన్నచో సార్థకముగా నుండును.

(సాధన పత్రిక మార్చి 3 శనివారం సంచిక నుండి.)

# శిస్తు రెట్టింపయినా రైతు వసతులకై ఖర్చు స్వల్పం: శ్రీ అరిసెనపల్లి వెంకటేశ్వరరావు విమర్శ

హైదరాబాద్, మార్చి 8

1954 నుంచి 1962 మధ్యకాలంలో భూమిశిస్తు 48 శాతం పెరిగిందనీ, అదనపు భూమిశిస్తుచట్టంవల్ల వసూలయ్యే మొత్తంతో కలిపినట్లయితే అది దాదాపు నూరు శాతం పెరగగలదనీ, రైతాంగం నుంచి వసూలుచేయబడే అంత పెద్ద మొత్తంలో చాలా ఎక్కువ భాగం పరిపాలనా వ్యవహారాలకే ఖర్చుపెట్టబడుతూ, కొద్దిభాగం మాత్రమే రైతాంగం సదుపాయాల నిమిత్తం ఉపయోగించబడుతున్నదనీ, ఇది చాలా విచారకరమని శ్రీ అర్శినపల్లి వెంకటేశ్వరరావు (క. ప్ర. సం.) నేడు ప్రదేశ్ శాసనసభలో వక్కాణించారు.

రెవెన్యూ పద్దుపై జరిగిన చర్చను ప్రతిపక్షం తరుపున ముగిస్తూ శ్రీ వెంకటేశ్వరరావు ఈ విషయం పేర్కొన్నారు.

తెలంగాణా కౌలుదారీ చట్టంలో 47, 48 సెక్షనుల ప్రకారం జరిగిన వేలాది భూముల మార్పిళ్ల సంఘటనలను చట్టబద్ధం చేయవలసిన అవసరంపై విభిన్నాభిప్రాయానికి తావులేదని, అయితే ఇటీవల హైకోర్టు తీర్పు దృష్ట్యా ఈ మార్పిళ్లు అక్రమమైనవని పేర్కొనబడ్డాయని ఆయన అన్నారు. కీ॥ శే॥ కె. వెంకట్రామారెడ్డిగారు రెవెన్యూ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ఈ మార్పిళ్లపై హక్కుల నిర్ణయాన్ని సవరించ దలపెట్టగా, అలాంటి సవరణ వల్ల భూస్వాములకే ప్రయోజనం కలుగుతుందనే ఉద్దేశంతో ప్రణాళికాసంఘం ఈ సవరణను వ్యతిరేకించిందని చెప్పారు. అయితే ప్రస్తుతం పరిస్థితి చాలా మార్పు చెందింది. అనేక ప్రాంతాలలో భూస్వాములు కౌలుదార్లను తొలగించుతామని బెదరించడమేకాక, కొన్ని ప్రదేశాలలో కౌలుదార్లు ఇప్పటికేప్పుడే బేదఖలు చేయబడ్డారుకూడా. అందుచేత ఈ మార్పిళ్లను అతి శీఘ్రంగా చట్టబద్ధం చేయాలని ఆయన హెచ్చరించారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"తెలంగాణా కౌలుదారీ చట్టంలో సెక్షన్ 38 ఇ) ప్రకారం భూమిపై హక్కుకు సంబంధించి పెద్ద వివాదం ఉంది. దీని ప్రకారం కౌలుదార్లు రక్షిత కౌలుదార్లుగానే గుర్తించబడ్డారు. వారికి కొన్ని నియమాలకు లోబడి ఈ భూములపై యాజమాన్యం హక్కు లభిస్తుంది. తెలంగాణాలో ప్రస్తుతం 3,18,688 మంది రక్షిత కౌలుదారులున్నారు. వారి క్రింద దాదాపు 21,18,518 ఎకరాల భూమి వుంది. అలాగే 1,34,350 మంది అరక్షిత కౌలుదార్లున్నారు. వారి క్రింద దాదాపు 3,58,811 ఎకరాల భూమి వుంది.

అరక్షిత కౌలుదార్లకు వారి క్రింద ఉన్న భూములపై పట్టాలివ్వే విషయంలో, రక్షిత కౌలుదార్లకున్నట్లు యాజమాన్యం హక్కు గుర్తించబడినా ప్రభుత్వం ఇచ్చే అప్పులు, అడ్వాన్సులు మొదలగు ప్రయోజనాలు వారు పొందలేకపోతున్నారు. అందుచేత సమగ్ర కౌలుదారీ చట్టాన్ని తెలంగాణాకు వర్తింపజేసే దాకా ఈ సమస్యను ఆపివుంచడానికి వీల్లేదు.

## వివాదాల తీర్పు

ప్రస్తుతం అమలులోవున్న తెలంగాణా కౌలుదారీచట్టం ప్రకారం రెవెన్యూ అధికారులకు కౌలుకు సంబంధించిన వివాదాలు విని తీర్పుచెప్పే అధికారం ఇవ్వబడింది. అయితే వారికి తగినంత వ్యవధి లేకపోవటంవల్ల, ఇలాంటి వివాదాలు త్వరగా పరిష్కరించబడటంలేదు. ఈనాడు ఇలాంటివి వేలకొలది సంఘటనలు అపరిష్కృతంగా నిలబడి పోయాయి. అందుచేత ఈ వివాదాల కేసులు సాధారణ కోర్టుల పరిష్కారానికి పంపాలి. 1958 లో అమలు జరుపబడ్డ ఆంధ్ర కౌలుదారీచట్టం ప్రకారం 21,303 వివాద సంఘటన లుండగా, వాటిలో కేవలం 1047 కేసులుమాత్రమే పరిష్కరించబడ్డాయి.

మూడవ వర్గీకరణంక్రింద ఉన్న దాదాపు 50 శాతం భూములవిషయంలో అదనపు భూమిశిస్తు చట్టంవల్ల కించిత్తు న్యాయంకూడా కలుగలేదు. ఈ భూములపై శిస్తు ఏడునుంచి పద్నాలుగు రూపాయలకు పెంచబడింది. అనేక సంవత్సరాలలో గరిష్ఠ రేటు శిస్తు విధించబడింది.

## బంజర్ల పంపకం

అటుపిమ్మట ఆయన బంజరుభూముల విషయం ప్రస్తావించి, అనాక్రమిత బంజర్లను సైనికసిబ్బందికి కేటాయించి, మిగతా భూమిని పేదవారికి పంచి పట్టాలివ్వాలని సూచించారు. తెలంగాణాలో సాగుకులాయకేఅయిన బంజరు భూమి 80 లక్షల ఎకరాలున్నదని, ఆంధ్రప్రాంతంలో 12 లక్షల ఎకరాలున్నదని 1959 లో అప్పటి రెవెన్యూ మంత్రి కీ. శే. కళా వెంకటరావు ప్రకటించారని, 1961-62 నాటికి తెలంగాణాలో 12 లక్షల ఎకరాల బంజరు పండగా దాదాపు 20 లక్షల ఎకరాలు పంపకానికి మిగిలివున్నదని చెప్పారని, ఇప్పుడేమో కేవలం 7 లక్షలు ఎకరాలు మాత్రమే పంచవలసి ఉన్నదంటున్నారనీ, ఈ వైరుధ్యానికి కారణమేంటో తనకు తెలియటంలేదని శ్రీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

## ఆదివాసులకు బంజర్ల పంపకం

వరంగల్లు జిల్లా నర్సంపేట తాలూకాలో ఆదివాసులకు అరణ్య ప్రాంతాలలో భూములు పంచి పట్టాలిచ్చారే కాని, ఆ భూములన్నీ వాస్తవంగా స్వాధీనము చేయలేదని ఆయన తెలియజేశారు.

రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు క్రిమినల్ లా చట్టంలోని 107, 45 సెక్షనులక్రింద తమకున్న అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని, జమీందార్లకిచ్చే నష్టపరిహారాన్ని నిర్బంధ పొదుపుక్రింద జమకట్టాలని ఆయన సూచించారు.

శ్రీ ఇ. ఎతిరాజారావు (క.ప్ర.సం.) మాట్లాడుతూ, ఫీటీపనుల వర్గీకరణక్రింద 5 వేల ఎకరాల ఆయకట్టు గల భూములపై అదనపు భూమిశిస్తు చట్టం ప్రకారం రు 14 లు శిస్తు విధిస్తున్నారని, అంతకు క్రితం కొన్ని భూములపై విధించే రు 17 ల శిస్తును రు 14 లకు తగ్గించాలని కోరారు.

జనగామ తాలూకాలో గ్రామోద్యోగులకు స్టేషనరీ వస్తువులు సప్లయి చేయాలని కోరారు.

వరంగలు జిల్లా పరిపాలనా వ్యవహారాలలో రెవెన్యూమంత్రి జోక్యం భరించ శక్యంగాకుండా వున్నదని, అతి స్వల్ప విషయాలలోనూ, తనకు చెందని శాఖల విషయంలోనూ ఆయన జోక్యం కలిగించుకుంటున్నారని శ్రీ యతిరాజారావు పేర్కొన్నారు.

చిన్న కోడూరు గ్రామంలో గల రెవెన్యూమంత్రి అనుయాయులు చివరకు భూమిశిస్తు కూడా చెల్లించలేదనీ, ఏనా రెవెన్యూ అధికారులు వారిని శిస్తు విషయం సాహసించి అడగలేదనీ ఆయన అన్నారు.

పాకాలచెరువుక్రింద అదనంగా మరో మూడు వందల ఎకరాలకు నీరు సరఫరా చేయవలసిందని నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి వరంగల్లు జిల్లా కలెక్టరును ఆదేశించగా, రెవెన్యూ మంత్రి జోక్యం కలిగించుకొని ఈ సహాయాన్ని ఆపు చేయించారని, అలాగే ధర్మసాగర్ చెరువుక్రింద రెవెన్యూమంత్రి తన అనుయాయులకు ఒక స్లూయిస్ ద్వారా నీరు సరఫరా చేయించారని, అదేసమయంలో ఇతరులకు రెండో స్లూయిస్ ద్వారా నీరు సరఫరా నిరాకరించబడిందని శ్రీ యతిరాజారావు తెలియజేశారు.

రెవెన్యూమంత్రి అనుమతి లేకుండా ఏ ఇతరమంత్రి వరంగల్లుజిల్లాలో పర్యటించలేరని, ఆయనజోక్యంవల్ల నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఎ సి. సుబ్బారెడ్డి తన పర్యటనను విరమించుకొన్నారనీ, అలాగే శ్రీ సంజీవయ్య మంత్రివర్గ హయాములో అప్పటి రెవెన్యూమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి కూడా ఒకసారి తన పర్యటన రద్దుచేసుకొన్నారని ఆయన చెప్పారు.

శ్రీ కాంతయ్య (కాంగ్రెస్) మాట్లాడుతూ రైతులపై పన్నులు పెంచబడ్డా వారికి కావలసిన ఎరువులు, క్రిమిసంహారక మందులూ, అప్పులూ మొదలైనవాటిని సమకూర్చటం లేదని చెప్పారు.

## శ్రీ వాదిలాల విమర్శ

ఇండిపెండెంటు సభ్యుడు శ్రీ వాదిలాల గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ, గుంటూరు జిల్లా కలెక్టరు ఈనాటికీ బ్రిటిష్ రాణివున్న ముద్రనే ఉపయోగిస్తున్నారనీ, అందుచేత మనమిప్పుడు స్వరాజ్యంలో ఉన్నామో, లేక ఇంగ్లీషు పరిపాలన క్రింద ఉన్నామో ఆశ్చర్యకరంగా ఉందన్నారు. (శ్రీ వాదిలాల అలాంటి ముద్రతో వున్న కాగితాన్ని స్పీకరుస్థానంలో వున్న డిప్యూటీస్పీకర్ కు ఇవ్వగా ఆయన రాణిముద్రను పోలి వున్నదని ఆయన అన్నారు.)

రెవెన్యూబోర్డు సభ్యులూ, అధికారులు కూడా తమ అధికారాలను ప్రజల ఉపయోగార్థం కాక, తమ స్వంత ప్రయోజనాలు సాధించుకోడానికి వినియోగిస్తున్నారని శ్రీ వాదిలాల విమర్శించారు. ఒక రెవెన్యూబోర్డు సభ్యునికి తూర్పు గోదావరిజిల్లాలో వెయ్యి ఎకరాలభూమి ఉందనీ, ముందు ఈ పొలానికి నీరు అందిన పిమ్మటనే మిగతా పొలాలకు నీరు అందించబడుతుందనీ ఆయన అన్నారు.

అనేక సందర్భాలలో మంత్రులిచ్చే ఉత్తరువులు వార్తాపత్రికలలో చదవడానికి రసవత్తరంగా వుంటాయనీ, అయితే అవి బహు అరుదుగా మాత్రమే అమలు జరుపబడుతుంటాయని ఆయన పేర్కొన్నారు.

తుంగభద్ర ప్రాజెక్టుక్రింద ఆయకట్టు భూములు మాగాణి భూమిగా మార్చాలని శ్రీ టి. కె. ఆర్. శర్మ (సి. డి) కోరారు.

రెవెన్యూ అధికారులు రెవెన్యూబోర్డు శాఖల ఉత్తర్వుల విషయంలో శాసనసభ్యులను తప్పుదారులు పట్టిస్తున్నారని శ్రీ సి. హెచ్. రామయ్య చౌదరి (కాంగ్రెసు) పేర్కొన్నారు.

శ్రీ జి. పి. వెంకన్న (ఇండి) మాట్లాడుతూ కరువు ప్రాంతాలలో కరువు నివారణ పథకాన్ని అమలు జరపాలని కోరారు.

ఆరుట్ల రామచంద్రారెడ్డి కమ్యూనిస్టు (ప్రజా.సం.) మాట్లాడుతూ తెలంగాణా కౌలుదారీ చట్టాన్ని చట్టబద్ధం చేయక పోయినట్లయితే దాదాపు 20 నుంచి 80 లక్షలదాకా కౌలుదార్లు బేదఖలు చేయబడతారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను గత రెండేండ్ల నుంచి తేల్చకుండా నిలిపి వుంచుతోందని, కనీసం రాష్ట్రప్రభుత్వమైనా ఈ చట్టంలో 5 వ అధ్యాయంక్రింద గల 98 వ సెక్షను రద్దుచేసి, ప్రస్తుత శాసనసభ సమావేశంలోనే ఇందుకనుగుణంగా ఒక సవరణ బిల్లు తేవాలనిసూచించారు.

# బడ్జెట్‌పై రాజ్యసభ చర్చ కొనసాగింపు

న్యూఢిల్లీ, మార్చి 8

రాజ్యసభలో నేడు మూడో రోజు బడ్జెట్‌పై చర్చ జరిగినప్పుడు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించని సివిల్ ఖర్చులను బాగా తగ్గించడానికి అవసరమైన చర్యలను తీసుకోవలసిందిగా అన్ని పార్టీలకు చెందిన సభ్యులుకోరారు. రక్షణ కోసమూ, అభివృద్ధి పథకాల అమలుకోసమూ అవసరమైన డబ్బును సంపాదించేందుకు ఆర్థికమంత్రి తీసుకొంటున్న సాహసవంతమైన చర్యలను సభ్యులు శ్లాఘించారు. అయితే, కిరోసిన్, మరికొన్ని నిత్యావసర వస్తువులపై డ్యూటీలు మినహాయించాలనీ, కేవల మధ్యతరగతి ప్రజల కష్టాలను తగ్గించడానికి ఇది అవసరమని పలువురు సభ్యులు తెలియజేశారు.

కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీ ఖండూభాయి దేశాయి "బడ్జెట్ చక్కగా రూపొందించబడింద"ని, "సోషలిస్టు స్వభావం కలద"ని మెచ్చుకున్నారు.

నామినేటెడ్ సభ్యుడు ప్రొఫెసర్ ఎ. ఆర్. వాడియా పి యస్ పి సభ్యుడు శ్రీ ఆర్. పి. సిన్హా గార్లు కూడా బడ్జెట్ ప్రతిపాదనలను శ్లాఘించారు.

దేశ రక్షణకోసం విదేశాలనుండి సహాయం తీసుకోవడానికి ప్రభుత్వం వెనుకాడరాదని శ్రీ సిన్హా అన్నారు.

# వ్యవసాయ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రభుత్వ వైఫల్యం

## శాసనసభలో వ్యవసాయ పద్దుపై చర్చను ప్రారంభిస్తూ శ్రీ కట్టూరి రామచంద్రారెడ్డి విమర్శ

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, ఫిబ్రవరి 8

కమ్యూనిస్టు ప్రజాతంత్రపక్ష సభ్యుడు శ్రీ కట్టూరి రామచంద్రారెడ్డి నేడు వ్యవసాయం పద్దుపై జరిగిన శాసనసభా చర్చను ప్రారంభిస్తూ "ఒకవైపున దేశంలో అత్యవసర పరిస్థితి ఉన్నదనీ, ఉత్పత్తిని అధికం చేయాలని చెపుతూ ఈ సంవత్సరము గత సంవత్సరం కేటాయించిన మొత్తంకంటె 43 లక్షల మేరకు వ్యవసాయ పద్దుక్రింద తగ్గించటం ఆశ్చర్యకరమ"న్నారు.

వ్యవసాయ ఉత్పత్తి లక్ష్యాలను సాధించటంలో రెండవ ప్రణాళిక కాలంలో విఫలం అవటమేగాకుండా, మూడవ ప్రణాళిక మొదటి సంవత్సరములోకూడా ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు.

రైతుల యెడ ప్రభుత్వం అవలంబించే అపసవ్య వైఖరి, ఎరువుల పంపిణీలో జరిగే అవకతవకలు, అదుపులేక పడిపోతున్న ధాన్యంధరలు మొదలయిన విషయాలపై ప్రతిపక్ష సభ్యులతోపాటు శ్రీ యల్. లక్ష్మణదాస్, ఘట్టం శ్రీరామమూర్తి లాంటి ప్రముఖ కాంగ్రెస్‌వాదులుసైతం ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రతివారు రైతుల అవసరాలు తీర్చటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు.

శ్రీ యల్. లక్ష్మణదాస్ (కాంగ్రెస్) దినదినం హీనస్థితికి దిగజారిపోతున్న పేదరైతుల పరిస్థితిని పరిశీలించేటందుకు ఒక కమిషన్‌కు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలక్రితమే తీసుకున్న ఎస్టేటు ప్రాంతాలలో ఇంతవరకు మైనర్ ఇరిగేషన్ పథకాలు చేపట్టకపోవటం విచారకరమన్నారు.

శ్రీ కె. వి. నారాయణరెడ్డి (యు. డి. యఫ్.) మాట్లాడుతూ ధరల స్థిరీకరణ అవసరమని, కాని ప్రభుత్వం నిర్ణయించిన ధర అటు ఉత్పత్తిదార్లకు ఇటు వాడకందార్లకు ఉపయోగపడకుండా పోతున్నదన్నారు.

శ్రీ ఎ. పర్వతేశ్వరరావు (పి. డి. యల్. యఫ్.) ప్యాకేజీ స్కీమును సమర్థిస్తూ దానిని అమలుజరపడంలో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపారు. మురుగునీటి పారుదల సౌకర్యాలు లేనందున పంటలు దారుణంగా పాడైపోతున్నాయన్నారు.

శ్రీ పి. డి. నాయుడు (స్వతంత్ర) మాట్లాడుతూ రైతులకు లాభాలు వచ్చే రకంగా వ్యవసాయ పరిశోధనా ఫలితాలను వారికి అందచేయాలన్నారు.

శ్రీ బి. శ్రీరామమూర్తి (కాంగ్రెసు) మాట్లాడుతున్నంత సేపు ఆయన ఇదివరకు ప్రతిపక్షంలో ఉన్న నాటిఉపన్యాసాలు జ్ఞాపకం వచ్చాయి. ప్రతిదిన్నీ విషయంలో ప్రభుత్వం ఎలా విఫలం అయ్యిందీ ఆయన సోదాహరణంగా ప్రభుత్వ రిపోర్టులనుండి వెలికితీసిచూపించారు. ఇంకా కాంగ్రెస్ సభ్యులు శ్రీయుతులు జి. రామస్వామిరెడ్డి, విజయరంగారావు, పి. వెంకటరావు, కె సీతయ్యగుప్తా కూడా చర్చలో పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ప్రజాతంత్రపక్ష సభ్యుడు శ్రీ పి. కోటేశ్వరరావుగారు గత మూడు రోజులనుండి జరుగుతున్న చర్చను ముగిస్తూ ప్రస్తుతం, అమలులో వున్న పథకాలను ప్రభుత్వం సరిగా అమలుజరిగేలా చూడాలని, అప్పుడే రైతులకు ఏమైనా ఉపయోగం ఉంటుందని అన్నారు.

# శాసనసభ్యుల డిమాండ్

(1 వ పేజీ తరువాయి)

హక్కు వున్నది. కొన్ని కాగితాలు ఆయనకు చూపించలేదు.

మిగతా సప్లిమెంటరీ ప్రశ్నలకు సమాధానం చెబుతూ కేంద్రానికి రాష్ట్రం వ్రాసిన లేఖను మంత్రి సభవారికి చదివి వినిపించారు.

ఆలేఖలో యిలా వుంది.

"ఆహారకొరత దేశంలో ఉండగా ఆ నీ ప్రాజెక్టుల విషయం ఎటూ తేల్చకుండా ఉండటం సరికాదని మేము భావిస్తున్నాం. 1951 ఒప్పందాన్ని దృష్టిలోఉంచుకొన్నప్పుడుమూ ప్రాజెక్టులకు అభ్యంతరం పెట్టవలసిన అవసరం లేదు. అందువల్ల నాగార్జున సాగర్ రెండవదశకు, పోచంపాడు, తుంగభద్ర ఎగువకాల్వకు, శ్రీశైలం ప్రాజెక్టులకు కేంద్రం అనుమతించవలసిందిగా కోరుతున్నాము."

కేంద్ర ప్రభుత్వానికిగాని, గుల్హాతీ నివేదికతోగాని నిమిత్తంలేకుండా ఎగువ కృష్ణా ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగించబడుతుందని మైసూరు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను మంత్రిదృష్టికి తీసుకొనిరాగా అటువంటప్పుడు తామూ అదేపని చేస్తామన్నారు.

పిల్లలమర్రి: మంత్రి చదివిన ఉత్తరానికి కేంద్రం సమాధానం ఏమిటి?

మంత్రి: ఈ ఉత్తరం 1962 నవంబరు 18 వ పంపాం. కాని, ఇంతవరకు దానికి సమాధానం రాలేదు.

విశ్వనాథం: కేంద్ర ఇరిగేషన్ మంత్రి ఈమధ్య హైదరాబాద్‌వచ్చినప్పుడు ఈ ఉత్తరానికి మంత్రి సమాధానం కోరారా?

మంత్రి: వారిక్కడికి తమనిర్ణయాన్ని [illegible] రాలేదు. సమస్యా పరిష్కారానికి ఒకమార్గం వెదకటానికి వచ్చారు.

వంకా: మంత్రి చదివిన లేఖనుసభకు అంద చేస్తారా?

మంత్రి: అనువైన కాలంలో అందచేస్తాము.

తెన్నేటి: ఏదైనా విషయంలోని కొంత భాగాన్ని సభలో చదివినపుడు అసెంబ్లీ నిబంధనల ప్రకారం మొత్తం ఆ విషయాన్ని సభకు అందచేయాలి. మా ప్రతినిధి వర్గం కేంద్ర మంత్రిని కలుసుకున్నపుడు మన ప్రాజెక్టు లన్నింటికీ అనుమతి నిస్తామని ఆయన చెప్పా. మంత్రిగారికి కూడా ఆయన అటువంటి హామీ ఏదైనా యిచ్చారా?

మంత్రి: జ్ఞాపకమున్నంతవరకు అటువంటిది జరగలేదు.

కృష్ణా, గోదావరి నదీజలాల బోర్డులో మద్రాసుకుతగినస్థానమివ్వడానికిగుల్హాతీ కమిషన్ సానుభూతితో ఆలోచిస్తుందని హామీ యిచ్చినట్లు ఉదయం పత్రికలో వచ్చిన వార్తలను ఒక సభ్యుడు మంత్రి దృష్టికి తీసుకొనిరాగా అసలు నదీజలాల బోర్డు ఏర్పాటుకే రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. (వి వి)

# విజయవాడ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

విజయవాడ, మార్చి 7

విజయవాడ మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం యీ నెల 12 వ తేదీ సాయంత్రం 3-30 గంటలకు జరుగుతుంది.

# బెంగాల్ కమ్యూనిస్టుపార్టీ ప్రకటన

(8 వ పేజీ తరువాయి)

కరించిన తటస్థ విదేశాంగ విధానాన్ని, చైనాతో గల సరిహద్దు తగాదాను కొలంబో ప్రతిపాదనల ప్రాతిపదికపై శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్న వైఖరినిగట్టిగా మేము బలపరుస్తున్నాం. భారతదేశ రక్షణకు ప్రధానంగా స్వంత బలాన్ని ఆధారం చేసుకోవాలనే విధానాన్ని మేము నమ్ముతున్నాం. నేడున్న అత్యవసర పరిస్థితిని స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకొని కమ్యూనిస్టు వ్యతిరేక పిచ్చిని రెచ్చగొడుతున్నది అభివృద్ధి నిరోధక శక్తులే. ఈ అభివృద్ధి నిరోధకశక్తుల డిమాండ్లకు తలొగ్గి, నిర్బంధవిధానాన్ని అనుసరించి జాతీయ వ్యతిరేక కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వమే సహాయపడుతున్నది.

ఉపఎన్నికలు జరపడానికి వీలుగా పరిస్థితులు ఏర్పడినాయని ప్రభుత్వం తలచిన పక్షంలో స్వేచ్ఛాయుతంగానూ, న్యాయంగానూ ఎన్నికలు జరిగేందుకు వీలుగా కనీసం రెండు మాసాలపాటైనా ఈ అత్యవసర శాసనాలను ఎత్తివేయాలి. రాజకీయ ఖైదీలను, డిటెన్యూలను విడుదల చేయాలి. అప్పుడే ప్రజలు తమ కిష్టమైన ప్రతినిధులను ఎన్నుకొనేందుకు వీలవుతుంది.

# వ్యవసాయ రంగం

రసాయనికపు ఎరువులను వేసినంత మాత్రాన చాలదు. పైరుకు నీరు పెట్టుటలో కూడ శ్రద్ధ వహించాలి.

## మార్చినెలకు సూచనలు

తెలుగు ఉగాది వచ్చేసింది. ఇది శోభకృతు సంవత్సరం పల్లెపట్టులకు శోభ తెస్తుందని ఆశిద్దాము. ఉష్ణత క్రమంగా హెచ్చే ఈ పయరు కాలంలో నీరుపెట్టి సాగుచేసే పైర్లే ముఖ్యమైనవి.

### చెరకు పైరు

చెరకు సాగు విషయంలో ఒక క్రొత్త అంశం తెలియవచ్చింది. చెరకు గడను నరికి విత్తనపు ముచ్చెలను సిద్ధం చేసుకున్న తర్వాత వాటిని నాటడంలో ఆలస్యమైతే వాటి అంకురశక్తి తగ్గుతుంది. అవి నింపాదిగా మొలుస్తాయి. ఆలా వదలిన ముచ్చెలను రెండు మొదలు నాలుగు గంటలవరకు నీటిలో నానబెట్టి నాటినట్లయితే అవి తాజా ముచ్చెలంటె కూడా బాగా మొలకెత్తగలవని లక్నోలోని భారత చెరకు పరిశోధనా సంస్థలో ప్రవీణులు జరిపిన ప్రయోగాలవల్ల తెలిసింది. ఆలస్యంగా చెరకునాట్లు వేసే రైతులు ఈ అంశాన్ని గమనించాలి.

చెరకునాటిన 10 రోజుల తర్వాత ఎకరాకు 2½ పౌనుల 2-4డి మందును 60 గ్యాలనుల నీటిలో కలిపి పిచికారీ చేస్తే కలుపు మొక్కలు పుట్టినవి పుట్టినట్లు చనిపోతాయి. తర్వాత వెంటనే చాళ్ళమధ్య పైపాటు చేయాలి. ఇలా కలుపు మొక్కలను పూర్తిగా నిర్మూలింపగలిగితే చెరకు దిగుబడిని నూటికి 25 వంతులు మొదలు 40 వంతుల వరకు అధికం చేయవచ్చు.

చెరకు పైరుకు సరిగా నీరు పెట్టితే ఎక్కువ పంట దిగుబడి వుండడమేగాక ఎక్కువ కాలం చక్కెర దిగుబడి అవుతుంది. చెరకు నాటినప్పటినుంచి ఏప్రిల్ మధ్యభాగం వరకు ప్రతి 15 లేక 20 రోజుల కొకమారు నీరు పెట్టాలి.

### పసుపు పంట

శ్రీరామనవమి వచ్చేలోపలే పసుపు పండి దున్ని తీయడానికి సిద్ధంగా వుంటుంది. పసుపు తవ్విన వెంటనే పుచ్చు చచ్చు లేని పెద్దసైజు దుంపలను ప్రత్యేకంగా విత్తనం కొరకు ఎంచి కసారాలలో కుప్పలుగాపోసి, తెగులు పట్టని పసుపు ఆకుతో దట్టంగా కప్పాలి. కుప్పలమీదకి వేడి గాడ్పులు కొట్టకుండా, వాననీరు పడకుండా జాగ్రత్త వహించాలి. పెద్ద కుప్పలలో కుళ్లు ఎక్కువగా పట్టుతుంది కాబట్టి మధ్యరకం కుప్పలు వేయడం మంచిది. కుప్పవేయడానికి ముందు విత్తనాన్ని 0.5 శాతం సెరసాన్ ద్రావణంలో పదినిముషాలుంచి తీసి ఆరిన తర్వాత నిలవచేస్తే కుప్పలో విత్తనం కుళ్ళి చెడదు. పసుపు తవ్విన వారం పది రోజులలో వంట మొదలు పెట్టాలి.

### మామిడి కాపు

ఇప్పుడు మామిడిచెట్లు పిందె, కాయ మీద వుంటాయి. ఈ తరుణంలో ప్రతి 15 రోజుల కొకమారు మామిడిచెట్లకు నీరు పెడితే కాయలు ఎక్కువగా రాలిపోవు. అంతేగాక కాయలు త్వరగా పెద్దవవుతాయి కూడా.

### కొబ్బరిచెట్ల చీడలు

కొబ్బరిచెట్లకు పట్టి నష్టం కలుగజేసే చీడలు తెగుళ్ళ నివారణకు బోర్డో మిశ్రమాన్ని డి. డి. టి.తో కలిపి చల్లాలి. కాయలను చెట్టునుంచి దింపే సమయంలోనే ఈ మందును పిచికారీ చేస్తే కాలిఖర్చు తప్పుతుంది. ఆకులకు పట్టు ఆకుతినే పురుగు ముదరకముందే ఇలా మందు చల్లడంవల్ల తెగులుపోయి చెట్లు ఆరోగ్యంపొంది మళ్ళీ కాపుపట్టుతాయి. ఆకు దిగువ భాగాలకుకూడా మందు తగిలేట్లు పిచికారీ చెయ్యాలి.

### అరటి సాగు

కొత్తగా వేసిన గెలలకు ఆకులతో కట్టి కాపాడాలి. జనవరిలో నాటిన మొక్కలకు వరుస వేసిన మోతాదు ప్రకారమే (అనగా మొక్క ఒకటికి 4 ఔన్సుల అమోనియం సల్ఫేటు, 2 ఔన్సుల సూపర్ ఫాస్ఫేటు) ఎరువువేసి నీరు ఎక్కువగా పెడుతూ వుండాలి. కర్పూర చక్కెరకేళి పక్వానికి రావడం ఆరంభమవుతుంది.

### పొగాకు క్యూరింగు

మేలురకపు పీకర్సు పొగాకు ఉత్పత్తిలో క్యూరింగు చాలా ముఖ్యమైన దవటంచేత జాగ్రత్తగా పనిచేసే అనుభవజ్ఞుల క్యూరరుల అవసరం. ఆకులు వుండవలసిన రంగు, ఇతర గుణగణాలు కలగడానికీ, ఖర్చు తక్కువ కావడానికీ, వీలయ్యే పద్ధతి రాజమహేంద్రవరపు పొగాకు పరిశోధనాలయంలో కనిపెట్టబడింది. ఆ పద్ధతిని మనరైతులు అనుసరిస్తే అయ్యేఖర్చు, పట్టేకాలము తగ్గడమేగాక మేలురకపు ఆకుకూడా దిగుతుంది.

మార్చి నెలాఖరుకు లంకపొగాకు కోతకు సిద్ధంగా వుంటుంది. ఆకు ఎక్కువగా పండకముందే కోయాలి.

### పెరటితోటలు

పెరటి తోటలలో వేసవికి పనికొచ్చే కాయగూరల పెంపకానికి ఇప్పుడే పూనుకోవాలి. బెండ, సొర, అలచంద, ఇతర ఆకు కూరల పాదులు ఇప్పుడు పెట్టవచ్చు. ఉల్లి, వెల్లుల్లిదుంపల త్రవ్వకం అవసరం. బంగాళా దుంపకు నీరు పెట్టడం మానాలి. వాటి ఆకులు ఎండినప్పుడు త్రవ్వి దుంపలను తీసి చల్లగా, పొడిగావుండే తావున చెక్క బల్లలపై నిలవ చేయాలి. కొత్తగా నాటిన బొప్పాయి, అరటి, నిమ్మ మొక్కలపై పడమటి ఎండ పడకుండా గడ్డిచాపలను అడ్డం పెట్టాలి. సొరతీగలపైన, పుచ్చతీగలపైన ఎర్ర బంక తెగులు కన్పిస్తే కట్టెలు కాల్చిన బూడిదగాని లేక 1 శాతం లిండేన్ గాని కొట్టాలి.

### పశువుల మేపు

పిల్లిపెసర, మినుము, ఉలవ, జనుము వంటి పప్పుజాతికి చెందిన మేతలలో మాంసకృత్తులు హెచ్చుగా వుంటాయి. కాని ఇవి పశువులకు కడుపుఉబ్బరం కలిగించడంకద్దు. ముఖ్యంగా ఇవి లేతగా ఉన్నప్పుడు పశువులు తింటే కడుపుఉబ్బరం హెచ్చుగా కలుగుతుంది. అనగా మేసే మేతనుబట్టి పశువుకు కడుపుఉబ్బరం వస్తుందన్నమాట. పశువు తినే మొత్తం గ్రాసంలో పప్పుజాతికి చెందిన మేత నూటికి 30 పాళ్లకు మించకుండా వున్నట్లయితే కడుపుబ్బరం రాదు. పశువులకు కడుపుబ్బరం వచ్చినప్పుడు ఒక పౌను అవిసెనూనెలో రెండు ఔన్సుల కర్పూరతైలం కలిపి పోయాలి.

(ఐ. సి. ఎ. ఆర్.)

## సమష్టి సహకార వ్యవసాయ సంఘం

### ప్రభుత్వ సహాయానికి అభ్యర్థన

గూడూరు, మార్చి 2

"గూడూరుకు 8 మైళ్ళ దూరములో వెంకటగిరి రోడ్డు ప్రక్కన శిథిలమై పోయిన రెడ్డిగుంట గ్రామములో సైకా వ్యవసాయ కార్మికులు 25 కుటుంబాలవారు ఒక సంవత్సరం నుండి పూరి పాకలు వేసుకొని నివసిస్తున్నారు. ఆ కార్మికులకు యిండ్ల స్థలాలుగాని, సొంత భూములుగానిలేనందున ఆ రెడ్డిగుంట గ్రామమును (నెహ్రూనగర్) సహకార వ్యవసాయము చేయుటకు నిర్ణయించుకొని ప్రభుత్వ కోరిక మేరకు డిపాజిట్టు కట్టారు. త్వరలోనే సహకార సంఘము రిజిష్టరు అవుతుంది. గ్రామంలో యున్న 200 ఎకరాల బంజరుభూమి సాగులోనికి తెచ్చుటకు ప్రభుత్వంవారు సదుపాయాలు కలిగించాలి" అని నెల్లూరుజిల్లా వాకాడు గ్రామములో మొన్న నెహ్రూనగర్ (రెడ్డిగుంట) సైకా, వ్యవసాయ కార్మికుల తరఫున ఆంధ్రప్రదేశ్ సైకా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీ. పి. సి. రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ సి. వి. సుబ్బయ్య, సహాయ కార్యదర్శి శ్రీ జక్కల ఆదిశేషయ్య గార్లు కేంద్రప్రభుత్వ సమాజాభివృద్ధి సహకారశాఖల ఉపమంత్రి శ్రీ బి. యస్. మూర్తిగారికి మెమోరాండము అందజేశారు.

ఇండ్ల వసతి, మంచినీటి బావి, కమ్యూనిటీ హాలు, ట్రాక్టరు మొదలగు సదుపాయాలు ప్రభుత్వంద్వారా అందించాలని దానిలో తెలియజేశారు.

(వి. వి.)

## అధికాహారోత్పత్తికై బంజర్ల సాగులు

### మైనర్ ఇరిగేషన్ పథకాలకై విజ్ఞప్తి

పిడుగురాళ్ల, మార్చి 6

పిడుగురాళ్ళఫిర్కా జానపాడుబంజరను ఫారెస్టుగా కలిపివేసుకొన్న ఉత్తర్వులను రద్దుచేసి, గతంలో ఆ భూములను సాగుచేసి శిస్తులు కట్టుకొన్న రైతులకివ్వాలని పిడుగురాళ్ళబ్లాకు కమ్యూనిస్టు కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

ఇటీవల పిడుగురాళ్ళలో బ్లాకు కమ్యూనిస్టు పార్టీ కమిటీ సమావేశం అయింది. భూమిపై ఆధారపడ్డ పన్నులను నిరసిస్తూ, పంటపై వృద్ధిక్రమంలో పన్నులు వెయ్యాలని, ధరలను అదుపు చెయ్యాలని, రైతులు చేసుకుంటున్న భూములమీద వారికి వెంటనే పట్టాలివ్వాలని, బంగారు పనివారికి పనులివ్వాలని, డిబెంచర్లను విడుదల చేయాలనీ, కూడా కోరారు.

ఇంకా స్థానిక సమస్యలపై తీర్మానాలు చేశారు.

పల్లే పూర్తయివున్న భట్రుపాలెం, వేమవరం రామిరెడ్డితిప్ప, కోనంకి పిల్లేటి కత్తువలను మైనర్ ఇరిగేషను పథకాలలో చేర్చి పని ప్రారంభించాలి.

జూలపల్లి ఫిర్కా చెన్నాయిపాలెం బంజరునుంచి బేదఖలుచేసిన సుగాలీలకు ఆ భూములు నివ్వాలి.

దేశంలోని ఆహార కొరతను తీర్చడంలో తోడ్పడేటందుకు గుత్తికొండ వేపగిరి అడవి, మాచవరం అలసందలరేవు, జూలపల్లి పోలిందలరేవు, పిడుగురాళ్ళఫారెస్టు మొదలయిన బంజర్లను సాగుచేసుకొనేటందుకు రైతుల కివ్వాలి.

## సాగుకులాయకైన వేలాది ఎకరాల ఫారెస్టు బంజర్లను పేదలకు పంచాలి

### అనేకరకాల మినహాయింపులవలన ఆచరణలో నిరుపయోగంగా తయారైన ప్రభుత్వ బంజర్ల పంపక విధానం

**1960 ఉగాదినాటికి రాష్ట్రంలో బంజర్ల పంపకం పూర్తి అయిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం హామీ యిచ్చింది. ఆ హామీ ఆచరణలో ఏవిధంగా అమలు జరిగింది? ఎంతవరకు అమలు జరిగింది? పంపకం జరిగినచోట్లనైనా పేదలు ఆ భూములను సాగు చేయడానికి ప్రభుత్వం ఏవిధంగాసాయంచేస్తున్నది? ఈ విషయంలో పశ్చిమగోదావరి జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ అన్నే వెంకటేశ్వర రావుగారు తమ జిల్లాలో పరిస్థితులను, అనుభవాలను ఈ విధంగా తెలియజేస్తున్నారు.**

జిల్లాలో కొల్లేరు ఆన్ సర్వే భూమి భీమవరం తాలూకాలో లోసరకూట్లు పాడుఏరియాలో 7 నుండి 8 వేల ఎకరాలు, చేముల వీర ప్రాంతంలో బంజర్లు, కొవ్వూరు, పోలవరం, చింతలపూడి తాలూకాల్లో ఫారెస్టు బంజర్లు, డెల్టా ఏరియాల్లో పోరంబోకులు సాగుకు లాయకైన బంజర్లన్నాయి.

తాడేపల్లిగూడెం, కొవ్వూరు చింతలపూడి మెట్టప్రాంతాలలో వేలాది ఎకరాలు అటవీ బంజరుభూమి అడవులుగా అభివృద్ధికి చేయడానికి పనికి రానిది. అయినప్పటికీ బంజరు భూముల పంపకం నుండి ఈ అటవీ బంజర్లను మినహాయించారు. ఇందువలన సాగుబడిలోనికి తీసుకురావడానికీ ఆహార ధాన్యాలను పండించడానికీ అనువైన బంజరు భూమి నిరుపయోగంగా ఉండిపోతూంది.

ఈ అటవీ బంజర్లను ఈ జాబితా నుండి తొలగించడానికి (డీ.ఫారెస్టు చేయడానికి) అటవీశాఖ, రివెన్యూశాఖల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలలో, పైళ్ళతోనే చాల కాలం గడిచిపోతోంది. కాని ఈ లోగా భూస్వాములు ఆక్రమించుకుంటే వారికి పట్టాలు యిస్తూనే ఉన్నారు. కాని భూములు లేని పేదలకు పట్టాలు ఇవ్వడంలేదు.

భీమవరం తాలూకాలో రాజకీయ బాధితులకుమాత్రం ఈ బంజర్లను యిస్తున్నారు. అక్కడకూడా పేదలకు మాత్రం యివ్వడంలేదు. ఈ విధంగా ఈ జిల్లాలోని మెట్టప్రాంతాలలో సాగుకు లాయకుఅయిన బంజరు భూమిలో అధిక భాగం పంపకంలోకి రాకుండా మిగిలి పోయింది.

డెల్టా ప్రాంతాలలో పోరంబోకు భూములను అనేక ప్రాంతాలలో పేదలు సాగుచేస్తున్నారు. అయితే, వీటిని బంజరు భూములుగా నమోదు చేయడంలేదు. ఇవి కూడా పంపకంనుండి మినహాయించబడినాయి.

### చెరువు లోతట్టు భూములు

ఏలూరు తాలూకాలో పోతునూరు, చాటపర్రు, కొవ్వలి, కాట్లంపూడి, పోణంగి మొదలైనచోట్ల 100 ఎకరాల నుండి 800 ఎకరాల విస్తీర్ణంకల్గిన చెర్వు లోతట్టు భూములు సాగుకు లాయకు అయినవి ఉన్నాయి. కాలువ దిగువ భూములవారికి, ఆకుమళ్ళకు నీరు నిలవ ఉండడానికి అనే సాకుతో ఈ చెర్వు లోతట్టు భూములను సాగుకు ఇవ్వడంలేదు. వాస్తవానికి ఈ చెర్వులు నీరు నిల్వకు నిరుపయోగమయి పూడికపడిన చెరువులు. కాని భూస్వాముల ప్రయోజనాల దృష్ట్యా పేదలు సాగుచేయడానికి ప్రభుత్వంఅనుమతులు యివ్వడంలేదు. సాగుచేసినచోట్ల పెనాల్టీలు విధించడం, తొలగించడానికి ప్రయత్నించడం నిత్యం జరుగుతున్న విషయం.

బంజరు భూములు, 250 ఎకరాల ఆపైబడిన విస్తీర్ణం కల్గిన ఏక ఖండాలుంటే ఉత్తరోత్తరా సహకార వ్యవసాయం ప్రారంభించడానికి అనేసాకుతో బంజరు పంపకం క్రిందకు రాకుండా మినహాయించారు. పోనీ సహకార వ్యవసాయం క్రింద సాగు చేస్తామని దరఖాస్తులు పెడితే, సహకార సంఘాలు రిజిస్టరు చేయడంలేదు. సహకారశాఖ-రెవెన్యూశాఖల మధ్య పేదలను త్రిప్పడం తోనే సరిపెడుతున్నారు. ఉదాహరణకు ఏలూరు తాలూకా పాలగూడెం, అప్పారావుపాలెం, చింతలపూడి తాలూకా ప్రగడవరం మున్నగుచోట్ల భూములులేని పేదలు, వ్యవసాయ కార్మికులు సహకార వ్యవసాయంక్రింద బంజర్లను సాగుచేయడానికి అనేక సంవత్సరాలుగా ప్రయత్నించినా ఏమీ ఫలితం లేకుండా ఉంది.

ప్రస్తుతం బంజరు భూమి పంపకం కార్యక్రమం ఆపుచేశారు, ఎందుకంటే పట్టాలు యివ్వడం పూర్తి అయిందని, మిగిలింది తహశీల్ దార్లు పూర్తిచేస్తారని అంటున్నారు.

బంజరు భూములు పంచినచోట్ల పెట్టుబడి లేకపోవడం వలన ఆ పేదలు 90 సంవత్సరాల కౌలుకు తమ భూములను యిచ్చివేస్తున్న ఘటనలుకూడా ఉన్నాయి. ఈవిధంగా తిరిగి భూములున్నవారికే కొన్ని బంజరు భూములు చేరిపోతున్నాయి. ప్రభుత్వం తగిన పెట్టుబడి యివ్వకపోవడమే దీనికి కారణం.

అందుచేత ప్రభుత్వం అధికాహారోత్పత్తికి, అదనంగా భూమి సాగుబడిలోనికి తీసుకురావాలంటే బంజరు భూముల పంపకంలో ఈ మినహాయింపులన్నీ రద్దుచేసి సాగుకు లాయకు అయిన అన్నిరకాల బంజరు భూములను, పోరంబోకులను, ఆన్ సర్వే భూములను పేదలకు పంచాలి. వారికి పట్టాలు యివ్వాలి. బంజరు భూములను పంచిన చోట్ల పేదలకు తగిన పెట్టుబడి మంజూరుచేయాలి.

(వి. వి.)

## పశుగ్రాసములు

వర్షాకాలంలో పశువులు పాలిచ్చే విషయంలో, పాటుపడటంలో తగు సామర్థ్యం చూపక పోవడానికి ముఖ్య కారణం వాటికి సరిపడ ఆహారంలభింపక పోవడమే. లభించినా అందులో వుండే పోషకశక్తి తక్కువ. పోనుపోను హెచ్చుగా భూములు సాగుబడిక్రిందికి వచ్చి పచ్చికబీళ్లు తగ్గటంవల్లనూ, ఆహార ధాన్యాల పైర్లు, వ్యాపారపు పంటలు బాగా గిట్టుబాటుగా వుండటంచేతనూ రైతు పశుగ్రాసాన్ని సాగుచేసే వీలుపడటంలేదు. దొరికినంతవరకు ఏదో గ్రాసం కొని పశువులముందు వేయడం జరుగుతున్నదికాని, పశువు దేనిని బాగా తింటుందో, దాని ఆహారానికి దేన్ని పండించాలో మనం ఆలోచించడంలేదు. పశువుకు తినడానికి రుచిగా వుండి,పోషకశక్తినిచ్చే గ్రాసం లభించాలన్నా, నేల సారమును భద్రపరచదలచినా, పంటల పథకంచేసి పశుగణమును వృద్ధి చేయదలచినా, పశుగ్రాసాల సాగుపట్ల శ్రద్ధ చూపాలి. మేలైన సేద్య పద్ధతులతో వాటిని పండించే మార్గాలు పరిశీలించాలి. వచ్చేది వేసవి. సాధారణంగా అప్పుడు పశుగ్రాసం కొరతవుంటుంది. కాబట్టి ఈ ఋతువుకు ఏవేవి పండించవచ్చో ఆలోచిద్దాము.

### గినీ గడ్డి

గినీగడ్డి బహువార్షిక రకం. దీని పిలకలను ఫిబ్రవరి - మార్చిలో అడుగున్నర దూరంలో చాళ్ళ ప్రక్కన నాటాలి. నీటి ఆధారంక్రింద ఇది బాగా పెరుగుతుంది. భూమిని నాలుగైదుమార్లు దున్ని, మంచి పదునుకు తేవాలి. 3 అడుగుల దూరాన చాళ్ళు చేయాలి.

నాటేముందు ఎకరాకు 20 బండ్ల పశువుల ఎరువు వేయాలి. వర్షాలు లేకపోతే నెలకు మూడుమార్లు నీరు పెట్టాలి. నాటిన మూడు మాసాలకు కోతకు వస్తుంది. తర్వాత 1½ నెలకు కోయవచ్చు. ప్రతి ఆరుమాసాలకు 10 బండ్ల ఎరువు వేస్తూ మూడేండ్లవరకూ ఈ గడ్డిని పెంచుతూ వుంచవచ్చు. ఈ గడ్డిలో మాంసకృత్తులు, భాస్వరము, సున్నము వుంటాయి. ఎకరాకు 50 వేల పౌనులకు పైగా దిగుబడి నిస్తుంది. మునిసిపల్ మురుగు నీటిక్రింద రెట్టింపు దిగుబడి వుంటుంది.

### నేపియర్ గడ్డి

దీనినే ఏనుగగడ్డి అనికూడా అంటారు. ఇది బహువార్షిక జాతి. సాగు విధానంలోగాని, ఆహారపు విలువలోను గినీగడ్డికి దీనికి తేడాలేదు. నాటిన తర్వాత మూడు మాసాలకు కోతకు వస్తుంది. తర్వాత ప్రతి రెండు నెలలకు కోసుకోవచ్చు. ఎకరాకు 75 వేల పౌనులవరకు దిగుబడి వుంటుంది. కాబట్టి పిలకలు నాటేముందు [illegible] టన్నుల బాగా కుళ్ళిన పశువుల ఎరువు, మూడు క్వింటాళ్ళ సింగిల్ సూపర్ ఫాస్ఫేటు వేయవచ్చు. ఈ మొత్తమును మూడు దఫాలుగా వేయాలి. బహువార్షిక పశుగ్రాసాలలో నేపియర్ హెచ్చుఉత్పత్తి నిచ్చేది. ఒక సంవత్సరంలో ఆరుకోతలు మొత్తంమీద 2,000 క్వింటాళ్ల దిగుబడి లభించిన సందర్భాలున్నవి.

### రోడ్సు గడ్డి

ఇది బహువార్షిక రకం. చవుడు భూములలో బాగా పెరుగుతుంది. ప్రతి 40 రోజులకు కోతకు వస్తుంది. తక్కిన విషయాలన్నీ గినీగడ్డి మాదిరే.

### పారాగడ్డి

ఇదికూడా బహువార్షికరకమే. నీరు నిలవవుండే పల్లపు నేలలలోను, ఎక్కువ ఇసుకవుండే నేలల్లోను, చవుడు భూములలోను దీనిని పండించవచ్చు. సాగు విధానమంతా గినీ గడ్డిమాదిరే. చాళ్ళ మధ్య 3 అడుగుల దూరం, మొక్కల మధ్య 1½ అడుగు దూరము వుంచాలి. కాండపు ముక్కలనుగాని లేక పిలకలనుగాని చాళ్ళ ప్రక్కన నాటాలి. నెలకు నాలుగుసార్లు నీరు కట్టాలి. ఈ గడ్డిలో మాంసకృత్తులు బాగా వుంటాయి గనుక పశువులు బాగా తింటాయి. దీనిని మూడేండ్ల వరకు వుంచవచ్చు. ఎకరాకు 60 వేల పౌనుల దిగుబడి వుంటుంది. అమోనియం సల్ఫేటు ఎరువు నాలుగు దఫాలుగా వేస్తే చాలా హెచ్చుదిగుబడివుంటుంది.

### సన్న నేపియరు

దీనిని కొద్ది నీటి వసతులతోను, వర్షాధారంగాను గినీ గడ్డి మాదిరే పెంచవచ్చు. ప్రతి 40 రోజులకు కోతకు వస్తుంది. ఎకరాకు 40 వేల పౌనులవరకు దిగుబడి వుంటుంది.

### ఇతర గ్రాసములు

ఇవిగాక పశువుల మేతకొరకు పెంచబడే జొన్న, మొక్కజొన్న పైరల సంగతి మన రైతులకు తెలిసినదే. 'సామా జొన్నా దొరికితే స్వర్గ మెందుకురా' అన్నదట పశువు. మొక్కజొన్న జాతులలో జొన్నకంటె మాంసకృత్తుల నిష్పత్తి హెచ్చు. కనుక పశువులకిది మేలైన ఆహారం. మొక్కజొన్నను ప్రత్యేకంగా ఒత్తుగా చల్లి పెంచితే పశువులకు మంచి మేతనిస్తుంది. దంటును ఎప్పటికప్పుడు కోసి పశువులకువేస్తే అవి ఆకులకేగాక కాడనుకూడా తినగలుగుతాయి. మొక్కజొన్న దంటును పాతరవేసి నిలవవుంచి కూడా ఉపయోగించుకోవచ్చు. అలచందనుకూడా ప్రత్యేకంగా మేతకోసం పెంచవచ్చు. దీని పచ్చికొట్టు పశువులకు మంచిది. మార్చి నెలవరకు అలచంద పైరు పెట్టితే ఎండలు ముందుగా వుండే మే నెలవరకు కోత లభిస్తుంది. జొన్నతోను, మొక్కజొన్నతోను కలిపికూడా అలచందను వెయ్యవచ్చు. దీనికి గరపలు, ఇసుక గరపలు ప్రశస్తమైన నేలలు. పెద్దగా దుక్కికూడా అక్కరలేదు. 60-70 రోజులలో కోతకు వస్తుంది. మొదటి కాపు కాయలు పండటానికి వచ్చే లోపుగా పైరును కోసుకోవాలి. అలచందకాడ మంచి బలమైన, పచ్చిమేత. దీనిని పాలిచ్చే ఆవులకు మేపితే పాలెక్కువగా ఇస్తాయి.

తుమ్మ, రావి, గంగరావి, అత్తి, ఇప్ప, మద్ది వంటి చెట్ల ఆకులను పశువులకు మేపవచ్చు. తుమ్మకాయ, సీతకు విత్తులు, ఇప్పపువ్వు పశువులకు మంచి పుష్టికల ఆహారములు. (ఐ. సి. ఏ. ఆర్.)

## చవిటి భూములకు కొత్త వరి రకాలు

కృష్ణాజిల్లా,బందరు(మచిలీపట్టణం)లో పెడన - బందరు మధ్య, రైల్వేలైను ప్రక్కన దాదాపు పదిసంవత్సరాలనుండి చవిటి భూములను బాగుచేసేందుకు తగు పద్ధతులను కనుగొనుటకు అలాగే చవిటిరభూములలో పండించుటకనువైన వరి రకాలను సృష్టించు కొనుటకుగాను ఒక పరిశోధనా కేంద్రం నెలకొల్పబడింది. అచట పరిశోధనలు కొనసాగింపబడుతున్న విషయం మనరైతులకు తెలిసిందే! ఈపరిశోధనాకేంద్రంలో చవుడుకు తట్టుకొని, ఎక్కువ దిగుబడినిచ్చే కొత్త వంగడాలను సృష్టించడానికి ఒక పథకం అమలు పర్చబడుతోంది. 1957-58 సంవత్సరంలో 142 క్రొత్త ప్రోజనీలు(నూతన లక్షణాలుగల సంతతి) తయారు చేయబడ్డాయి. వాటిలో ఏడు ప్రోజనీలు మట్టుకే - చవుడుకు తట్టుకొని బాగా పండుతున్నట్లు కనుగొనబడింది. కోయంబత్తూరు 18కి "పథిక" అనే రకానికి మధ్య పుట్టిన యీ ఏడు సంతతి, మాములుగా చవిటినేలలలో పండించే "ఎస్. ఆర్. 26 బి" (అంగురాల, చవిటి అక్కులు, అని పిలవబడే) రకంకంటే యీ ఏడున్నూ ఎక్కువ దిగుబడుల నిస్తున్నట్లు రాయలదాని తెలియవచ్చింది. దుబ్బు చేయుటలో ఈ నూతన సంతతి నూటికి 12 నుండి 63 పాళ్లు మెరుగుగా నున్నట్లు తేలింది. అయితే పొడుగు పెరుగుటలో అంతతేడా కనిపించలేదు. ఈ క్రొత్తసంతతి ఇంకా పరిశోధనలో నున్నది. ఒకటి, రెండు సంవత్సరాలలో వీటి మెరుగు తరుగులు తేలిపోతవి. అప్పుడు మంచిరకమైనవాటిని ప్రజలకందింపబడతాయి.

(ఐ. సి. ఎ. ఆర్.)

### సమాచారం పంపండి

మీ మీ ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ సౌకర్యాలను గురించి, అధికాహారోత్పత్తి పథకాలను గురించి, మీ మీ సూచనలతో సమాచారం పంపండి. —సం॥

## అఖిలభారత వ్యవసాయ పనిముట్ల పోటీ

దేశంలో మేలైన వ్యవసాయ పనిముట్ల ఉత్పత్తిని ప్రోత్సహించడానికై పశువులచే లాగబడే, లేదా చేతితో ఉపయోగింపగలిగే పనిముట్లకు సువర్ణపతకము, నగదు బహుమతులు ఇచ్చే ఉద్దేశంతో న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనాసంఘం ఇటీవల ఒక అఖిలభారత పోటీని నిర్వహించింది. ఈ పోటీకి వచ్చిన వాటిలో పశువులు లాగగలిగే దేనిని సువర్ణపతకమునకూ, రు 3,000ల ప్రథమ బహుమానమునకూ అర్హమైనదిగా లేదు. రెండవ బహుమానము రూ 2,000/- లు లక్నోలోని ప్రభుత్వ వ్యవసాయ కర్మాగారపు "సింగ్ త్రవ్వుగోల" ను తయారు చేసినందుకిచ్చారు.

"సింగ్ త్రవ్వుగోల' సులభతరమైన పనిముట్టు. దీనికి మూడు కోలలు వుంటాయి. ఇవి మూడు కలిపి అతకబడి వుంటాయి. కోలలు అరఅంగుళం చదరపు ఉక్కుతో చేయబడి, వాటి కొనలు పదునుతేలి వుండక చదగొట్టబడి వుంటాయి. దీనికి పొడుగాటి చేతిపిడి వుండడంవల్ల మనిషి నిలబడే దీనితో పనిచేయవచ్చు. ఇది సులభతరమైన పనిముట్టు కాబట్టి రైతులు, తోటపనివారు దీనిని ఎంతో అభిమానపడి ఉపయోగిస్తారు. (ఐ సి. ఎ. ఆర్.)

## చెరకు సాగుకు నాట్ల పద్ధతి

లక్నోలోని భారత చెరకు పరిశోధనా సంస్థ చెరకు సాగుకు ఒక కొత్త పద్ధతిని కనిపెట్టింది. ఈ పద్ధతి ప్రకారం మొదట మళ్ళలో చెరకు ముచ్చెల నుండి మొలకలు మొలిపించి తరువాత ఆ మొలకలను తోటలలో నాటుతారు. మొక్కల మళ్ళపైన పాలితిలిన్ పొరను కప్పుతారు. వాటిలో నుంచి ఎదిగివున్న మొక్కలను మనం చూడవచ్చు.

40 ఎకరాలతోటకు నాటడానికి ఒక ఎకరం మడిలో మొలకలను పెంచితే చాలు, మడిలో ముచ్చెలను ఒక దాని కొకటి దగ్గరగా పరచి వాటిపై కొద్దిగా నీర్పు చిలకరించి ఆ పిమ్మట పాలితిలిన్ పొర కప్పుతారు. నాలుగు వారాలలో ముచ్చెలనుంచి మొలకలు పుట్టుకొస్తాయి.

ఈ పద్ధతి వల్ల చాలా లాభాలున్నవి. దీనివల్ల చలికాలంలో కూడా చెరకు పైరును పెట్టి సాగుచేయవచ్చు. ముచ్చెలు మొలకెత్తడం కూడా నూటికి 30 వంతుల నుంచి 75 వంతులు పెరుగుతుంది. ఇలా నాటినందువల్ల తోటలలో ఖాళీలు వుండవు. చెదలవల్ల నష్టం వుండదు. దుబ్బులు నష్టమై పోవడం చాలా వరకు తగ్గుతుంది.

ఈ పద్ధతిని అనుసరిస్తే ఉత్తర భారతంలో గోధుమ, మంచి సెనగ, ఇతర రబీ తృణధాన్యాల పంటల తర్వాత చెరకు పైరుపెట్టి సాగుచేయవచ్చు.

ఈపద్ధతి విభిన్న పరిస్థితులలో, వివిధ సాగు విధానాలలో అవలంబనకు అనుకూలమైనది. చలికాలంలో లేదా వాతావరణం మరీ పొడిగావుండే స్థితిలో చెరకు పైరును పెట్టి పోషించవలసిన ప్రాంతాలలో ఈ పద్ధతి రైతులకెంతో ప్రయోజనకారికాగలదు.

ఈ పద్ధతి ఇంకా అనేక ఇతర పైరులకు, ముఖ్యంగా కాండమును ముక్కలుగా నరికి నాటి పెంచబడు పైరులకు ప్రయోజనకరమైనది. అయితే చెరకు సాగుకూ, దాని ఉత్పత్తిని పెంపొందించడానికీ ఈ పద్ధతి క్రొత్త అవకాశాలను కలిగిస్తుందనడంలో సందేహంలేదు.

ఇతర వివరాలు తెలుసుకొనగోరే వారు "డైరెక్టర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ షుగర్ కేన్ రిసెర్చి, దిల్ కుషా పోష్టు, లక్నో," చిరునామాకు వ్రాయాలి. (ఐ. సి. ఎ. ఆర్.)

అదనపు రాబడికొరకు ఒకేసారి రెండు పైరులను - గోధుమ, ఆవ కలిపి వేసిన దృశ్యం.

## లాభసాటిగా మెట్ట వ్యవసాయం

**శ్రీ చంద్రం**

మన దేశంలో నేడు 3850 లక్షల ఎకరాలు సాగు చేయబడి అందు పంటలు పండించబడుతున్నాయి. అయితే ఇందులో షుమారు 700 లక్షల ఎకరాల మేరకు మాత్రమే నీటి వసతి ఉన్నాయి. మిగతా భూమి యావత్తూ వర్షాధారముతోనే సాగు చేయబడుతోంది. వర్షాధారమున సాగు చేయబడే భూమిని రెండు రకాలుగా విభజించవచ్చు. అందులో పంటలు పండించడానికవసరమైన కనీస వర్షం అంటే సంవత్సరానికి 30 అంగుళాల మేర కురిసే ప్రాంతాలు మరో ఏడువందల లక్షల ఎకరాలుంటాయి.

మిగతా ప్రాంతంలో కురిసేవర్షాలు చాల తక్కువ. అవి కూడా సకాలంలో కురియవు. ఇలాంటి ప్రాంతంమన ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ జిల్లాలుగా చెప్పుకోవచ్చు! అలాగే తెలంగాణాలో మహబూబ్‌నగరు, నల్గొండ, ఆదిలాబాదు జిల్లాలను, సర్కారు జిల్లాలలో కొంతవరకు శ్రీకాకుళం, గుంటూరు జిల్లా కొన్ని ప్రాంతాలు కూడ ఈకోవకు చెందినవే! అందుచేతనే ఈ ప్రాంతాలలో మనం అనేపాడదపా కరువు కెమ్మర్లో వలపి వస్తోంది.

ఈ ప్రాంతాల విషయం గనుక ఎవరూ పట్టించుకోక పోయినట్లయితే యివి కాలక్రమంగా కరువు భూములుగా మారిపోయే అవకాశంవుంది. ఎప్పటికప్పుడు కరువుకాటుకు గురికాబడుతూ వుండుటవలన, యీ ప్రాంతపు రైతులు ముఖ్యంగా మధ్య తరగతి, బీదతరగతికి చెందిన రైతులు అప్పులపాలై, ఆయేటి కాయేడు తమకున్న పొలాలను అయినకాడికి తెగనమ్మి చివరకు వ్యవసాయ కార్మికులుగా మారిపోతున్నారు. ఈ విధంగా పరిస్థితులు విషమించుటనుబట్టే ఆహార ధాన్యాల విషయంలో ఆంధ్రప్రదేశ్ మిగులు రాష్ట్రమైనప్పటికీ,అనుకొన్నంతగా ధాన్యాదుల నుత్పత్తి చేయలేకపోతోంది. పైన సూచించిన జిల్లాలలో మెట్టసేద్యమే ఎక్కువగా చేస్తున్నారు.

ఈ ప్రాంతాలలో మెట్టభూములు ఎక్కువగా ఎర్రగరపములు, ఎర్రయిసుక నేలలయి వున్నాయి. ఈ భూములలో జొన్న, సజ్జ, రాగి, కొర్ర యిత్యాది తృణ ధాన్యాలు, కంది, పెసర, ఉలవలు, మొదలగు పప్పు లేక కాయ ధాన్యాలు వేరుశనగ, ప్రత్తి మొదలైన వ్యాపార పంటలు ముఖ్యంగా పండించబడుతున్నాయి. ఒక ప్రక్క వర్షాలు తక్కువగా కురియటేగాక రైతుల ఆర్థిక పరిస్థితుల మూలంగాకూడా ఈ ప్రాంతాలలో ఒక్కొక్క సంవత్సరం విత్తనగింజలుకూడా చేతికందకుండా పోతున్నాయి.

వర్షాలు తక్కువగా, అననుకూలంగా కురిసినప్పటికీ, మెట్ట సేద్యం నుండి, ఆధునిక వ్యవసాయ పద్ధతుల నవలంబించి లాభం తీయవచ్చు. ముఖ్యంగా యీ ప్రాంతాలలోని పొలాలకు పటిష్టమైన గట్లుండవు అవిగాక యీ పొలాలు డెల్టా ప్రాంతపు పొలాలకువలె సమతట్టుంగా నుండవు. పైపెచ్చు చాలా ఎగుడు దిగుడులుగా వీటవాలుగా వుంటాయి. ఈ విధంగా యీ పొలాలను విడిచిపెట్టుటమూలంగా కురిసిన ఆ కాస్త వర్షపు నీరు కూడా అడ్డేమీ లేకుండా క్రిందికి పారిపోతుంది.

అలా ఊరికే పోతే ఒకందుకు మంచిదే! పోతూ పోతూ, పైనున్న మెత్తటి సారవంతమైన మట్టిని యీ వర్షపునీరులాక్కొని పోతుంది. పైపెచ్చు ఒరవడితో ప్రవహించుట మూలంగా ఎక్కడికక్కడ వాగులు చేసుకుంటూ పోతుంది. ఇలా తరతరాలనుండీ, యీ ప్రాంతపు భూములు దెబ్బతింటున్నాయి. కురిసిన వర్షపునీరు ఆ నేలలో యింకిపోకుండా అంతా బయటకు పారిపోతే ఆ నేలలో పంటమొక్కలకు తేమ ఎలా అందుతుంది? అందులోనూ సారవంతమైన మట్టి కొట్టుకొనిపోతే పైరులకు కావలసిన ఆహార పదార్థాలెలా అందుతాయి? ఈ విషయాలను శాస్త్రీయంగా పరిశీలించి వ్యవసాయ శాస్త్రజ్ఞులు కొన్ని పద్ధతులను సూచించారు. అవి :

(1) మడికట్లు వేయుట, (2) మడిని మట్టం చేయుట, (3) వాలుకు అడ్డంగా పైరు నాటుట. (4) కలిపి రెండుమూడురకాల పైరులను కలిపి పండించుట, (5) లోతుగా దున్నుట, (మూడేండ్ల కొకసారి), (6) పశువుల ఎరువు ప్రతిసంవత్సరం మడికివేయుట (కనీసం ఎకరాకు 5 బండ్ల చొప్పున), (7) కుదురులలో విత్తుట, (8) తక్కువ విత్తనాలను గొర్రుతో ఎడంగా విత్తుట, (9) పైపాటు లేక అంతరకృషి చేయుట, కలుపుతీయుట, (10) పైరు మార్పిడి-; గడ్డిని పెంచుట, (11) పెద్దగాలులవడిని తగ్గించటానికి చెట్లను వరుసలలో పెంచుట, (12) వాగులు అడ్డంగా కట్టలువేసి పదిలపరుచుట.

వీటినిగురించి వివరంగా మనం తెలుసుకొని, వాటిని అమలుపరచి, భూసారాన్ని నిలబెట్టి, మెట్టసేద్యం లాభసాటి సేద్యంగా రూపొందించుట అవసరమైవున్నది.

(సశేషం)

## కృష్ణా, గోదావరి డెల్టా కాల్వలలో నీరు తగ్గుదల

రాజమండ్రి, మార్చి 4

రాజమండ్రి ఆర్యాపురంలోని సంఘ కార్యాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ నావికా సంఘ సర్వసభ్య సమావేశంలో యీ క్రింది విధంగా తీర్మానించారు.

"గోదావరి, కృష్ణా డెల్టాలకు చెందిన వివిధ కాల్వలలో ప్రధానంగా, విజ్జేశ్వరం, నుండి ఏలూరు, ఏలూరు నుండి విజయవాడ వరకూ గల రెండు ప్రధాన కాల్వలలోను గత పది రోజులుగా పడవలు నడుచుటకువుండవలసిన కనీసపు నీరు లేకపోవుటవలన, సరుకులతో వున్న వందలాది పడవలు మార్గమధ్యంలో ఆగిపోయి అనేక కష్టనష్టములకు గురియగుచున్నవి. ఈ క్లిష్ట పరిస్థితులను గమనించి పై రెండు కాల్వలలోను మార్చి నెలాఖరు వరకైనా పడవలు నడచేటట్లు తగు సదుపాయాలు సత్వరం చేయవలసిందిగా ఇరిగేషన్ శాఖా మంత్రిని, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌ను కోరుతున్నాం."

అడ్రసు:

'వ్యవసాయ రంగం'
విశాలాంధ్ర
విజయవాడ-4

# జనసంఘంపై ఉ. ప్ర. విధానసభలో పెక్కుమంది సభ్యుల తీవ్ర విమర్శ

## దేశస్వాతంత్ర్యానికే ఈ శక్తులు ప్రమాదకరమని హెచ్చరిక

ఉత్తర ప్రదేశ్ శాసనసభలో గవర్నర్ ప్రసంగంమీద జరిగిన చర్చలో జనసంఘ్, తన అపఖ్యాతి చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఘోర పరాభవం పొందింది.

కాంగ్రెసు సభ్యులు, కమ్యూనిస్టులు, అనేకమంది అభివృద్ధికర స్వతంత్ర సభ్యులు, జనసంఘ జాతీయ వ్యతిరేక నగ్న స్వరూపాన్ని అందరి ముందుట బట్టబయలు చేశారు.

జనసంఘానికి ఉత్తర ప్రదేశ్ బలమైన కేంద్రం. 49 మంది సభ్యులుగల జనసంఘ్ ప్రధాన ప్రతిపక్షంకూడా. ప్రత్యక్ష యుద్ధం సాగుతున్నంత కాలం వాళ్లకు పట్టపగ్గాలు లేవు.

ప్రధాన మంత్రి నెహ్రూవారి శాంతి, తటస్థ విధానంలాంటి జాతీయ విధానాలకు వ్యతిరేకంగా సాగిన అతి నీచాతినీచకరమైన ఉద్యమానికి, వాళ్లు నాయకత్వం వహించారు. ప్రజాసోషలిస్టులు, సోషలిస్టులు, వీరికి తోడైనారు. జనసంఘానికి వత్తాసుగా వీరు తయారయ్యారు.

కొన్ని వారాలపాటు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లక్నోనగరాన్ని తమ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చారు. పండిట్ నెహ్రూవారు, ఆయన విధానాలకు వ్యతిరేకంగా విప్లవం [illegible] శ్రీయుతులు కరియప్ప, కృపలానీ, గోల్వాల్కర్, లోహియాలకు ఒక వేదికను ఏర్పరచారు. కేంద్రంలో తమ అధికారాన్ని నిర్మించటంకూర్పుకూడ వారు సంప్రదింపులు ప్రారంభించారు. విచారించదగిన విషయమేమిటంటే, ఈ విషపూరిత ఉద్యమానికి కొద్దిమంది కాంగ్రెసు నాయకులుకూడ తోడైపోయారు.

అందుచేత, గవర్నరు ప్రసంగంపై చర్చ ప్రారంభమయినపుడు జనసంఘీయులు వీరులవలె మాట్లాడడం ప్రారంభించారు. రక్షణ ప్రయత్నాలకు, కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలకు వ్యతిరేకంగా వారు దాడిని ప్రారంభించారు. శాసనమండలిలో వారి నాయకుడు శ్రీ పీతాంబరదాసు, "జైహింద్" నినాదంమీద కూడ దాడి చేశాడు. "హింద్" అనేదిలేదు, ఉండవల్సింది "భారత్" కనుక "జై భారత్" అని గర్జించాలి అని శ్రీ పీతాంబరదాస్ అన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలవల్ల ప్రజల సంతోషం చల్లబడి పోతూంది. కనుక అత్యవసర పరిస్థితిని సమాప్తం చేయాలని ఆయన అన్నారు.

పరిస్థితులలో వచ్చిన పెద్దమార్పును ఆయన, ఆయన సహచరులు చూడలేక పోయారు. వారివిధానాలు, పన్నాగాలు బహిర్గతమయ్యాయి. అందుచేత ప్రజలు ఈ పార్టీల ఘాతుక చర్యలలో కొట్టుకుపోయే సమస్యలేదు.

జనసంఘ్ నాయకుని [illegible] శాసనమండలి అధ్యక్షుడే ఖండించవలసివచ్చింది. భారత, చైనా దేశాల మధ్య సంప్రదింపుల నిమిత్తమై కొలంబో ప్రతిపాదనలు, వివరణల గురించి బాధ్యతారహితంగా ఆయనమాట్లాడుతున్నప్పుడు ఈ ఘటన జరిగింది. శ్రీ పీతాంబరదాస్ మాట్లాడిన విధానం ప్రపంచ దృష్టిలో, భారతదేశ పలుకుబడి ప్రతిష్ఠలు దెబ్బతీయటానికి మాత్రమే ఉపయోగపడుతుందని అధ్యక్షుడు ధూలేకర్ అన్నారు. వీరవ పరచే ఉపన్యాసాలలో మన ప్రజలను అప్రతిష్ఠపాలు చేయరాదని, ఆ విధంగా శత్రువును ప్రోత్సాహపరచరాదని శ్రీ ధూలేకర్ అన్నారు. ఆ తరువాత, శ్రీయుతులు గోవిందసహాయ్, శ్రీ రాజారాం శాస్త్రి, శ్రీ పి.డి. టాండన్, సావిత్రి శ్యాం తదితరులు జనసంఘ్ విధానాలను విశ్లేషించి, తీవ్రంగా ఖండించారు.

అత్యవసర పరిస్థితిని అంతంచెయ్యాలన్న జనసంఘ్, సోషలిస్టు, ప్రజాసోషలిస్టులు చేసిన డిమాండ్ ను ప్రస్తావిస్తూ శ్రీ గోవిందసహాయ్ తన ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

ఒక ప్రక్కన జాతీయ అత్యవసర పరిస్థితి అంతమవ్వాలని వీరు అంటున్నారు. మరొక ప్రక్కన ప్రభుత్వ శాంతి విధానంలో మార్పురావాలని, కొలంబో ప్రతిపాదనలను తిరస్కరించాలని, చైనాతో సంప్రదింపులు జరగరాదని వీరు అంటున్నారు. ఒక విషయంలో మరొక విషయం భేదించే విషయాలను ఒకేసారి వీరు ఎలామాట్లాడుతున్నారో?"

టిబెట్ ను జయించేందుకు మన సైన్యాలు కదలాలి అనే వీరి కోరికను, వాదనను ఆయన పరిహసించారు. "చైనా భూభాగంలో టిబెట్ భాగస్వామిగా ఉండటాన్ని ప్రపంచ శక్తులన్నీ అంగీకరించినవని మనం గుర్తుంచుకోవాలి. చైనాలో టిబెట్ ఒక భాగం కాదని ఎవ్వరూ అనలేరు. టిబెట్ విమోచనానికి భారతదేశం చైనా మీద దాడిచేస్తే ఇప్పుడువారు చైనాకు వ్యతిరేకంగా మనం ఆరోపిస్తున్న, విశ్వాస ఘాతుకం, దురాక్రమణ, విస్తరణ వాదం లాంటి ఆరోపణలు భారతదేశానికి కూడ వర్తిస్తాయి.

"బాధ్యతారహితంగాను, వేలంగాను మాట్లాడటం విరమించవలసింది" గా ముఖ్యంగా జనసంఘ నాయకుని శ్రీ గోవిందసహాయ్ హెచ్చరించారు. "ప్రజల మనస్థైర్యాన్ని వారు విచ్ఛిన్నం చేస్తున్నారు." అని కూడా శ్రీ గోవింద సహాయ్ అన్నారు. కాన్పూరు కార్మిక నాయకుడు శ్రీ రాజారాం శాస్త్రి మాట్లాడుతూ జనసంఘ్, తదితర పార్టీల వైఖరి బాధ్యతారహితంగా ఉందని అన్నారు. "ప్రస్తుత పరిస్థితిని తమ రాజకీయ, స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని జనసంఘ్ లాంటి పార్టీలు కలలు కంటున్నాయి గాన ప్రభుత్వం జాగరూకతవహించాలి" అని శ్రీ శాస్త్రి ఉద్ఘాటించారు.

ప్రధాని నెహ్రూను "శాంతి కాల నాయకుడు" అని, "తటస్థ విధానం" పూర్తిగా పరాజయం పొందిందని అన్న శ్రీ గోల్వాల్కర్ వివాదాలను ప్రస్తావిస్తూ శ్రీ శాస్త్రి ఈ విధంగా అన్నారు: "అన్ని శక్తులు ఉడిగిపోయినవారే అటువంటి దురదృష్టకరమైన ప్రలాపాలు గావిస్తారు."

జాతిని బలహీనపరచటానికే మాత్రమే అటువంటి ప్రసంగాలు తోడ్పడుతాయని అంటూ ఆయన ఇంకా యిలా అన్నారు. "అటువంటి నీచ ప్రచారంలో పాల్గొన్న రాజకీయ పార్టీలు, వ్యక్తులు, పంచమాంగ దళాలకంటే కూడా ప్రమాదకరమైనవారు."

హాస్యకేయుడు, గ్రంథకర్త - అలహాబాదు నుండి ఎన్నుకోబడ్డ శ్రీ పి. డి. టాండన్, గత నెలలో శ్రీ కృష్ణమీనన్ అలహాబాద్ విశ్వవిద్యాలయానికి వచ్చినపుడు జనసంఘ్ జరిపిన వికారచేష్టలను గురించి ప్రస్తావించారు. శ్రీ గోల్వాల్కర్ రాకకు వారు జరిపిన సన్నాహాలను చెప్పుతూ, విద్యాసంస్థలలోకి, విశ్వవిద్యాలయాలలోకి చొరబడాలని చేసే జనసంఘ్ ప్రయత్నాలను ప్రభుత్వం గమనించాలని శ్రీ టాండన్ హెచ్చరించారు.

"ఈ అత్యవసర పరిస్థితిని తమ రాజకీయ లక్ష్యాలకు జనసంఘ్ ఉపయోగించుకుంటూంది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

"జైహింద్" నినాదానికి శ్రీ పీతాంబర దాస్ (జనసంఘం నాయకుడు) తెలిపిన అభ్యంతరాన్ని ప్రస్తావిస్తూ శ్రీ టాండన్ ఇలామాట్లాడారు: "ప్రజలయెడల జనసంఘ్ పుట్టుకతో వచ్చిన వ్యతిరేకత ఎలాంటిదో ఇది స్పష్టపరచిందని అన్నారు.

శ్రీమతి సావిత్రిశ్యాం(కాం) మాట్లాడుతూ శ్రీపీతాంబర్ దాస్ ఉపన్యాసం నుండి తాను ఒక విషయం స్పష్టంగా తెలుసుకున్నానని అంటూ ఇలా అన్నారు. "సిద్ధాంతాలలో జనసంఘ్, చైనా భేదించవచ్చు. కాని వీరిద్దరి నీచకరమైన ప్రచారం చేయడంలో మాత్రం తేడా లేదు."

"జాతీయ వాదం, దేశభక్తిలో మాకు సాటి ఎవరైనా అని దబ్బా వాయించుకునే జనసంఘ్, తన ఆచరణలో ఎక్కడా వీటిని నిరూపించలేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు.

డిప్యూటీ హోంమంత్రి శ్రీ నవల్ కిశోర్ మరింత ఘాటుగా "జనసంఘ్, తదితర మితవాద అభివృద్ధినిరోధకులను" తీవ్రంగా విమర్శించారు.

"చైనా దురాక్రమణ పేరుతో తమ స్వప్రయోజనాలను నెరవేర్చుకోవాలని" జనసంఘ్, తదితర అభివృద్ధి నిరోధకుల "కార్యకలాపాలను ప్రభుత్వం అతి జాగ్రత్తతో పరిశీలిస్తూంది' అని శ్రీ కిశోర్ అన్నారు.

శ్రీ ఉగ్రసేన్ లాంటి సోషలిస్టులు "ఈ మితవాద, అభివృద్ధినిరోధక పార్టీలకు పనిముట్లుగా తయారవటం నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది" అని, ప్రజా-సోషలిస్టు, సోషలిస్టు పార్టీల సిగ్గు ఎగ్గు లేని పాత్రలను ఆయన తీవ్రంగా ఖండించారు. "గతంలో సోషలిస్టులకు ఏంజరిగింది? తమ సహచరులలో అనైక్యతవల్ల, హిట్లర్ అధికారానికి రావటానికి వీరు తోడ్పడ్డారు."

జనసంఘ్ తదితర పార్టీలు కమ్యూనిస్టుపార్టీమీద మోపిన ఆరోపణలను ప్రస్తావిస్తూ శ్రీ జుగల్ కిశోర్ "కమ్యూనిస్టుపార్టీ జాతీయ వ్యతిరేకపార్టీ అనే వాదనను నేను పూర్తిగా ఖండిస్తున్నాను" అని అన్నారు. "ఆవిధంగా ఏ పార్టీకి ముద్రవేయుటం తగదు" అని కూడా అన్నారు.

"జాతి పితను ఖూనీ చేసిన వ్యక్తుల" నుండి దేశభక్తి యోగ్యతా పత్రాలను తీసుకోవలసిన దశలో కమ్యూనిస్టుపార్టీ లేదని కమ్యూనిస్టు నాయకుడు జార్ఖండే రాయ్ అన్నప్పుడు సభలో పెద్ద పెట్టున హర్షధ్వానాలు చెలరేగాయి.

కమ్యూనిస్టు నాయకుడు డాక్టర్ జడ్. ఎ. అహమ్మద్ మాట్లాడుతూ, జాతీయ-అంతర్జాతీయ ఘటనల పూర్వాపరాలలో జనసంఘ్, తదితర మితవాద పార్టీల పాత్రను వివరించారు.

ముఖ్యమైన జాతీయ సమస్యలమీద కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీ లమధ్య ఉన్న అభిప్రాయ సానుకూలతను గురించి కూడా ఆయన మాట్లాడారు. దానికి భయపడటంగాని, సిగ్గుపడవలసిన అవసరం గాని లేదన్నారు. ఆయన ఇలా అన్నారు: "మేము ఒక రాజకీయపార్టీవారం. రాజకీయ ప్రాతిపదిక మీద మేము ప్రతిదానిని ఆలోచిస్తాం. దేశం ముందున్న అనేక ప్రధాన సమస్యలలో కాంగ్రెసుకు మేము దగ్గరగా ఉన్నమాట వాస్తవం"

చర్చలో కాంగ్రెసుపార్టీ డిప్యూటీ నాయకుడు శ్రీ హుకుంసింగ్ మాట్లాడినప్పుడు అంతిమ స్థాయికి చేరుకొంది. శాసనసభలోని జనసంఘ్ పార్టీ నాయకుడు యాదవేంద్రదత్తమూలేకు జవాబు చెప్తూ ఆయన ఇలా అన్నారు:

"అత్యవసర అధికారాలను మేము దుర్వినియోగ పరుస్తున్నామని మీరు మమ్ములను నిందిస్తున్నారు. వాస్తవమేమిటంటే మేము వాటిని దుర్వినియోగ పరచలేదు. ఆ విధంగా చేసివుంటే మీరు, మీ సహచరులు సుఖంగా ఉండేవారు."

"కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీల ఐక్యత"ను గురించి సోషలిస్టులు ప్రస్తావించిన దానిని పరిహసించేస్తూ శ్రీ హుకుంసింగ్ ఇలా అన్నారు: "సోషలిస్టులు, ప్రజాసోషలిస్టులు ఒకరితో ఒకరు చెట్టాపట్టాలు పట్టుకోవాలని ప్రయత్నించినపుడు మేము అనుమానపడలేదు. కాని కాంగ్రెసు, కమ్యూనిస్టులు ఒకరి కొకరు దగ్గరగా వస్తూంటే మీరు నిద్రాహారాలు లేకుండా ఎందుకుండాలి?"

ఈ విధంగా సాగిన చర్చలో ప్రధాన దాడి జనసంఘంమీద సాగినప్పటికీ, స్వతంత్ర, సోషలిస్టు, ప్రజా-సోషలిస్టు పార్టీలమీదకూడ విమర్శ నిశితంగానే జరిగింది.

యావత్ దేశం ప్రమాదంలో ఉన్న సమయంలో శత్రువులతో కుట్రపన్నారని కూడ వీరిమీద విమర్శలు సాగినవి. జాతి వ్యతిరేక, ఘాతుక కుట్రలలో భాగస్వాములని వీరిని దుయ్యబట్టారు.

ఈ పార్టీల ప్రతినిధులు ఈ విధంగా దాడి సాగుతుందని అనుకోలేదు. చర్చ పూర్తయినతరువాత గదిలో ఎక్కడా ఉత్సాహం కానరాలేనంత నీరసపడ్డారు.

శ్రీ యాళ్ళబండి పోలిశెట్టి

### ఉత్తమ పంచాయతీగా నవుడూరు ఎన్నిక

నవుడూరు, మార్చి 6

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం బ్లాకు నవుడూరు పంచాయతీని ఉత్తమ పంచాయతీగా ఎన్నిక చేశారు. ఈ పంచాయతీకి కమ్యూనిస్టు నాయకుడు శ్రీ యాళ్లబండి పోలిశెట్టి అధ్యక్షులు.

### ఉత్తమ పంచాయతీలు

ఏలూరు, మార్చి 4

ఏలూరు డివిజన్ లో ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన పంచాయతీలు.

గుంటుపల్లి, భోగాపురం, కోడూరపాడు, పెదవేగి, ఉప్పుసముద్రం, అలంపురం, కొమ్మగూడెం, జాదుగుంట. (వి. వి.)

### పశ్చిమ గోదావరిజిల్లాలో రు. 30 లక్షల రక్షణనిధి

ఏలూరు, మార్చి 4

దేశరక్షణనిధికి పశ్చిమ గోదావరిజిల్లా కలెక్టరు కార్యాలయానికి ఫిబ్రవరి నెల నాటికి చేరిన మొత్తం రు. 30,85,950-8 10,904-405 గ్రాముల బంగారంఅందిందని తెలియవచ్చింది. (వి. వి.)

### రేపల్లె సాహిత్యసంస్థ

రేపల్లె, మార్చి 2

శ్రీ కాండూరి శివరామయ్య అధ్యక్షతన ఫిబ్రవరి 28 వ తేదీన రేపల్లెలోని సాహితీ అభిమానులు సభ జరిపి "కళాపరిషత్తు" ఏర్పాటు చేశారు. దానికి అధ్యక్షులుగా శ్రీ కవిరావును, కార్యదర్శిగా శ్రీ టి. బ్రహ్మానంద శాస్త్రిని ఎన్నుకున్నారు.

# తిరుపతిలో అసిస్టెంట్ కమిషనర్ -- అనవసరం

## దేవస్థాన ధర్మకర్తల బోర్డు తీర్మానం

తిరుపతి, మార్చి 6

ప్రస్తుతమున్న దేవస్థానంవిజిలెన్సు ఆఫీసర్లు అన్నివిషయములలోను దొంగతనాలను పట్టుకుంటూ చాల జాగ్రత్తగా దేవస్థానం ఆస్తుల రక్షిస్తున్నారు. కనుక, ఈ పరిస్థితులలో ప్రభుత్వంవారు నియమించబోవు అసిస్టెంటు కమిషనర్ వగైరా సిబ్బంది అనవసరము, ప్రభుత్వం వారు తమ చర్యను పునరాలోచించాలని తిరుమల-తిరుపతి దేవస్థాన ధర్మకర్తల బోర్డువారు తీర్మానించారు.

తిరుమల-తిరుపతి దేవస్థానవ్యవహారాల పర్యవేక్షమైన నిర్వహణకు అసిస్టెంట్ కమిషనర్ ను సిబ్బందిని నియమించ నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే 11-1-63 తేదీన జారీ చేయబడిన జి. వో. ను దేవస్థాన ధర్మకర్తల సంఘం చర్చించింది.

శ్రీ రాజేంద్రబాబు అస్తమయానికి చింతిస్తూ [illegible] తీర్మానించారు.

దేవస్థానం బస్సులనుండి శ్రీ కాళహస్తీశ్వరస్వామి (కాళహస్తి) వారికి ఒక బస్సు విరాళమివ్వ తీర్మానించారు.

ప్రభుత్వ వైద్య, వ్యవసాయ, పశువైద్య కళాశాలల్లో వచ్చే సంవత్సరం నుంచి ప్రీ-ప్రొఫెషనల్ కోర్సు ప్రారంభించవలసినదిగా ప్రభుత్వం వారిని కోరారు.

సమావేశమునకు బోర్డు అధ్యక్షులు శ్రీ పి. యస్. అప్పారావు అధ్యక్షత వహించారు. (వి. వి.)

### రాజమండ్రి తాలూకాలో రక్షణ నిధికి నిర్బంధ వసూళ్ళు

రాజమండ్రి, మార్చి 8

రాజమండ్రి తాలూకా గోకవరం, కోరుకొండ, బూరుగుపూడి వగైరా ప్రాంతాలలో గత సంవత్సరం, ఈ సంవత్సరం పంటలు సగానికి నశించాయి.

దీనికితోడు నిర్బంధ రక్షణనిధి యిక దానికి రెండు మొదలు నాలుగు రూపాయలవరకు విధించి, శిస్తుకట్టబోతే దానిని రక్షణనిధిగా జమకట్టుకుని, శిస్తు తిరిగి తెమ్మంటూన్న ఘటనలువినవస్తున్నాయి. ఈ నిర్బంధ వసూళ్లపట్ల ప్రాంతంలో చాలా అసంతృప్తి ప్రబలింది. ఇలాంటి వార్తలే వివిధ ప్రాంతాలనుండి వినవస్తున్నాయి.

బంగారంమీద కంట్రోలు ఆర్డరుతో నిరుడు ధాన్యానికి పలికిన ధరకంటే రెండు, మూడు, నాలుగు రూపాయల తరుగు తక్కువ ధర పలుకుతోంది. బంగారంమీద కాకుండా పొలిక, దుస్తైకి మీద అప్పులివ్వడంలేదు. ఫలితంగా రైతులు దారుణమైన ఆర్థికబాధలు పడుతున్నారు. (వి. వి.)

### యండగండిలో అగ్నిప్రమాదం

భీమవరం, మార్చి 5

భీమవరం తాలూకా యండగండి గ్రామంలో మొన్న హరిజనవాడలో అగ్నిప్రమాదం జరిగి 80 ఇండ్లు, 150 బస్తాల ధాన్యం 50 బస్తాల బియ్యం వగైరాలు [illegible] అయినవి. భీమవరం అగ్నిమాపకదళం వారు మంటలనార్పారు. ఆస్తి నష్టం సుమారు రు. 83000లు ఉంటుంది.

### రేగడగట్టలో

ఖమ్మంజిల్లా, భద్రాచలంతాలూకా రేగడగట్టలో ఫిబ్రవరి 27 వ తేదీన అగ్నిప్రమాదం జరిగింది. నాలుగిండ్లు కాలిపోయినాయి.

### కొండలప్పగూడెంలో

ఖమ్మం తాలూకా కొండలప్పగూడెంలో 2 వ తేదీ రాత్రి అగ్ని అంటుకొని, నాలుగిండ్లు తగులబడ్డాయి. నాలుగిండ్లవారూ పద్మసాలీలు. వృత్తి పరికరాలతో సహా సర్వం తగులబడి ఆ కుటుంబాలు నిరాధారం అయినాయి.

### జింకిభద్రలో

సోంపేట తాలూకా జింకిభద్రలో ఫిబ్రవరి 27 న అగ్నిప్రమాదం జరిగి 30 ఇళ్ళు తగులబడిపోయాయి. ఇవన్నీ నిరుపేదలైన చేనేతవారివే. తాసిల్దారు అగ్నిబాధితులకు రు. 100 లు విరాళం పంచిపెట్టారు.

### విద్యార్థి వేతనాలు

హైదరాబాద్, మార్చి 5

గుంటూరులోని ఏ. సి. కాలేజీ విద్యార్థులకు సోషల్ వెల్ఫేర్ శాఖ వారిచ్చే విద్యార్థి వేతనాలు నిలిపి వేయడం గురించి నిన్న కమ్యూనిస్టు శాసన సభ్యుడు శ్రీ మండే పిచ్చయ్య సాంఘిక సంక్షేమశాఖా మంత్రి శ్రీ అప్పారావును కలుసుకొని వివరించారు.

విద్యార్థులు స్కాలర్ షిప్పులు కోరుతూ పెట్టిన దరఖాస్తులను కాలేజీ అధికార్లు ఆలస్యంగా పంపించారు. దానికి ఫలితంగా వారి విద్యార్థి వేతనాలు నిలిచిపోయాయి.

ఈ విషయాన్ని సానుభూతితో పరిశీలిస్తానని మంత్రి చెప్పారు.

# కమ్యూనిస్టు నాయకుల విడుదల కోర్తూ టెలిగ్రాములు

బోధన్, మార్చి 6

ప్రభుత్వ నిర్బంధాలకు గురి అయిన కమ్యూనిస్టు నాయకులను వెంటనే విడుదల చెయ్యాలని కోరుతూ బోధన్ తాలూకా పంటకుర్తి గ్రామం నుండి ఆరుగురు పౌరులు రాష్ట్ర ముఖ్యమంత్రికి నిన్న తంతి వార్తలు పంపారు.

* * *

కమ్యూనిస్టు, తదితర ప్రజాసంఘాల నాయకులను డిటెన్యూలుగా వుంచటం అన్యాయమని, వారిని వెంటనే విడుదల చేయాలని మందసా సమితి అధ్యక్షులు శ్రీ మజ్జి తులసీదాస్ మొదలయిన 12 మంది ప్రముఖులు ప్రధానమంత్రికి టెలిగ్రాములు పంపించారు.

### ఖమ్మంజిల్లా నుండి మహజర్లు

కమ్యూనిస్టు నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా రామకృష్ణాపురం, బస్వాపురం, ఈర్లపల్లి గ్రామాలనుండి 8 వందల సంతకాలతో మహజర్లు పంపారు. (వి. వి)

### మేడపాడు మహజర్లు

డిటెన్యూలుగా వున్న కమ్యూనిస్టు నాయకులందరినీ వెంటనే విడుదలచేయవలసిందిగా కోరుతూ పశ్చిమ గోదావరి జిల్లా మేడపాడు ప్రజలు 300 మంది సంతకాలుచేసి ముఖ్యమంత్రికి మహజరు పంపించారు.

### మందసా బ్లాక్ కమిటీ తీర్మానం

శ్రీకాకుళంజిల్లా మందసా బ్లాక్ కమ్యూనిస్టు కమిటీ సమావేశం మందసాలో ఇటీవల జరిగింది. ఈ సమావేశానికి జిల్లాకమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ రాములింగాచారిగారు హాజరయ్యారు. జాతీయసమితి కార్యవర్గం చేసిన తీర్మానం, పార్టీ నిధి వసూళ్లు యింకా మిగిలివున్న పార్టీ సభ్యత్వ నవుద్ధరణ, రక్షణనిధి వసూళ్లు అవసరం శిస్తువట్టంగురించి చర్చించారు. కమ్యూనిస్టు డిటెన్యూలనుతక్షణమే విడుదలచేయాలని ప్రస్తుతం అనవసర శిస్తు వసూళ్లు వాయిదా వేయాలనీ, నిర్బంధ రక్షణనిధి వసూళ్లు కూడదనీ తీర్మానించారు. మన్నా మదిగడ్డను రెండవ తరగతి నీటి వనరు క్రింద రాదని జిల్లా కలెక్టరు హామీ యిచ్చినందుకు సంతృప్తిని ప్రకటించింది.

### పెదవీసుశాఖ తీర్మానం

మొన్నటిరోజున [illegible] తాలూకా పెదవీసు గ్రామ కమ్యూనిస్టు పార్టీశాఖసమావేశమయి జైళ్లలో వున్న కమ్యూనిస్టు-కార్మిక నాయకుల విడుదలను కోరుతూ తీర్మానం చేసింది.

బ్లాకు కమ్యూనిస్టు నాయకులు శ్రీ చింతలపూడి రాములు సభకు హాజరయిప్రదేశ్ సమితి కార్యవర్గ తీర్మానాలనువివరించారు.

### యాతవాకిళ్ళశాఖ విజ్ఞప్తి

నిన్నటిరోజున యాతవాకిళ్ళ గ్రామ పార్టీశాఖ సమావేశమయి నాయకుల విడుదలను కోరుతూ గ్రామ రక్షణ కమిటీలనుండి కమ్యూనిస్టులను తొలగించిన ప్రదేశ్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిరసించారు.

### యువజన సంఘ నాయకుని విజ్ఞప్తి

కర్నూలు, మార్చి 6

నిర్బంధింపబడిన కమ్యూనిస్టు నాయకులందరినీ తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ప్రజాతంత్రవాదులూ, యువజనసంఘ కార్యకర్తలూ ఆందోళన జరపాలని విజ్ఞప్తిచేస్తూ అఖిలభారత యువజనసమాఖ్య కార్యవర్గ సభ్యుడు శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణగారు ఒక ప్రకటన చేశారు.

### శ్రీ పాలపర్తి లోవరాజు మృతి

ఏలూరు, మార్చి 4

ఏలూరు ఆర్. టి. సి. పోర్టరు శ్రీ పాలపర్తి లోవరాజుగారు ఫిబ్రవరి 28 వ తేదీన తెల్లవారు జామున అకస్మాత్తుగా చనిపోయారు. వీరు 30 సం॥లనుండి ఏలూరు బస్సుస్టాండులో పని చేయుచూ కార్మికుల ఐక్యతకు, కార్మిక ఆర్.టి.సి. బస్సులు వచ్చినప్పటినుండి ఆర్. టి. సి. పోర్టర్స్ యూనియన్ నిర్మాణం చేసిన వారిలో ఒకరు.

లోవరాజు అంత్యక్రియలలో పోర్టర్లు అందరూ పూరేగింపుగా వెళ్ళి పాల్గొన్నారు. ఫిబ్రవరి 27 న యూనియన్ అధ్యక్షులు శ్రీ మండే అప్పారావు గారి అధ్యక్షతన సంతాపసభ జరిగింది. సమావేశంలో కృష్ణాజిల్లా పోర్టర్ల యూనియన్ కార్యదర్శి శ్రీ శీరపు అప్పారావు నర్సాపురం, తాడేపల్లిగూడెం పాలకొల్లు డిపోల మేస్త్రీలు సభకు హాజరైనారు.

దేశ రక్షణ చట్టంక్రింద అరెస్టు చేయబడిన కార్మిక నాయకులను వెంటనే విడుదలచేయాలని, కీర్తిశేషులైన శ్రీ లోవరాజుగారి కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం చేయుటకు తీర్మానించారు.

ఏలూరు తాలూకా పూళ్ళ పంచాయతీలో ఏవిధమైన నిర్బంధాలూ అవసరం లేకుండా ప్రజాసహకారంతో, పంచాయతీ అధ్యక్షులు శ్రీ వట్టి బంగారయ్య 1962-63 సంవత్సరపు పన్నులను పూర్తిగా వసూలు చేశారు.

### ఆహార పదార్థాల కల్తీ నిరోధ చర్యలు సూచించటానికై ఢిల్లీకి వర్తక ప్రతినిధివర్గం

గుంటూరు, మార్చి 6

కేంద్రప్రభుత్వంవారు ఆహార పదార్థములలో కల్తీని పూర్తిగా నిరోధించునట్లు ఆహార కల్తీ నిరోధక చట్టమును పార్లమెంటు సమావేశములో ప్రవేశపెట్ట బోవుచున్నందున, ఆహార పదార్థములలో కల్తీ నిరోధానికి తీసుకొనవలసిన చర్యలను గురించి చర్చించుటకై గాను పదిమందితో కూడిన ఒక ప్రతినిధి వర్గము ఈ నెల 13 వ తేదీన ఢిల్లీకి వెళ్ళబోవుచున్నది.

శ్రీ దేవత రామమోహనరావు (రాజమండ్రి) గారు యీ రాయబారవర్గానికి నాయకత్వం వహిస్తారు.

ప్రతినిధివర్గమువారు 13 వ తేదీన విజయవాడనుండి బయలుదేరి నాగపూరులోదిగి, కేంద్రప్రభుత్వం అగ్రికల్చరల్ మార్కెటింగ్ ఎడ్వైజరు శ్రీ యస్. సి. ఛటర్జీ ఐ. ఏ. యస్ ను చూస్తారు. 14 వ తేదీని అక్కడనుండి ఢిల్లీ వెళ్ళి, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, ఆహార వ్యవసాయ శాఖామంత్రులను, ఆయా శాఖల కార్యదర్శులను, మరికొందరు ముఖ్యులను కలుసుకొని నివేదిక సమర్పించి చర్చించుతారు. (వి.వి.)

### రక్షణమంత్రివద్దకు స్వర్ణకారరాయబారవర్గం

న్యూఢిల్లీ, మార్చి 4

ఆంధ్రప్రదేశ్ బంగారు, వెండి పని వారి మహాసభతరఫున 13 మంది సభ్యులతోకూడిన రాయబారవర్గం ఇటీవల రక్షణఉత్పత్తిశాఖా మంత్రి శ్రీ కొత్త రఘురామయ్యగారిని కలుసుకొని తమ ఇబ్బందులను వివరించారు. బంగారుపనివారిలో నిరుద్యోగం తొలగించేటందుకు అభ్యర్థించారు.

మరునాడు శ్రీ రఘురామయ్యగారు సెక్రటేరియట్ లో ప్రతినిధివర్గాన్ని, రక్షణ ఉత్పత్తిశాఖలోని ఉద్యోగులతో సమావేశపరచారు. బంగారు పనివారి సహకార సంస్థలద్వారా రక్షణ పరికరాలు కొన్నింటిని ఉత్పత్తి చేయించవచ్చునని మంత్రి సలహా ఇచ్చారు.

రక్షణ ఉత్పత్తి కర్మాగారాలలో పనిచేయ సిద్ధంగా వుండేవారి పేర్లను ఇవ్వవలసిందిగా ఉద్యోగులు కోరారు.

ఉత్పత్తిశాఖ కార్యదర్శి శ్రీ సంజప్ప రాయబార ప్రతినిధులను బెంగుళూరు గడియారాల ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ మాథుల్లా వద్దకు తీసుకు వెళ్ళారు.

తర్వాత రాయబారవర్గం వివిధ ప్రభుత్వ పరిశ్రమశాఖల మంత్రులను కలుసుకొన్నారు.

### మెట్టుపల్లి తాలూకా స్వర్ణకార సమావేశం

మెట్టుపల్లి, మార్చి 6

మెట్టుపల్లి తాలూకా స్వర్ణకారులు ఇటీవల సమావేశమై కేంద్ర ప్రభుత్వపు బంగారు కంట్రోలు నిబంధనవలన కల్గిన ఇబ్బందులు, నిరుద్యోగము గురించి చర్చించారు. ఈ తాలూకాలో దాదాపు ఒక వంద గ్రామాలలో ఆరువందల కుటుంబాలవరకు స్వర్ణకారులున్నారు. వారు తమ తీర్మానంలో ఈ క్రింది తెలిపిన కనీసకోర్కెలను పేర్కొన్నారు:

ఉచితముగా బంగారు [illegible]నివ్వడం, తమ బిడ్డలకు ఉచితముగావిద్య మరియు స్కాలరుషిప్పులు తదితర సౌకర్యాల కల్పన, వృత్తి, ఉద్యోగాలలో సీట్లు రిజర్వుచేయుట.

### తిరుపతి మున్సిపల్ హైస్కూలు నిర్వహణ దేవస్థానంవారికివ్వటానికి మున్సిపల్ కౌన్సిల్ నిరాకరణ

తిరుపతి, మార్చి 8

తిరుపతి పురపాలకోన్నత పాఠశాల నిర్వహణ బాధ్యతను యావత్తు తాము భరిస్తామని అర్జించిన తిరుమల-తిరుపతి దేవస్థానం అభ్యర్థనను తిరుపతి పురపాలక సంఘం తిరస్కరించింది.

పురపాలక సంఘపు 'లోటి' వగైరా పనులుచేయు స్త్రీలకు సంవత్సరానికి ఒకే రంగుగల రెండు చీరలు, రెండు రవికెలు యిచ్చుటకు తీర్మానించారు.

మున్సిపల్ పాలకా డైరెక్టర్ సూచన మేరకు తిరుపతి పురప్రజలకు పురపాలక సంఘమువారి కార్యకలాపాలు తెలియచేయుటకు సమాచార కార్యాలయం ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదించింది.

సమావేశమునకు ఉపాధ్యక్షులు శ్రీ వెంకట మునిశెట్టి అధ్యక్షతవహించారు.

కిరసనాయిలు పీపాపై అదనంగా 10 న.పై. పన్నుగా విధించిన ధర విపరీతముగ పెంచుటచే పేదలను బాధించుటచే గాన కిరసనాయిలుపై పన్ను తగ్గించి దానిని యితర విలాస వస్తువులపై వేయవలయునని ప్రభుత్వమువారిని అర్థిస్తూ కౌన్సిలర్ శ్రీ జి. పి. సుబ్రహ్మణ్యం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. (వి. వి.)

# లేఖలు

### బడిపిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టిన కాంట్రాక్టర్ల బిల్లులు

ఆర్యా,

గుంటూరుజిల్లా చినగంజాం బ్లాక్ లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో బడిపిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టిన బాపతు బిల్లులు కాంట్రాక్టర్లకు చాల పెద్ద మొత్తాలు రావలసి వున్నది.

వెనుకబడిన, హరిజన, షెడ్యూల్డు కాస్టులకు చెందిన బాలబాలికలకు భోజనం పెట్టినందులకు ఆయా గ్రామాల పాఠశాలల కాంట్రాక్టర్లకు క్రింది మొత్తములు రావలసియున్నది.

మునగోలుపాడు రు. 2496-08; మండిగలం రు. 2119-02 లు; శివకొండూరు రు. 2001-76 లు; బోడిగుడిపాడు రు. 1474-87 లు [illegible] బాపతుది రు. 400 లు; చినగంజాం రు. 1758-84 లు; కడ్వపాలెం రు. 1608-54 లు రావలసియున్నది.

ఇంతింత మొత్తాలు రావలసివున్నందున కంట్రాక్టర్లు ఈ పని చేయుటానికి చాలా భయపడుతున్నారు. మానుకుందు మనుకున్నారు. వీరు నిజంగా మానుకుంటే ఈ తరగతుల పిల్లలకు ఎంత ఇబ్బంది కలుగగలదో వేరే చెప్పనక్కరలేదు. ప్రభుత్వం అన్నం పెట్టినవారికి చూపించు మర్యాద ఇదేనా? ఇకనైనా వెంటనే వారి డబ్బు యిచ్చి వారాపని మానకుండా చూచి పిల్లలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మనవి.

ఇట్లు,
షేక్ కాశిం,
కావలి తాలూకా వ్యవసాయ
కార్మికసంఘ కార్యదర్శి,
చినగంజాం.

### పంచాయతీ కిచ్చిన వర్కు తిరిగి కాంట్రాక్టర్ కు బదిలీ

ఆర్యా,

ప్రగడవరం నుంచి నరసింహాపురం వరకు రోడ్డు కావాలని, తాము శ్రమదానంతో కొంత పనిచేస్తామని పంచాయతీ మిగిలిన సహాయం చేయవలసినదిగా కోరుతూ మహజరు పెట్టారు.

ప్రగడవరం పంచాయతీ సమావేశం అక్టోబరు 26వ తేదీన జరిగినప్పుడు సమితి గ్రాంటు ½ వంతు మేరకు పంచాయతీ నిధులనుండి 1/8 వంతు గాను, ప్రజల శ్రమదానం 3/8 వంతుతో పని పూర్తి చేయుటకు అంగీకరించుచూ తీర్మానం చేయబడింది. తీర్మానాన్ని పంచాయతీ సమితికి పంపించారు.

ఆ తరువాత చింతలపూడి పంచాయతీ సమావేశంలో ప్రగడవరం నుంచి నరసింహాపురం వరకు ఒక గ్రావెల్ రోడ్డు, ప్రగడవరం నుంచి బొమ్మకుమాడు వరకు మరొక గ్రావెల్ రోడ్డు పంచాయతీ ద్వారా వేయుటకు మంజూరు చేశారు.

ఆ తరువాత నవంబర్ 10 వ తేదీన చింతలపూడి పంచాయతీ సమితి అధ్యక్షులు, పంచాయతీ తీర్మానం వుండగా, 24 వేల రూపాయలు ఎస్టిమేటు వుండి, స్టాండింగ్ కమిటీ మంజూరును మించిన నరసింహాపురం రోడ్డు పనిని, స్టాండింగ్ కమిటీలోని ఒక కంట్రాక్టర్ శ్రీ కనమరి రెడ్డి కృష్ణారెడ్డిగారికి కంట్రాక్టు యిమ్మటకు తీర్మానించి, వర్కు ఆర్డర్ ఇచ్చారు. పంచాయతీద్వారా జరగవలసిన పనిని నిబంధనలకు వ్యతిరేకంగా యిలా యిచ్చారు.

ఈ లోపల వర్షాకాలంలో గ్రామ ప్రజలు శ్రమదానంతో సుమారు రెండు మైళ్ళు మట్టిరోడ్డు పోశారు. ఈ పనికి కంట్రాక్టరు డబ్బు ఖర్చుచేయలేదు.

అయినప్పటికీ ఈ కంట్రాక్టరు ప్రజలు శ్రమదానంతో వేసుకొన్న రోడ్డును సూపర్ వైజరుతో కొలతలు కొలిపించి పేమెంటుకొరకు బిల్లు చేయించుకొనుటకు ప్రయత్నం చేస్తున్నాడు.

ఈ విషయమై జిల్లా కలెక్టరుకు, ముఖ్యమంత్రికికూడా నివేదించబడింది.

అందువల్ల కంట్రాక్టును రద్దుపరచి, పంచాయతీకివ్వ కోరుతున్నారు.

ఇట్లు,
కనమరెడ్డి అంజిరెడ్డి,
అధ్యక్షుడు, ప్రగడవరం.

### కేంద్ర వ్యవసాయశాఖ అలక్ష్య వైఖరి

ఆర్యా,

నేను రెండు నెలలక్రితం 'డైరక్టరు, కేంద్ర వ్యవసాయశాఖ కృషిభవన్, ఢిల్లీ' వారికి 'వరిసాగు విధానము' కరపత్రము కొరకు రు. 1.87 నయాపైసలు మనియార్డరు చేసియున్నాము. కాని ఇంత వరకు పంపియుండలేదు.

ప్రభుత్వం శ్రద్ధతీసుకొని వ్యవసాయ సంబంధమైన పుస్తకములు వివరములు రైతులుఇవ్వగలిగి కోరినప్పుడు వెంటనే పంపుతారని ఆశించుచున్నాను.

ఇట్లు,
గట్టమనేని వర్ణయ్య,
వీరరాఘవునికోట.

### లారీ ప్రమాదంలో ముగ్గురు స్త్రీల మృతి

అనకాపల్లి, మార్చి 5

అనకాపల్లికి దగ్గరలోనున్న కొత్తూరువద్ద మొన్న ఉదయం ఒక లారీ అనకాపల్లిలో పెరుగు అమ్ముకొనుటకు వస్తున్న ముగ్గురు స్త్రీలపై వెళ్ళింది. అందువల్ల ఇద్దరు అక్కడే మరణించారు. మూడో ఆమె ఆస్పత్రిలో మరణించింది. (వి. వి.)

### ప్రజా సమస్యలపై వార్తలు పంపండి

'విశాలాంధ్ర' పత్రిక విలేకరులకు సూచనలు

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు బహుళంగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో మధ్య తరగతి పరిస్థితి, కార్మికుల సమస్యలు, సామాన్య మానవుని బ్రతుకు తెరువు బహు దుర్భరంగా వున్నాయి.

పంటలు పోగొట్టుకొన్నాయి. ధాన్యం ధరలు తగ్గిపోయాయి. శిస్తులు విపరీతంగా పెరిగాయి. డబ్బులు కటకటగానుంది. దీనికి తోడు అనేకచోట్ల రక్షణనిధి నిర్బంధ వసూలు జరుగుతున్నది.

ప్రజా జీవితాన్ని ఆవరిస్తున్న ఇలాంటి సమస్యలు మీమీ ప్రాంతాల్లో ఎలా వున్నాయో, వాటి ప్రభావం - పరిణామాలు ఏ తీరుగా వుంటున్నాయో మీరు నిత్యం వార్తలు పంపాలి.

మీరు పంపే వార్తల్లో అతిశయోక్తులుమాత్రం ఉండకూడదు. వాస్తవ పరిస్థితిని యథార్థతంగా చిత్రించాలి. —సం॥

### సభలు - సమావేశాలు

మద్యనిషేధ సమస్య పురస్కరించుకొని ఢిల్లీలో ఫిబ్రవరి మొదటి తేదీనుండి నిరాహార దీక్ష వహించియున్న శ్రీ మల్లికార్జునప్ప గారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున ఆ విషయమై అనుసరించదగిన కార్యక్రమమును చర్చించు నిమిత్తం 10-3-63 తేదీన మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడలోని అసోసియేషన్ హాలులో ఆంధ్రప్రదేశ్ నిర్మాణ కార్యకర్తల సమావేశం జరుగుతుంది.

* *

గుంటూరుజిల్లా గ్రంథాలయ సంఘ కార్యవర్గ సమావేశం మార్చి 10వ తేదీన మధ్యాహ్నం 3-30 గంటలకు గుంటూరులో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన సమీపమందలి బాపూజీ కమిటీ హైస్కూలులో జరుగుతుంది.

* *

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పశ్చిమ గోదావరిజిల్లా బ్రాంచి వార్షిక మహాసభ నిడదవోలు లింగమూర్తి ఆస్పత్రిలో ఈ నెల 10న జరుగుతుంది.

* *

హుజూర్ నగర తాలూకా పాలగోడులో మార్చి 13వ తేదీన, ఆ బ్లాక్ పార్టీ సభ్యుల సమావేశం బహిరంగసభ జరుగుతుంది.

[గతంలో ప్రకటించినట్లు 10 వ తేదీన జరగదు.]

అలాగే నారాయణపురంలో మునుగోడు, చౌటుప్పల బ్లాక్ పార్టీ సభ్యుల సమావేశం, బహిరంగసభ మార్చి 14 న జరుగుతుంది. [11న తేదీన కాదు.]

రెండు సమావేశాలలోను ప్రదేశ్ సమితి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖరరెడ్డి హాజరవుతారు. హోలీ పండుగల దృష్ట్యా తేదీలు మార్పు జరిగింది.

* *

మార్చి 20 వ తేదీన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రైతు మహాసభ జరుపుటకు శ్రీ మూర్తిరాజుగారి నాయకత్వాన ఆహ్వాన సంఘం ఏర్పడింది.

### సంక్షిప్త వార్తలు

రాజమండ్రిలోని మోడల్ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఫిబ్రవరి 26 వ తేదీన రక్షణనిధికై వినోద ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో వసూలయిన ధనాన్ని రెండువేల రూపాయల చెక్కుగా విద్యాశాఖాధికారికి అందచేశారు.

* *

తూర్పుగోదావరిజిల్లా అమలాపురం తాలూకా భీమనపల్లి పంచాయితీ సమితి ప్రాథమికోపాధ్యాయ సంఘంవారు మార్చి ఆఖరులో విద్యా వినోద మహాసభలు పెద్ద యెత్తున జరపాలని నిర్ణయించింది, బ్లాక్ సన్నాహక సమావేశాన్ని ఎన్నుకున్నారు.

* *

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని లా కాలేజీ [illegible] ఆచార్యులు యూనివర్సిటీ కోర్సులు ప్రధాన అధ్యాపకులు అయిన ఆచార్య ఎస్. వెంకటాద్రిగారి చిత్రపటాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు డా. ఎ. ఎల్. నారాయణగారు ఫిబ్రవరి 25 న ఆవిష్కరించారు.

# 17 వేల యకరాలు మాత్రమే పంపకానికి మిగులుతు

## రెవిన్యూపద్దుపై చర్చకుమంత్రిసమాధానం

హైదరాబాద్, మార్చి 6

భూమి గరిష్ఠ పరిమితుల చట్టంవలన 17 వేల యకరాల భూమి అదనంగా మిగులుతుందని రెవిన్యూమంత్రి రాష్ట్ర శాసనసభలో రెవిన్యూ పద్దుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ వెల్లడించారు. అయితే ఈ సంఖ్య ప్రాథమికమయినదే నని, అంతిమ నివేదికలు అందవలసివున్నవని ఆయన అన్నారు.

భూమి శిస్తును, బకాయీలను గట్టిగా వసూలు చేస్తున్నారేగాని, అదే విధంగా వేల్యూటాక్సు, ఎక్సైజు బకాయీలను వసూలు చేయడం లేదన్న విమర్శ సరియైనదని మంత్రి అన్నారు. ఈ బకాయీలను కూడా వసూలు చేయుటానికి గట్టి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు.

రైతులకు సరియైన రశీదులు ఇచ్చేలా చూచేందుకు ప్రభుత్వం సిద్ధంగా వున్నదని ఆయన తెలియచేశారు.

ఆంధ్రప్రాంతంలోని చాకిరి ఇనాములకు వలెనే తెలంగాణా ప్రాంతంలోని ఈనాములకుకూడ పట్టాలిచ్చేవిధానాన్ని ప్రభుత్వం పరిశీలించుతున్నదని ఆయన అన్నారు. అత్యవసర పరిస్థితులు వున్నన్ని రోజులు బంజర్లను పేదలకు పంచే విషయమై ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన సమర్థించారు.

యుద్ధరంగంనుండి తిరిగివచ్చిన సైనికులకు కృష్ణాబ్యారేజిలాంటి వాటిక్రింద సాగుకు లాయకీఅయిన భూమిని ఒకలక్ష ఎకరాలు అట్టిపెట్టి మిగతా బంజర్లను పేదలకు పంచాలనే సూచనను ప్రస్తావించి అక్కడినుండి తిరిగివచ్చిన సైనికులు తమ తమ నివాసప్రాంతాలకు దగ్గరలోనే తిరుకెచ్చే భూములుండాలని కోరతారని, అందువల్ల వారందరికీ ఒక చోట భూమి సౌకర్యాన్ని కలుగజేసూ ఉంటే ఇబ్బంది కల్గుతుందన్నారు. అందువల్ల బంజరు భూములు పంపిణీ ఆపుచేయవలసి వచ్చింది అన్నారు.

100 ఎకరాలకంటె హెచ్చుగా ఒకే చోట ఉన్న లంకభూములను వేలం వేయాలనే ప్రభుత్వ విధానాన్ని మార్చే ఉద్దేశ్యం లేదన్నారు.

జమీందార్లకు ఇచ్చేభరణాలను తాత్కాలికంగా నయినా అత్యవసర పరిస్థితి దృష్ట్యా ఆపు చేయాలని, లేక వారికిచ్చేది ప్రభుత్వ ఋణ పత్రాల రూపంలో ఇవ్వాలని చేసిన సూచనను ప్రస్తావించి చాలామంది చిన్నజమీందార్లు ఆర్థికంగా చాల హీన స్థితిలో ఉన్నారని అందువల్ల ఆసూచనను ప్రభుత్వం ఆమోదించజాలదని అన్నారు.

అయితే ఋణ బాండ్లను తీసుకోవటానికి కొందరు జమీందార్లు సిద్ధంగా ఉన్నారని, కాని దానివల్ల పెద్ద ఫలితం లేనందున ఆ ప్రతిపాదన వదలివేశామని అన్నారు.

అదనపు ఎసెస్‌మెంటు చట్టంలో వున్న వైరుధ్యాలున్నవని కొంతమంది సభ్యులు చేసిన సూచనలను పరిశీలించి అటువంటివాటిని సవరించుతామన్నారు.

రెవెన్యూ డిపార్టుమెంటులో అవినీతి వున్నమాట వాస్తవమేనని, అందుకు సంబంధించిన సరియైన ఆరోపణలు వచ్చినట్లయితే ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకొంటామని అన్నారు.

110 పేజీల విచారణ నివేదికలో ఎటువంటి చర్యతీసుకోవాలో పేర్కొనలేదని వంకా సత్యనారాయణ మంత్రి దృష్టికి తీసుకొని వచ్చిన ఉదంతాన్ని ప్రస్తావించి, ఎటువంటి చర్యతీసుకోవాలో సూచించకుండా అటువంటి రిపోర్టులు పంపటం తగదు అని ఆ అధికారికి తెలియచేశామన్నారు.

రెవిన్యూ బకాయీలను వసూలు ఖచ్చితంగా చేయవలసిందని ధనికులయెడ ఒక వైఖరి, పేదలయెడ మరో వైఖరి అవలంబించటం తగదని రెవిన్యూ అధికార్లకు చెప్పామని అన్నారు.

రెవిన్యూ అధికారులకు పంచాయతీ సమితులను ఇవ్వాలనే వాదనను ఆయన తిరస్కరించారు అంతిమ ఆశయం అదే అయినా అందుకు పరిస్థితులు పరిపక్వత పొందలేదని, సమితులకు అప్పగించిన శ్రీ సంక్షేమ శాఖను తిరిగి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసిందిగా అన్ని వైపుల నుండి డిమాండ్లు వస్తున్నాయని అన్నారు.

భూములకు గరిష్ఠ పరిమితిని నిర్ణయించటంవల్ల ఒక్క ఎకరమయినా లభ్యం కాలేదనటం సరికాదని ముందు నివేదికలనుబట్టి 1700 ఎకరాలు లభ్యమయిందని అంతేగాక ఈ బిల్లుకు ముందు దానంతటి అదే విభజన జరిగిపోయిందని అన్నారు.

సర్వే సెటిల్‌మెంటులో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే ఫిబ్రవరి 28 వ తేదీలోపు అర్జీలు పెట్టుకోవలసిందిగా కోరామని కాని చాలామంది రైతులు అలా పెట్టుకోవలేదని అన్నారు.

వరంగల్ జిల్లా పరిపాలనా వ్యవహారాలలో రెవిన్యూమంత్రి నిత్యం జోక్యం కలుగజేసుకుంటున్నారని చేసిన ఆరోపణను ప్రస్తావించి అది నిజం కాదన్నారు. ధర్మసాగరం నీటిని వ్యవసాయానికి వదిలినట్లయితే, వరంగల్ పట్టణానికి త్రాగే నీళ్ళు లభ్యం కావటం కష్టమని అందువల్ల కొద్దిగా మాత్రమే వదలటం సాధ్యమని అన్నారు.

పొలాల చెరువు నీటిని వదలటంలో పక్షపాతం ఉండదని కొంతమంది చెరువులో నీరు ఎక్కువగా ఉన్నది గనక రెండవపంటకు వదలిమంటుంటే మరి కొంతమంది మొదటిపంటకు చాలవు వద్దని అంటున్నారని అన్నారు.

## బర్మా ఫ్యాక్టరీలకు ప్రభుత్వం హెచ్చరిక

### మూసివేస్తే కార్మిక యాజమాన్యాన నడుపుతామని వెల్లడి

రంగూన్, మార్చి 6

"సరియైన కారణాలు చెప్పకుండా ప్రయివేటు ఫ్యాక్టరీలు, మిల్లు యజమానులు తమ పరిశ్రమలను మూసివేస్తే, ప్రభుత్వం వాటిని స్వాధీనపరచుకొని, కార్మిక యాజమాన్య సంస్థలుగా మార్చుతుంద"ని బర్మా ప్రభుత్వం నేడు హెచ్చరించింది.

ఈ హెచ్చరికను బర్మా కార్మికశాఖ డిప్యూటీ డైరక్టరు జనరల్ కెప్టెన్ న్యాతిన్‌తిన్ చేశారు. ఒక గాజు ఫ్యాక్టరీని మూసివేయడంపై ఆయన పై హెచ్చరిక చేశారు. ఫ్యాక్టరీని మూసివేయగా కార్మికులు డైరక్టరు జనరల్ వద్దకు పోయి తమ కష్టాలు చెప్పుకొనగా, వారికష్టాలు తొలగించుతామని ఆయన హామీ ఇస్తూ పై హెచ్చరిక చేశారు.

కొంతమంది ఫ్యాక్టరీ యజమానులు తమ పరిశ్రమలను మూసివేస్తామని బెదిరించుతున్నారనికూడ తెలియుడంతో ప్రభుత్వం ఈ హెచ్చరిక చేసింది.

## అరెస్టు అక్రమమని డిటెన్యూచే రిట్ పిటీషన్ దాఖలు

బొంబాయి, మార్చి 6

ప్రివెంటివ్ డిఫెన్సు చట్టంక్రింద జెయిల్లో డిటెన్యూగావున్న బొంబాయి కమ్యూనిస్టు మునిసిపల్ కౌన్సిలరు శ్రీ పి.కె. కువాసీ బొంబాయి హైకోర్టులో తనను విడుదల చేయవలసిందిగా రిట్ పిటీషన్ దాఖలు చేశారు.

ఆ పిటీషనును న్యాయమూర్తులు అడ్మిట్ చేసుకున్నారు.

భారతదేశంపై చైనా దాడిచేసిన తరువాత శ్రీ కువాసీని 1962 నవంబరు 7 న అరెస్టు చేశారు.

కోర్టువారు మూడువారాలు వ్యవధి నిచ్చి ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు.

శ్రీ కువాసీ తన పిటీషనులో యీ విధంగా వాదించారు: డిఫెన్సు పదు దేశంతో కూడినది కాదు. తనపై నవంబరు 10న డిఫెన్సు వారంటును అమలు పరచారనీ, కాని తనను అంతకుముందు మూడురోజుల క్రితమే అరెస్టు చేశారనీ ఆయన పేర్కొన్నారు. తన డిటెన్షనుకు కారణాలు కాని, వివరాలు కాని మొదట తెలుప లేదన్నారు. డిఫెన్సు చట్టం ప్రకారం, డిటెన్షనుకు కారణాలు తెలుపవలసి ఉందన్నారు.

మొదటినుండి తన డిటెన్షను చట్టవిరుద్ధమే కాకుండా, దురుద్దేశపూరితమైనదని, ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం తన "చట్టవిరుద్ధమైన చర్యను కప్పిపుచ్చుకోవడానికి, తాను డిటెన్షన్‌లో వుండగా, రక్షణచట్టంక్రింద నోటీసును జారీచేసి, చట్టవిరుద్ధ ప్రయత్నం" చేసిందని ఆయన తన పిటీషనులో పేర్కొన్నారు.

## మైసూరు శాసన సభలో నదీజలాల సమస్యపై చర్చ

### పాత ధోరణి కొనసాగింపు

బెంగుళూరు, మార్చి 6

మైసూరు రాష్ట్ర ఉభయ శాసనసభల్లోనూ, బడ్జెట్టు చర్చల్లో కృష్ణా-గోదావరి నదీజలాల సమస్యే ప్రధానాంశంగా వుంది.

శాసనసభలో అనేక ప్రశ్నలకు ముఖ్యమంత్రి శ్రీ నిజలింగప్ప సమాధానం చెబుతూ, నదీజలాల్లో 105 టి.యం.సి. అడుగుల నీటివాటాకు తక్కువగావుండే ఎట్టి సూచననూ మైసూరు ప్రభుత్వం ఆమోదించేదిలేదని పునరుద్ఘాటించారు. ఆంధ్ర నదీ జలాలను దిగువ భాగంలో మూసేస్తే, మైసూరు తన ప్రయోజనాలను కాపాడుకోడానికి ఎగువ భాగంలో చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. వివాదం పరిష్కారం అయ్యేలోపుగా ఆంధ్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాన్ని సాగించడానికి అనుమతించ వలదని కేంద్రాన్ని కోరాయని ఆయన చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ తన ప్రయత్నాలపై పట్టుబడితే, మైసూరుకూడా తన పని చేసుకోవడానికి అనుమతించాలని ఆయన చెప్పారు.

# కొత్తగూడెం గనులలో ప్రమాదాల నివారణ

## కమ్యూనిస్టు సభ్యుని సూచనను మేనేజిమెంటుకు అందజేయడానికి ముఖ్యమంత్రి సమ్మతి

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, ఫిబ్రవరి 6

కొత్తగూడెం గనులలో ప్రమాదాలకు ప్రధాన కారణం గనుల కప్పులు కూలిపోవడమేననీ, ఈ విధంగా కూలిపోకుండా పోటు పెట్టడానికి తగిన సంఖ్యలో స్లీపర్లను సరఫరా చేయాలనీ కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కె. ఎల్. నరసింహరావు నేడు శాసనసభలో చేసిన సూచనను ఆ గనుల మేనేజిమెంటుకు తెలియ జేస్తామని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు.

వైకప్పు కూలి గనులలో ప్రమాదాలు జరగకుండా నివారించడానికి యిప్పుడు ఎక్కువగా యినుకను వాడుతున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ గనులలో జరుగుతున్న ప్రమాదాలు ఇతర గనులలోని ప్రమాదాలతో పోల్చి చూస్తే తక్కువగానే ఉన్నాయని అన్నారు. ఈ గనుల ప్రాంతాలలో ప్రమాదాలు జరిగినప్పుడు వైద్యశాలలకు తీసుకొని పోయే వాహనాలను, అందుకు సంబంధించిన సౌకర్యాలను హెచ్చు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. గనుల ప్రాంతానికి ఆస్పత్రి దూరంగా ఉండటంవలనఇది అవసరమని అన్నారు.

అంతకుముందు కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ వి. కె. ఆదినారాయణరెడ్డి అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి జవాబుయిస్తూ తృతీయ ప్రణాళికా కాలంలో ఉత్పత్తి పెంచడానికి రు 3 కోట్ల 40 లక్షల మేరకు విదేశ ద్రవ్యం అవసరమని అన్నారు.

అనుబంధ ప్రశ్నలకు సమాధానం యిస్తూ గనుల విస్తరణకు డబ్బు కొదువ ఏమీ లేదన్నారు.

అక్కడ ఉన్న బొగ్గు-పొడుము, విడిభాగాల తయారీకి ఉపయోగించడానికి ఎంతవరకు వీలుపడుతుందని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ వంకా సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు ఆ విషయాన్ని పరిశీలించ వలసి ఉంటుందని ముఖ్యమంత్రి సమాధానం చెప్పారు. విదేశాలనుండ రావలసిన యంత్రపరికరాలన్నీ ఈ సంవత్సరంలోగా వచ్చేస్తాయని అన్నారు.

## చెన్నారెడ్డి వివరణ

(1 వ పేజీ తరువాయి)

గాను కేటాయించడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

### వెనుకబడిన ప్రాంతాల్లో

వెనుకబడిన ప్రాంతాలలో ప్రజలు తమ వాటా ధనాన్ని ఎక్కువ మొత్తాలను సమకూర్చుకోలేని పేద స్థితిలో ఉంటారు. అందువేత ఇటువంటి వెనుకబడిన ప్రాంతాలలో మంచి నీటి సరఫరా పథకాలకయ్యే ఖర్చులో సగం ప్రజలనుండి రావాలన్న నిబంధన సడలించి అట్టి ప్రాంతాలలో మూడు వంతుల ఖర్చును ప్రభుత్వమే గ్రాంటు చేయడానికి, అక్కడ ఉద్యోగులకు అధికారాలిచ్చాం. పంచాయతీ సమితి జిల్లా పరిషత్తుల సిఫారసులపై ఆయా ప్రాంతాలలో 25% కంటెకూడా ప్రజల వాటాతగ్గించడానికి కలెక్టరుకు అధికారం ఉంటుంది.

రాతిని బద్దలుకొట్టి నూతులు త్రవ్వవలసిన ప్రాంతాల్లో మంచినీటి సరఫరా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 40 డ్రిల్లింగ్ (పవర్) యంత్రాలను, 8 ఎయిర్ కంప్రెసర్లను మంజూరు చేసింది. రు 50 వేల వరకు ఖర్చు అయ్యే మంచినీటి సరఫరా స్కీములను మంజూరు చేయవచ్చునని పంచాయతీ సమితులకు, జిల్లా పరిషత్తులకు కూడా ఉత్తర్వులు జారీ చేశాం."

### కొత్త పంచాయితీ సమితులు

ఈ ఏడు రాష్ట్రంలో 84 కొత్త పంచాయితీ సమితులను ఏర్పాటు చేస్తున్నామని శ్రీ చెన్నారెడ్డి ప్రకటించారు. మిగిలిన బ్లాకులలో పంచాయతీ సమితులను నిర్మించే విషయం 1964 వరకు వాయిదా వేస్తున్నామని అన్నారు.

ఇటీవలనే ఆమోదించిన పంచాయతీ సమితుల, జిల్లా పరిషత్తుల బిల్లుప్రకారం శాసనసభ్యులు ఈ సంస్థల కార్య నిర్వాహకులుగా ఇక ఉండడానికి వీలు లేదన్నారు. స్థాయీ సంఘాల ఎన్నికలు దామాషా ప్రాతినిధ్యసూత్రం ప్రకారం జరుగుతాయని అన్నారు.

### ఖర్చు తగ్గింపు

స్టేషనరీ, పోస్టేజీ, ఆఫీసు అవసరాలు ఉద్యోగులకు భవనాల నిర్మాణం మొదలైన ఖర్చులను తగ్గించ వలసిందిగా కేంద్ర సమాజవికాసశాఖ ఆదేశానుసారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులుయిచ్చిందని మంత్రి అన్నారు. ఈ తగ్గించిన ఖర్చును వ్యవసాయం నిమిత్తం ఉపయోగించ వలసిందిగా తెలిపామన్నారు.

### ప్యాకేజి స్కీము విస్తరణ

ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలో అమలు జరుపుతున్న ప్యాకేజి పథకాన్ని సవరించిన రూపంలో మరో 10 జిల్లాలకు విస్తరింప చేయాలని తాము యోచిస్తున్నట్లు తెలియచేశారు.

## టెండరు ప్రకటన

కొడవటికల్లు పంచాయతీ ఆఫీసు భవనము కట్టుటకు ఈ దిగువ సంతకము చేసినవారిచే సీలువేసిన పర్సంటేజి టెండర్లు ది 12-3-63 తారీఖున ఉదయము 11-30 గంటలకు తీసుకోబడును. వివరములు పంచాయతీ ఆఫీసులో, ఆఫీసు పనిచేయు వేళలలో పొందవచ్చును.

ఆఫీసు భవనము కట్టుట : ఎస్టిమేటు మొత్తము రు. 6000-00, ధరావతు రు. 600-00 లు.

**వాసిరెడ్డి సాంబశివరావు,**
పంచాయతీ ప్రెసిడెంటు, కొడవటికల్లు.
నందిగామ తాలూకా 6-3-63.

## టెండరు నోటీసు

ది ఖమ్మం కో-ఆపరేటివుమార్కెటింగ్ సొసైటి లిమిటెడ్, ఖమ్మం.
రి. నెం. 6227 టెలిఫోన్ నెం. 98

ఈ దిగువ సుదహరించిన పనిచేయుటకై గాను సీలువేసిన టెండర్లు 21-3-63 తేదీ ఉదయం 11 గంటలలోగా మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుల వారిచేగాని, లేక వారిచే అనుమతింపబడ్డ వారిచేగాని తీసుకొనబడును. ఆరోజు సాయంత్రం 4 గంటలకు హాజరుగావున్న కాంట్రాక్టర్ల సమక్షములో టెండర్లు తెరువబడును. డిపాజిట్ చెల్లించని టెండర్లు అంగీకరించబడవు. ది 15-3-63 నుండి 20-3-63 వరకు సొసైటీ కార్యాలయంలో టెండరు ఫారములు అమ్మబడును. ఫారం 1కి రు. 10-00 చెల్లించి తీసుకొనవలెను. మిగతా వివరములు సొసైటీ కార్యాలయం పనిచేయు కాలములో కార్యదర్శినుండి తెలుసుకొనవచ్చును. టెండరుదారు లోకల్ బోర్డులో గాని, పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటు, హైవేస్ లేక రైల్వే డిపార్టుమెంటులలో గాని రిజిష్టర్డు కాంట్రాక్టరై వుండవలెను.

గోదాము, ప్రాసెసింగ్ యంత్రముల షెడ్ నిర్మాణం. ఎస్టిమేటు సుమారు రు. 36,000, డిపాజిట్ రు 900.

**కె. సత్యనారాయణ,**
కార్యదర్శి,
ది ఖమ్మం కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్.

# మద్యపాననిషేధాన్నిరద్దుచేసి ప్రభుత్వాదాయం పెంపుదల

## రాజ్యసభలో బడ్జెట్‌పై ప్రసంగిస్తూ శ్రీ యం. యన్. గోవిందన్‌నాయర్ సూచన

న్యూఢిల్లీ, మార్చి 6

పూర్తిగా విఫలమైన మద్యపాన నిషేధాన్ని రద్దుచేయడమూ, నూనె పంపకాన్ని ప్రభుత్వం చేపట్టడమూవంటి ప్రత్యామ్నాయ చర్యల ద్వారా అధిక ఆదాయాలను రాబట్టవచ్చునని, కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ యం. యన్. గోవిందన్ నాయర్ నేడు రాజ్యసభలో బడ్జెట్‌పై ప్రసంగిస్తూ సూచించారు.

ఈ బడ్జెట్ సోషలిస్టు ధ్యేయంతో కూడివుందని ఐ. యన్. టి. యు సి. నాయకుడు శ్రీ ఖండ్‌భాయ్ దేశాయ్ నేడు బడ్జెట్‌పై రాజ్యసభలో జరిగిన యీనాటి చర్చలో చెప్పారు. ఇట్టి బడ్జెట్టును ప్రతిపాదించినందులకు ఆయన ఆర్థిక మంత్రిని ప్రశంసించారు. అధిక లాభాల పన్నును శ్రీ దేశాయ్ గట్టిగా సమర్థించారు.

ఈబడ్జెట్ వలన పేదప్రజానీకం, దిగువ-మధ్యతరగతి ప్రజానీకము జీవన పరిస్థితులు మరింత అధ్వాన్న మవుతాయని శ్రీ బి. కె. గైక్వాడ్ (రిపబ్లికన్) విమర్శించారు.

మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యుల జీతాలు తగ్గించాలని ఆయన సూచించారు.

శ్రీమతి సీతాపరమానంద్ (కాం) బడ్జెట్టు ప్రతిపాదనలను సమర్థించారు. పేద ప్రజలు వాడే నూనెపై పన్ను విధించరాదన్నారు.

పూర్తిగా విఫలమయిన మద్యపాన నిషేధాన్ని రద్దుపరచడంవంటి ప్రత్యామ్నాయ చర్యలద్వారా అధిక ఆదాయ వనరులను ప్రభుత్వం సేకరించవచ్చునని శ్రీ యం. యన్. గోవిందన్ నాయర్ సూచించారు.

కిరసనాయిల్‌పై పన్ను సామాన్యప్రజలను క్రుంగదీస్తుందని, అందువలన కిరసనాయిల్‌పై పన్ను విధించేదానికన్నా, నూనె పంపకాన్ని ప్రభుత్వం తీసుకోవాలని సూచించారు.

ధరలు పెరగకుండ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని ఒక కాంగ్రెసు సభ్యుడు సూచించారు.

రైతులకు నిర్బంధ పొదుపు ఉద్యమం "ఆదరణ సాధ్యం కాదని" సోషలిస్టు సభ్యుడు విమర్శించారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఉపసంహరించకపోతే రైతులు ఆందోళన చేస్తారన్నారు.

కిరసనాయిల్‌పై పన్ను పూర్తిగా రద్దుచేయకపోయినా, తగ్గించమని శివ నందరామున్ (కాం) సూచించారు.

బొంబాయి, మార్చి 5

జంషెడ్‌పూర్‌లోని టాటా ఇనుము-ఉక్కు కర్మాగారంలో ఫిబ్రవరి నెలలో ఉత్పత్తి బాగా పడిపోయింది. జనవరి నెలలో 126.5 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగిన ఉక్కు ఫిబ్రవరిలో 113/00 లకు పడిపోయింది.

## చైనాకు భారత్ జవాబు

### కొలంబో ప్రతిపాదనలపై

న్యూఢిల్లీ, మార్చి 6

కొలంబో ప్రతిపాదనలపై చైనా పంపిన తాజాపత్రానికి భారతప్రభుత్వం నేడు చైనాకు జవాబు పంపింది.

చౌ ఎన్ లై మూడురోజుల క్రితం భారత ప్రభుత్వానికి ఒక లేఖ వ్రాశారు. ఆ లేఖ, నిన్న పీపుల్సు డెయిలీ వ్రాసిన సంపాదకీయానికి, మార్షల్ చెన్-యీ ప్రసంగానికి అనుగుణంగా వున్నదని భావిస్తున్నారు.

భారత ప్రభుత్వం జవాబులోవున్న విషయాలను వెల్లడించలేదు. ఈ సమాధాన పత్రంలో భారత వైఖరి స్పష్టంగానే చెప్పినట్లు విశ్వసనీయవర్గాలు భావిస్తున్నాయి.

# పాఠ్యగ్రంథాల ప్రచురణలో జరుగుతున్న మోసాలు

## రాష్ట్ర శాసనసభలో శ్రీ వెల్లంకివిశ్వేశ్వరరావు ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6

కృష్ణా, గుంటూరుజిల్లాలలోప్రభుత్వం నిర్ణయించిన పాఠ్య గ్రంథాలను ప్రచురించేసంస్థలు 21 వున్నాయని, ఇందులో 11 తెనాలిలోనే వున్నాయని విద్యాశాఖా మంత్రి శ్రీ పి. వి. జి. రాజు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు.

ఒకే ప్రచురణకర్త వేరు వేరు పేర్లు పెట్టుకొని ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నమాట నిజమా అని శ్రీ వెల్లంక విశ్వేశ్వర రావు చేసిన ప్రశ్నకు సమాధానంగా విద్యామంత్రి ఆ విషయం పరిశీలించవలసి వున్నదని అన్నారు.

### నమూనా వ్యవసాయ క్షేత్రాలు

జపాన్ నిపుణుల సహాయంతో నమూనా వ్యవసాయ క్షేత్రాలను ప్రారంభించే ప్రతిపాదనలు వున్నాయని రాష్ట్ర మంత్రి శ్రీ బలరామిరెడ్డి అన్నారు.

రాజేంద్రనగర్, బాపట్లలలో ఈ కేంద్రాలు నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, ఇంతవరకు, జపాన్ నిపుణుల నివేదిక అందలేదు, అంతిమ నిర్ణయం జరగలేదు. జపాను ఉచితంగా సరఫరా చేసిన పరికరాల వినియోగాన్ని రైతులకు తెలియ చేసేటందుకు ఇవి ప్రధానంగా ఉద్దేశించబడ్డాయి.

### వార్ధక్య భృతి పథకం

పెద్దగా ప్రచారంచేసుకున్న వార్ధక్య భృతి పథకంపై ఎంత ఖర్చుపెట్టిందీ ఖచ్చితంగా చెప్పడాన్ని ఆర్థికమంత్రి శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తప్పించుకున్నారు. అనేకమంది సభ్యులు వివరాలు చెప్పమని పట్టుబట్టగా, అవి తనదగ్గరలేవని; తరువాత సేకరించుతానని అన్నారు. అయితే గత సంవత్సరం కేటాయించిన మొత్తం ఖర్చు కాలేదని ఆయన అంగీకరించారు.

### గ్రామానికొక సహకారసంఘం

కొంతమంది జనాభాకు తగ్గని ప్రతి గ్రామంలోను ఒక సహకార సంఘాన్ని స్థాపించాలన్నది ప్రభుత్వ విధానమని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి తెలియచేశారు. తెలంగాణాలో గ్రామాలకనిష్ట జనాభా సంఖ్యను 750 కి తగ్గించారు. ప్రతి గ్రామంలోను పంచాయతీ వుంటే సహకార సంఘం వుండాలన్న సూత్రాన్ని ప్రభుత్వం అంగీకరించిందా అని ప్రశ్నించగా, ఈవిషయమై పరిశీలన జరుగుతున్నదని ఆయన అన్నారు.

### నెల్లూరు సహకారకేంద్ర సంఘ వ్యవహారాలు

నెల్లూరు సహకార కేంద్ర సంఘం లెక్కలపై ఆడిట్ జరిగిందని, ఆడిట్ రిపోర్టును పరిశీలించుతున్నారని, అటు తరువాత ఆడిట్ సర్టిఫికెట్ ఇస్తారని శ్రీ గురుస్వామిరెడ్డికి ఆర్థికమంత్రి సమాధానమిచ్చారు.

1962 జూన్ 30 వ తేదీనాటికి సహకార కేంద్రసంఘం, ఆంధ్రస్టేట్ సహకారబ్యాంకుకు రు. 88.76 లక్షలుఅప్పు వున్నది. సొసైటీలు కేంద్ర సంఘానికి రు. 125.12 లక్షలు బాకీ వున్నాయని మంత్రి తెలియచేశారు.

### హైదరాబాదులో ఉన్నత సాంకేతిక విద్యాలయం

హైదరాబాదులో ఉన్నత సాంకేతిక విద్యాలయాన్ని ప్రారంభించే ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే వున్నదని శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు ప్రశ్నకు విద్యాశాఖా మంత్రి సమాధానమిచ్చారు. వచ్చే విద్యా సంవత్సరంలో దానిని ప్రారంభించే అవకాశాలు లేవని మంత్రి అన్నారు.

## మూడేండ్ల డిగ్రీ కోర్సును మార్చేది లేదు

న్యూఢిల్లీ, మార్చి 6

"మూడేండ్ల డిగ్రీకోర్సును గురించి తన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చుకొనదలచ లేదు" ని నేడు లోక్ సభలో విద్యామంత్రి డాక్టర్ కె.యల్. శ్రీమాలీ తెలియచేశారు.

శ్రీ విద్యాలంకార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ విద్యాసంస్థలు బాగా చర్చలు జరిపి, జాగ్రత్తగా పరిశీలించిన తరువాతనే మూడేండ్ల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టడానికి నిర్ణయించినదనీ, ఆ నిర్ణయాన్ని మార్చుచేయు దలచ లేదని ఆయన చెప్పారు.

# అత్యవసర పరిస్థితిలో కూడా భూమిపంపకం

## రాజ్యసభలో శ్రీ భూపేష్‌గుప్త ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

న్యూఢిల్లీ, మార్చి 6

అత్యవసరపరిస్థితులు వున్నాయి కాబట్టి ప్రభుత్వ భూములను, భూమిలేని పేదలకు పంచడం ఆపుచేసే సమస్య లేదని కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శ్రీ డా. రాంసుభాగ్ సింగ్ నేడు రాజ్యసభలో శ్రీ భూపేష్‌గుప్త ప్రశ్నకు సమాధానంగా తెలియచేశారు.

ప్రభుత్వపు బంజరు భూమిగావున్న 6,31,500 యకరాలను 75 వేల కుటుంబాలకు ఇవ్వాలని భారత ప్రభుత్వం ఆలోచించుకున్నట్లు ఆయన తెలియచేశారు.

పంపక కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు తొమ్మిది రాష్ట్రాలలో ఇప్పటికే పూర్తి అయ్యాయని ఆయన అన్నారు.

ఆంధ్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితి వంక చెప్పుకొని భూమి పంపకాన్ని ఆపుచేసినమాటనిజమేనా అని ప్రశ్నించగా, ఆంధ్రప్రభుత్వంపంపకాల కార్యక్రమాన్ని ఆపుచేయలేదని డా. రాంసుభాగ్ సింగ్ అన్నారు. ఈసమస్యను ఆంధ్ర వ్యవసాయ మంత్రితో ఈ విషయమై చర్చించినట్లుకూడా ఆయన తెలియచేశారు.

ఎంత బంజరుభూమి పంపకానికి లభించుతుందో వివరాలులభ్యం కాలేదని, ఈ సమాచారాన్ని సేకరించడంజరుగుతున్నదని అంతకు ముందు ఆయన అన్నారు. మహారాష్ట్రలో ఇంతవరకు 85 వేల యకరాలను పంపకం చేశారట. ఇతరరాష్ట్రాలలో కూడా ఈ కార్యక్రమం సాగుతున్నట్లు ఆయనచెప్పారు. ఖచితమయిన అంకెలను ఆయన చెప్పలేకపోయారు.

ఉన్నత విద్య, శాస్త్ర సాంకేతిక విద్యాసంస్థల పరిశీలనకై ఐదుగురు పార్లమెంటు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేయబడుతుందని కేంద్ర విద్యామంత్రి డా॥ కె. యల్. శ్రీమాలి చెప్పారు.

## జీతాల నిరాకరణ

### విజయవాడ మున్సిపల్ కార్మికుల చే

విజయవాడ, మార్చి 6

ఇంతవరకూతమకు యిస్తున్న కంపెన్సేటరీ అలవెన్సులను కొంత కోత పెట్టినందుకు నిరసనగా విజయవాడ మునిసిపల్ కార్మికులు నేడు తమ జీతాలను తీసుకో నిరాకరించారు.

ఈ విషయాన్ని పురపాలకశాఖా మంత్రి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్యకు, యూనియన్ అధ్యక్షులు, శాసనసభ్యులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గారు టెలిగ్రాముల ద్వారా తెలియపర్చారు. కోతకోసిన అలవెన్సును యిప్పించాలని కూడా అందులో కోరారు.

పట్టణ మునిసిపల్ వర్కర్సు యూనియన్ పిలుపు ననుసరించి జీతాలను తీసుకో నిరాకరించారు.

పాక్-చైనా ఒప్పందం

# తమకే 800 చదరపు మైళ్లు లభించినట్లు భుట్టో ప్రకటన

హాంగ్ కాంగ్, మార్చి 6

గత శుక్రవారంనాడు పాకిస్తాన్ - చైనా దేశాలు సంతకాలు చేసిన సరిహద్దు ఒప్పందం ప్రకారం, "ప్రస్తుతం పాకిస్తాన్ స్వాధీనంలో వున్న ఏ మాత్రం భూభాగాన్నీ" చైనాకు ఒప్పగించలేదని పాకిస్తాన్ విదేశాంగమంత్రి భుట్టో నేడిక్కడ చెప్పారు.

పైపెచ్చు, ఈ ఒప్పందం ప్రకారం పాకిస్తాన్ 8 వందల చదరపు మైళ్ళను సాధించిందనీ, "మాకు లభించే ఈ భూభాగం చెప్పుకోదగినంత ఆర్థిక విలువ"గలదని ఆయన చెప్పారు. ఆయన కరాచీకి బయుల్దేరేముందు ఈ ప్రకటన చేశారు.

షింషాక్ లోయలోగల పచ్చికమైదానాలు ఈ భూభాగంలోకి వస్తాయి అని ఆయన చెప్పారు.

ఈ ప్రాంతంలో చైనా సాగించిన నిర్మాణాలను వారు ఖాళీ చేశారని ఆయన వెల్లడి చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం చైనాకు వచ్చే భూభాగం గురించి పరిశీలకు లందరూ చేసిన వ్యాఖ్యలు అంకెల గారడీయేనని భుట్టో వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ చైనాకు కట్టబెట్టిన భూభాగం కొన్నికొన్ని దేశాల దౌత్య ప్రయోజనాలనుబట్టి పాకిస్తాన్ చైనాకుకట్టబెట్టినభూభాగం అంకెలుకూడా మారిపోయాయి అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ అంకెల గారడీపట్ల పాకిస్తాన్‌కు ఆసక్తి లేదనీ, పాకిస్తాన్‌కు న్యాయసమ్మతంగా రావలసిన భూభాగం పాక్కు భద్రంగానే వున్నాయనీ ఆయన చెప్పారు.

ఈ పాకిస్తాన్-చైనా సరిహద్దు ఒప్పందాన్ని "ఇతర ప్రయోజనాల కోసం" ఉపయోగించుకుంటున్నారని ఆయన విమర్శించారు. పాకిస్తాన్ 4వేల చదరపు మైళ్ళు ధారాదత్తం చేస్తున్నట్లు ఒక దశలోనూ, తరువాత 3 వేలనీ, ఆ తరువాత 2వేల మైళ్ళనీ అన్నారు; ఇప్పుడేమో పాకిస్తాన్ 13వేల చదరపు మైళ్ళు చైనాకు ధారాదత్తం చేసినట్లు చెబుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

"లడక్ ప్రాంతం అంతా కలిపి 12 వేల చదరపు మైళ్లు అయితే, 13 వేల చదరపు మైళ్ళను చైనాకు వప్పగించడం ఎలా సాధ్యం"అని భుట్టో ప్రశ్నించారు.

## గన్నవరం ప్రాంతంలో పందిమాంసం ఫ్యాక్టరీ

### పని ప్రారంభించినట్లు శాసనసభలో వెల్లడి

హైదరాబాద్, మార్చి గ

రాష్ట్రంలో పశుగణాభివృద్ధి నిమిత్తం యీరోజు శాసనసభలో 2 కోట్ల 10 లక్షల రూపాయల డిమాండును ప్రతిపాదిస్తూ, మంత్రి శ్రీ బలరామిరెడ్డి పాలదిగుబడి పెంపొందించడానికి ఒంగోలుజాతి పశుసంతతిని అభివృద్ధి పర్చాల్సి వుందనీ, యిందుకోసం కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలను విరివిగా ఏర్పర్చాల్సి వుందనీ అన్నారు. గన్నవరం సమితి ఆత్కూరు గ్రామ సమీపంలో పందుల పోషణ కేంద్రాన్ని, పందిమాంసాన్ని భద్రపర్చే మరో కేంద్రాన్ని నిర్మించ తలపెట్టినట్లు వివరించారు. ఇందుకోసం ప్రాథమిక ఏర్పాట్లు అన్నీ పూర్తి అయినట్లు ఆయన తెలిపారు.

# అదనపు భూమిశిస్తు చట్టాన్ని 'వాయిదా వెయ్యబోము'

## రాష్ట్ర శాసనమండలిలో రెవిన్యూమంత్రి ప్రకటన

హైదరాబాదు, మార్చి 6

1962 అదనపు భూమిశిస్తు చట్టం వలన రైతాంగంలో ఏర్పడిన అసాధారణ అలజడి ఫలితంగా ఆ చట్టాన్ని వాయిదా వేయబోమని రెవెన్యూ మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి నేడు రాష్ట్ర శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు.

శ్రీ యన్. రామకృష్ణయ్య వేసిన ప్రశ్నకు సమాధానంగా పై చట్టాన్ని మార్చమని కేంద్రప్రభుత్వం నుండిగాని, ప్రణాళికాసంఘం దగ్గరనుండిగాని ఎటువంటి ఆదేశమూ రాలేదనిమంత్రిఅన్నారు.

విజయవంతమైన
6 వ వారం
మెహబూబ్ పొడక్షన్స్
సన్ ఆఫ్ ఇండియా
(టెక్నికలర్ సాంఘిక చిత్రం)



విజయవాడ-శ్రీనివాసమహల్
2 వ వారం
విశాఖపట్నం-అలంకార్
నేటినుండి
కాకినాడ - మినర్వా
రేపటినుండి: గుంటూరు -
శ్రీ లక్ష్మీపిక్చర్‌ప్యాలెస్
—నవయుగ.



హాజిల్ ప్రాడక్ట్సు లిమిటెడ్
136, కానింగ్ స్ట్రీట్
కలకత్తా
BP-3-79/
మెస్సర్సు తె. రాంసన్ & కంపెనీ (131)
511, పూనమల్లి హైరోడ్, మద్రాసు-3.

నేడే చూడండి!
మ్యాట్నీతో ప్రారంభం
నెల్లూరు....శ్రీ వినాయక సినిమా
ఏలూరు....శ్రీ గోపాలకృష్ణాటాకీస్
శ్రీ సారధి స్టూడియోస్ చిత్రం
కలసివుంటే కలదు సుఖం

## రేడియో

శనివారం, మార్చి 9
శక 1884, ఫాల్గుణ 18

### విజయవాడ

857.1 మీ (840 కిలో సై.)

ఉదయం: 6-30 శుభోదయం; 6-35 ప్రసార విశేషాలు; 6-45 భక్తి రంజని: బొమ్మరాజు సీతారామదాసు కృతులు; 6-55 సూక్తిముక్తావళి; 7-00 తె. వా; 7-15 శేటి విశేషం; 7-20 సంగీత శిక్షణ; 7-30 వాద్యబృందం; 8-00 ఆం. వా; 8-15 శ్రీరంగం గోపాలరత్నం; 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11-30 రాష్ట్రగానం; 11-40 ఉన్నత పాఠశాలలకు; 12-10 భారతదేశం - చైనాభూతం (రూపకం); 12-30 కార్మికులకు; 1-00 వనితావాణి; 1-30 గానసుధ; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 బొమ్మరిల్లు; 3-00 ప్రసార సమాప్తి

సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా; 6-20 గ్రామస్థుల కార్యక్రమం; 7-00 తె. వా; 7-15 గ్రామస్థుల కార్యక్రమం; 7-30 దేశరక్షణ - మన కర్తవ్యం (ప్రసంగం); 7-40 విరామ సంగీతం; 7-45 అభిజ్ఞుల అభిప్రాయం; 8-00 ఫిల్మ్ సంగీతం; 8-15 ఉభయకుశలోపరి; 8-30 ఆంగ్లమున; 8-40 లలిత సంగీతం; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లమున; 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం; 11-05 ప్రసార సమాప్తి.

### హైదరాబాద్ - ఎ

405.4 మీ (740 కిలో సై.)

ఉదయం: 6-30 సుప్రభాత్; 6-35 కార్యక్రమ వివరణ; 6-45 భక్తిరంజని; 6-55 సూక్త ముక్తావళి; 7-00 తె. వా; 7-15 ప్రస్తుతాంశం; 7-20 సంగీత శిక్షణ; 7-30 దేశభక్తి పాటలు; 7-45 రాష్ట్రీయగాన్; 8-00 ఆం. వా; 8-15 విజయవాడవలె; 9-00 ప్రసారసమాప్తి.

మధ్యాహ్నం: 11-40 ఉ. పాఠశాలలకు; 12-10 మా. పాఠశాలలకు (ఉర్దూ); 12-30 కార్మికులకు; 1-00 వనితావాణి; 1-30 లలిత్ సంగీత్; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 హై. బి. వలె; 2-10 ఉ. వా; 2-20 హై. బి. వలె; 2-30 ప్రసార సమాప్తి.

3-30 బాలానందం; 4-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా; 6-20 నవరస్ (ఉర్దూ); 7-00 తె. వా; 7-15 హారోలీ గీత్; 7-25 శ్రోతల ఉత్తరాలకు జవాబులు (ఉర్దూ); 7-30 ఉ. వా; 7-45 అభిజ్ఞుల అభిప్రాయం; 8-00 ప్రసంగం (హిందీ); 8-15 ఆంగ్లమున; 8-25 విరామ సంగీతం; 8-30 ఆంగ్లమున; 8-40 విరామ సంగీతం; 8-45 పరిచయ పత్రం; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లమున; 9-30 రామురాటే; 11-05 ప్రసారసమాప్తి.

### హైదరాబాద్ - బి

89.42 మీ (3355 కిలో సై.)

ఉదయం: 6-30 హై. ఎ. వలె; 7-45 ప్రసార సమాప్తి.

49.02 మీ (6120 కిలో సై)

8-00 హై. ఎ. వలె; 9-00 ప్రసార సమాప్తి.

42.02 మీ (7140 కిలో సై)

మధ్యాహ్నం: 11-40 హై. ఎ. వలె; 12-10 వయొలిన్; 12-30 హై. ఎ. వలె; 2-00 వాతావరణ సూచన, వయొలిన్; 2-30 ప్రసార సమాప్తి.

3-30 హై. ఎ. వలె; 4-00 ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలో సై.)

సాయంత్రం: 6-0 హై. ఎ. వలె; 6-20 గ్రామస్థుల కార్యక్రమం; 7-00 తె. వా; 7-15 గ్రామస్థుల కార్యక్రమం; 7-30 ప్రసంగం; 7-45 హై. ఎ. వలె; 8-00 గానామృతం; 8-15 హై. ఎ. వలె; 11-05 ప్రసార సమాప్తి.

### మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలో సై.)
60.98 మీ (4920 కిలో సై.)

ఉదయం: 6-45 మంగళగానం; 7-00 తె. వా; 7-15 సుప్రభాతం (సంస్కృతమున) 7-30 కోయిది కరిప్పాగళ్; 8-00 ఆం. వా; 8-15 ప్రసార సమాప్తి.

49.30 మీ (7160 లో సై)

మధ్యాహ్నం: 1-00 మ. ఎ. వలె; 1-30 ఆం. వా; 1-40 గీతమంజరి; 1-50 తె. వా; 2-00 ప్రసార సమాప్తి.

3-00 ఆంగ్లమున; 3-30 పిల్లలకు; 4-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 6-00 ఆంగ్లమున వార్తలు; 6-05 ప్రాంతీయ కెయిదిగళ్; 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు (ఆంగ్లం); 6-30 కార్యక్రమ వివరణ (తమిళం); 6-35 క్లారినెట్; 7-00 తె. వా; 7-15 సంగీతమాల; 7-30 హాస్యవినోదంబ కార్యక్రమం; 8-30 ఎస్. క్యాములు; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లమున; 9-30 ఆంగ్లమున; 9-40 వాద్యసంగీతం; 9-45 పాశ్చాత్యసంగీతం; 11-00 ఆం. వా; 11-05 ప్రసార సమాప్తి.

# కమ్యూనిస్టు నాయకులను విడిచిపెట్టకుండా ఉప ఎన్నికలను జరపరాదు:

## పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు కమిటీ ప్రకటన

కలకత్తా, మార్చి 7

కమ్యూనిస్టు నాయకులను, ఇతర రాజకీయ డిటెన్యూలను విడుదల చేయకుండానే రాష్ట్రంలో శాసనసభా ఉప ఎన్నికలను జరపడానికి ప్రభుత్వం సన్నాహాలను జరపడంపట్ల పశ్చిమ బెంగాల్ ప్రదేశ్ కమ్యూనిస్టు ఆర్గనైజింగ్ కమిటీ తన నిరసనను తెలియజేసింది.

ప్రదేశ్ ఆర్గనైజింగ్ కమిటీ చేసిన పత్రికా ప్రకటనలో యిలా వుంది:

అత్యవసర పరిస్థితిని తొలగించకుండానే, చివరికి రక్షణ చట్టంక్రింద, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంక్రింద, పశ్చిమబెంగాల్ సెక్యూరిటీచట్టంక్రింద జైళ్లలో డిటెయిన్ చేయబడివున్న కమ్యూనిస్టులను, ఇతర రాజకీయఖైదీలను విడుదల చేయకుండానే రాష్ట్రంలో త్వరలోనే శాసనసభ ఉపఎన్నికలను జరపడానికి ప్రభుత్వంనిశ్చయించుకోడం మాకు తీవ్రమైన ఆందోళనను కలిగించుచున్నది.

ప్రస్తుత అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఉప ఎన్నికలను జరపడం వాయిదా వేయవలసిందిగా కమ్యూనిస్టుపార్టీ వారు, ఇదివరలో కోరారు. కాని ఈ కోర్కెను నిరంకుశంగా ఎన్నికలకమిషన్ తిరస్కరించినందుకు మా తీవ్ర అసమ్మతిని తెలియజేస్తున్నాం. కాంగ్రెసేతర పార్టీలను సంప్రతించకుండానే ఎన్నికల కమిషన్ ఈ విషయంలో తుది నిర్ణయాన్ని తీసుకొన్నది. ఈ విధంగా అది పాలకవర్గ తరపున రాజకీయమైన పక్షపాతం వహించింది. ఈ విపరీతమైన పరిస్థితులను ఆధారం చేసుకొని, అన్ని స్థానాలను కాజేయాలని కాంగ్రెసు పార్టీ అభిలషించుతోంది.

### అక్రమ అరెస్టులూ, నిర్బంధాలూ

"పశ్చిమ బెంగాల్‌లో ప్రధానమైన ప్రతిపక్షంగా వున్న కమ్యూనిస్టు పార్టీకి చెందిన 600 మంది నాయకులను, కార్యకర్తలను అత్యవసర పరిస్థితులనుప్రకటించబడగానే జైలులో నిర్బంధించారు. వారిలో ఒక్కరిని కూడా యిప్పటి వరకూ వరకూ విడుదల చేసి వుండలేదు. పైపెచ్చు దాదాపు ప్రతిరోజూ కొత్తవారిని అరెస్టుచేస్తున్నారు. ఇటీవలకాలంలో కొంతమంది కాంగ్రెసువాదులు, స్వార్థప్రయోజనం గల మరికొంతమందీ, ఫ్యాక్టరీయజమానులూ, కమ్యూనిస్టులూ, ట్రేడ్ యూనియన్ల, కిసాన్ సభ కార్యకర్తలూ చట్టవిరుద్ధచర్యల్లో పాల్గొంటున్నారని ఫిర్యాదులు చేసిన తక్షణమే అరెస్టులు చేయడం ప్రారంభించారు. ఆ ఫిర్యాదులలో ఏమైనా నిజం వున్నదా లేదా అనే విచారణనైనా కనీసం ప్రభుత్వం చేయతలపెట్టలేదు. అనేకమందిని విచారణ లేకుండా, వారిపై చార్జిషీటు అయినా పెట్టకుండా సబ్‌జైళ్ళల్లో కాలపరిమితి లేకుండా వుంచుతున్నారు. చివరికి వారిని జామీనుపై విడుదల చేయడానికి కూడా నిరాకరించుతున్నారు. రాజకీయ ఖైదీలుగా వారిని పై తరగతిలో వుంచక పోగా కక్షతో వారిని జైళ్ళలో దుర్భర పరిస్థితులకు గురిచేస్తున్నారు.

"ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నికలు జరిపితే కమ్యూనిస్టు పార్టీకి ప్రభుత్వ చర్యలను గురించి విమర్శించే తన న్యాయమైన హక్కును ఉపయోగించుకొనేందుకు వీలుండదు. ఏదిచెప్పినా అత్యవసర శాసనాలను ఉల్లంఘించినట్లు పరిగణించుతారు. ప్రధాన ప్రతిపక్షానికి నిరాకరించబడిన సదుపాయాలన్నింటినీ కాంగ్రెసు పార్టీ మాత్రం పూర్తిగా వినియోగించుకోగలదు. పాలకవర్గపార్టీ తెచ్చే వొత్తిడి దృష్ట్యా వోటర్లు స్వేచ్ఛగా వోటింగులో పాల్గొనేందుకు వీలుండదు. ఈవిధంగా ఎన్నికలు ఒక ఫార్సు క్రింద పరిణమించగలవు"

### కమ్యూనిస్టులపై ఆరోపణలు

కమ్యూనిస్టుపార్టీ, దాని సభ్యులు జాతీయ వ్యతిరేకులనీ, దేశభక్తిలేనివారని ప్రభుత్వ పార్టీ వారు చేసే నీచారోపణలను ప్రదేశ్ కమ్యూనిస్టు ఆర్గనైజింగ్ కమిటీతీవ్రంగానిరసించుతోంది. జాతీయ రక్షణకు మా పార్టీ జాతీయ సమితి తీసుకొన్న విధానాన్ని ముందుకు తీసుకొని పోవడమేగాక, దేశమంతా అంగీ

(మిగతా 3 వ పేజీలో)


నేడే చూడండి! మ్యాట్నీతో ప్రారంభం
రాష్ట్రపతి రజత, బంగారు పతకములు పొందిన అనాడి, అనూరాధ, వంటి ఉత్తమ చిత్రాలు నిర్మించిన
యల్. బి. ఫిలింసువారి అసలీ-నకిలీ (హిందీ)
దర్శకత్వం: హృషికేశ ముఖర్జీ
సంగీతం: శంకర్ జైకిషన్
దేవానంద్, సాధన, సంధ్యారాయ్, నజీర్ హుస్సేన్, లీలాచిట్నిస్.
విజయటాకీస్-రాజమండ్రి; విక్టరీటాకీస్-కర్నూలు
—శ్రీ ఫిలింస్.


దిగ్విజయముగానడుచుచున్న
3 వ. వారం
నవీన చిత్రా వారి
సవతికొడుకు
కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: Y. రంగారావు

ఆడుచున్న కేంద్రాలలో
శ్రీ వెంకటేశ్వర టాకీస్...విజయనగరం
విజయ పిక్చరు ప్యాలెస్...విశాఖపట్నం
సత్యగౌరి టాకీస్.........కాకినాడ
స్వామి టాకీస్...... రాజమండ్రి
శ్రీకృష్ణ టాకీస్..... అమలాపురం
శ్రీ శ్యాం మహల్.......... ఏలూరు
శ్రీ వెంకటేశ్వర టాకీస్.... తణుకు
మినర్వా ఆర్టు థియేటర్... భీమవరం
శ్రీనివాస సినిమా ......గుడివాడ
కృష్ణ కిషోర్ టాకీస్...మచిలీపట్నం
జైహింద్ టాకీస్ ........బెజవాడ
శ్రీ సరస్వతీ పిక్చరు ప్యాలెస్...గుంటూరు
స్వరాజ్ టాకీస్..........తెనాలి
విజయలక్ష్మి టాకీస్....... నెల్లూరు
శ్రీ జయరాం టాకీస్....... ఒంగోలు
రాధాకృష్ణ టాకీస్....... కర్నూలు
భాస్కర్ పిక్చర్ ప్యాలెస్ ...... కడప
శ్రీ కంఠం టాకీస్... అనంతపూర్
పంచరత్న టాకీస్ మదనపల్లి
హైదరాబాద్ దిల్షాద్
సికింద్రాబాద్ రాజేశ్వరి
వరంగల్ మార్కండేయ

ఆంధ్ర
మహాలక్ష్మి పిక్చర్సు
సీడెడ్
భాస్కర్ పిక్చర్సు
నైజాం
శ్రీ నేషనల్ ఆర్టు పిక్చర్సు


విజయవంతమైన 2వ వారం
ప్రసాద్ ఆర్టు పిక్చర్సు సమర్పించు
భార్యాభర్తలు
నిర్మాత: ఎ.వి.సుబ్బారావు
దర్శకత్వం: కె.ప్రత్యగాత్మ

విజయనగరం ... మినర్వా టాకీస్
విశాఖపట్టణం ... ప్రభాత్ టాకీస్
రాజమండ్రి ... కుమారి పిక్చర్ ప్యాలెస్
భీమవరం ... వెల్‌కం టాకీస్
గుడివాడ ... శ్రీ గంగామహల్
తెనాలి ... శ్రీ రత్నాటాకీస్
నెల్లూరు ... రంగమహల్
తదుపరి చిత్రం: విజయవాడ — శ్రీ విజయా టాకీస్.

3వ వారం
అరుణా ఫిలింస్ వారి
సోమవారవ్రతమహాత్మ్యం
దేవిక, కాంతారావు, రఘురామయ్య, సూరిబాబు, మిక్కిలినేని, బాలకృష్ణ
రచన: సముద్రాల
సంగీతం: వేణు
నిర్మాత, దర్శకుడు: R.M.కృష్ణస్వామి


13వ.వారం
శ్రీ సారధిస్టూడియోస్
ఆత్మబంధువు
దర్శకత్వం: రామకృష్ణ

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు), ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య, విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్: కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర [illegible], విజయవాడ - 2.